జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | మంగళవారం 03 మార్చి 2026 | సంపుటి: 18 | సంచిక: 357 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

విశ్వావసు నామ సంవత్సరం , మాఘ మాసము , ఫల్గుణం, తిథి: ద్వాదశి - 20:45:45 వరకు నక్షత్రం: పునర్వసు - 09:35:50 వరకు కరణం: బవ - 09:38:55 వరకు, బాల: వ - 20:45:45 వరకు పక్షం: శుక్ల యోగం: సౌభాగ్య - 17:01:49 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## స్టాక్ మార్కెట్లపై యుద్ధం ప్రభావం

తీవ్రంగా నష్టపోయిన సూచీలు

ముంబయి,మార్చి 1(ప్రజాజ్యోతి): ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో దేశీయ స్టాక్ మిగతా1 2లో..

## దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

క్షేమంగానే ఉన్నట్లు సమాచారం అందచేత

హైదరాబాద్,మార్చి 2(ప్రజాజ్యోతి): ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధ జరుగుతోంది. పశ్చిమ ఆసియా దేశాల్లోనెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దుబాయితో పాటు గల్ఫ్ దేశాలు తమ గగన తలాన్ని మూసేశాయి. దీంతో మిగతా 2లో..

# యుద్ధ జ్వాలలు

## ఇజ్రాయిల్ దాడులు ఉధృతం

- లెబనాన్‌పై దాడిలో హిజ్బుల్ చీఫ్ మృతి
- ఇజ్రాయిల్ దాడుల్లో 550 మంది మృతి
- ఇరాన్ అధికారిక మీడియా వెల్లడి
- ఇరాన్ దాడులతో బిక్కుబిక్కుమంటన్న దుబాయ్
- వరుస డ్రోన్ దాడులతో ప్రజల్లో భయాందోళనలు

లెబనాన్,మార్చి 2(ప్రజాజ్యోతి): పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ జ్వాలలు ఎగసిపడుతున్నాయి. లెబనాన్ లోని హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ జరిపిన భీకరవైమానిక దాడుల్లో లెబనాన్ పార్లమెంట్‌లోని హెజ్‌బొల్లా బ్లాక్ అధిపతి మహ్మద్ రాడ్ మరణించారు. ఆయన మృతి చెందినట్లు సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ వార్త 'అల్ హదత్' పేర్కొంది. దక్షిణ లెబనాన్ ప్రాంతంలోని హెజ్‌బొల్లా స్థావరాలపై సోమవారం ఇజ్రాయెల్ రక్షణ దళంవైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో మహ్మద్ రాడ్ మృతి చెందారు. ఈ ఉగ్రసంస్థకు చెందిన మరికొందరు ఉన్నతాధికారులు కూడా తమ దాడుల్లో మృతి చెందారని ఐడీఎఫ్ తెలిపింది. అయితే వారి వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 31 మంది మృతిచెందగా.. 149 మంది గాయపడినట్లు లెబనాన్ ప్రకటించింది. హెజ్‌బొల్లా నేతలు లెబనాన్ రక్షణ కంటే ఇరాన్ కోసం ఎక్కువ పని చేశారని, వారి చర్యలకు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని మిగతా 2లో..



## ఇరాన్ ప్రతీకార దాడులు ముమ్మరం

- సౌదీలో అతిపెద్ద చమురుశుద్ధి కేంద్రంపై దాడి
- ఇజ్రాయిల్ ప్రధాని కార్యాలయంపై దాడి
- నెతన్యాహు కార్యాలయాన్ని ఢీకొన్న క్షిపణి
- దాడిపై ఇరాన్ సంచలన ప్రకటన



టెహ్రాన్,మార్చి 2(ప్రజాజ్యోతి): అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. ఇప్పటికే అనేక భవనాలు, కీలక స్థావరాలు నేలమట్టం అయ్యాయి. అయితే తాజాగా సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన అరామ్‌కో రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి చేసినట్లు తెలుస్తోంది. రాస్ తనురాలోని ఈ రిఫైనరీపై షాహెద్-136 డ్రోన్‌తో దాడి చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీనికి సంబంధించిన దృశ్యాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్నాయి. ఈ దాడి ప్రభావం చమురు ధరలపై ఉంటుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ మీడియా కథనం ప్రకారం.. సోమవారం ఇరాన్ అరామ్ కో రిఫైననరీపై దాడి చేసింది. ఈ దాడి కారణంగా చమురుశుద్ధి కేంద్రం వద్ద భారీగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన నేపథ్యంలో ర్గి÷నైరీని తాత్కాలికంగా మూసివేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అయితే, ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని సమాచారం. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆస్తి, ప్రాణనష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులకు ఇరాన్ ప్రతీకార దాడులకు దిగిన తరువాత చమురు ధరలు గణనీయంగా పెరిగాయి. మిగతా 2లో..

## ఈ యుద్ధం మరో నాలుగైదు వారాలు జరగొచ్చు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్,మార్చి 1(ప్రజాజ్యోతి): ఇరాన్‌తో యుద్ధం మరో నాలుగు, ఐదు వారాలు జరగొచ్చని, ఆ యుద్ధం ముగిసేలోపు మరింత మంది ఎక్కువ అమెరికా సైనికులు మృతి చెందే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. మిగతా 12లో..



## పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు

శంషాబాద్ నుంచి పలు విమానాల రద్దు

హైదరాబాద్,మార్చి 1(ప్రజాజ్యోతి): రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం శంషాబాద్ నుంచి విదేశాలకు వెళ్లాల్సిన అనేక విమానాలు రద్దయ్యాయి. ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణం కారణంగా విమానాయన సంస్థలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి. శంషాబాద్ విమానాశ్రయం నుంచి దోహా, అబుదాబి, జెడ్డా, సౌదీ అరేబియా వెళ్లాల్సిన విమానాలు రద్దయ్యాయి. అలాగే కువైట్, దుబాయ్, మస్కట్, మదీనా వెళ్లే సర్వీసులు కూడా తాత్కాలికంగా నిలిపివేయబడ్డాయి. శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన మిగతా 12లో..

## రాహుల్‌ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం

### అందుకోసం కలసికట్టుగా పనిచేద్దాం

- రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమం
- డిసిసి శిక్షణ శిబిరం ముగింపులో సిఎం రేవంత్
- మోదీ దుర్మార్గాలపై యుద్ధం చేయాలి
- బయటపడుతున్న మోదీ దుర్మార్గ చర్యలు
- ఇరాన్ లాంటి దుస్థితి భారత్‌కు రాకూడదు
- మోదీ తీరుతో ప్రమాదంలో దేశ పరిస్థితి
- వికారాబాద్ కాంగ్రెస్ సమావేశంలో రాహుల్
- శంషాబాద్‌లో రాహుల్‌కు రేవంత్ స్వాగతం

వికారాబాద్,మార్చి 2(ప్రజాజ్యోతి): లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం మనమంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోడీ వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. రాషహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమమని అన్నారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు. ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం పొందానన్నారు. తనపై అనేక కేసులు పెట్టారని.. పరువు నష్టం దావాలు కూడా వేశారని పేర్కొన్నారు. దేశం కోసం, తమ కోసం మిగతా 12లో..



## కుమ్మెలర ఘటనపై కలెక్టర్ నివేదిక

బిసి కమిషన్‌కు సమర్పించినట్లు వెల్లడి

హైదరాబాద్,మార్చి 2(ప్రజాజ్యోతి): తెలంగాణ బీసీ కమిషన్ గత నెల 23వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌ను కుమ్మెర జాతర సంఘటనకై నివేదిక కోరడం జరిగింది. కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి 24వ తేదీన కుమ్మెర గ్రామాన్ని మిగతా 12లో..

## బాన్సువాడ ఘటన దురదృష్టకరం

- హిందువులంతా ఐక్యంగా పోరాడాలి
- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు

కామారెడ్డి,మార్చి 2(ప్రజాజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరం కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల బాన్సువాడలో జరిగిన ఘటన మిగతా 12లో..

## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై వాదనలు

విచారణ నేటికి వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్,మార్చి2(ప్రజాజ్యోతి): జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై తెలంగాణ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ రిపోర్ట్ ను రద్దు చేయాలంటూ హైకోర్టులో పిటిషన్లు మిగతా 12లో..

## వేయికోట్లు వసూలుకు వచ్చారా!!

- రాహుల్ రాకపై కేటీఆర్ ఎద్దేవా
- అన్నారం బ్యారేజీ కూల్చివేతకు కుట్రలు
- ఎక్స్‌వేటర్లతో ఇసుక తవ్వకాలే నిదర్శనం
- సూర్యాపేట జిల్లా మైనింగ్‌లో అక్రమాలు
- ఇ-వేలంలో భారీగా అక్రమాలు
- వెంటనే మైనింగ్ ప్రక్రియ ఆపాలి
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్,మార్చి2(ప్రజాజ్యోతి): లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఆసక్తికర పోస్టు చేశారు. గాంధీ కుటుంబానికి రూ.1000 కోట్లు ఇస్తానని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల మిగతా 2లో..



# సంపాదకీయం

## అనిశ్చితిలో ఇరాన్ భవితవ్యం

అమెరికా యుద్ధ దాహానికి ప్రపంచం వణుకుతోంది. బడిత ఉన్నోడిదే బర్రె అన్నచందంగా అమెరికా తన ఆయుధాలతో ప్రపంచాన్ని బెదిరిస్తోంది. దారికి రాని వారిపై దాడికి తెగిస్తోంది. మొన్న వెనిజువెలా, ఇప్పుడు ఇరాన్ దేశాలు దెబ్బతిన్నాయి. ప్రపంచ దేశాల్లో అస్థిరతను సృష్టించడం, తమ దారికి తెచ్చుకో వడం అలవాటుగా చేసుకుంది. ఆయుధాలు లేదా, సుంకాలతో బెదరిస్తోంది. భారత్‌ను కూడా ఇదే తరహాలో ఇబ్బందులు పెడుతోంది. తాజా యుద్ధంతో భారత్ తన వ్యూహాలను మార్చుకోవాలి. స్వతహాగా ఆలోచన చేయాలి. గతంలో ఇరాక్‌ను ధ్వంసం చేసిన అమెరికా ఇప్పుడు ఇరాన్‌ను తుదముట్టించింది. రేపు ఎవరన్న ప్రశ్న ఉదయిస్తోంది. ఇది నయా నియంతల కాలంగా మారింది. ఓ వైపు అమెరికా, మరోవైపు ఇజ్రాయిల్ కలసి ఆడుతున్న యుద్ధంలో ప్రపంచ దేశాలకు వణుకు పుట్టేలా ఉంది. అయితే ఇరాన్ కూడా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా హమాస్, హిజ్బుల్ సంస్థలను ప్రోత్సహించి ఇజ్రాయిల్ పతనాన్ని కోరుకుంది. ఇరాన్‌ను అభివృద్ధి చేసుకునే పనిని వదిలి ఇజ్రయిల్‌తో పంతం పెట్టుకుంది. అణు కార్యక్రమాలను విస్తరించుకుంది. అదే ఇప్పుడు ఖమేనీ పతనానికి దారితీసింది. దశాబ్దాల పాటు తిరుగులేని రీతిలో ఇరాన్‌ను శాసించిన అగ్ర నాయకుడు ఖమేనీ..ప్రత్యర్థి దాడిలో సులువుగా ప్రాణాలు కోల్పోవడం ఆశ్చర్యపరయడం లేదు. ఎందుకంటే కొన్ని నెలలుగా ఖమేనీ కదలికలపై దృష్టి పెట్టిన అమెరికా, ఇజ్రాయెల్ మట్టుపెట్ట గలిగాయి. ఆధునిక సాంకేతికతో ఖమేని ప్రాంతాన్ని గుర్తించి దాడి చేసారు. అమెరికా దాడులు దాదాపు ఖాయమని కొద్ది రోజులుగా స్పష్టమవుతున్నా ఆయనను సురక్షితంగా ఉంచడంలో అక్కడి అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అయ్యింది. అమెరికా అందించిన రహస్య సమాచారం ఆధారంగా ఇజ్రాయెల్.. శనివారం మెరుపు వేగంతో స్పందించి దాడికి దిగడంతో తప్పించుకోవడానికి ఖమేనీకి అవకాశం దక్కలేదు. తమ అణు కేంద్రాలను తొలుత లక్ష్యంగా చేసుకోవచ్చని ఇరాన్ నిఘా వర్గాలు భావించాయి. కానీ తొలి దాడి నేరుగా ఖమేనీపైనే జరుగుతుందని ఊహించలేకపోయాయి. ఈ క్రమంలో ఇరాన్ భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఇరాన్ తన ఛాందసవాద పంథాను వీడాలి. ఉగ్రవాదులను ప్రోత్సహించి, ఇతర దేశాలపై పురిగొల్పే విధానాల నుంచి తప్పుకోవాలి. ప్రజలంతా ఎవరికి తోచినట్లు వారు బతికేలా చేసుకోవాలి. పాకిస్తాన్ కూడా ఇలాగే ఉగ్రవాదులను ఎగదోస్తూ వచ్చింది. చివరకు సహనం నశించిన భారత్ ఆపరేషన్ సిందూర్‌తో దాడులు చేసింది. అయితే చావుతప్పి కన్ను లొట్టపోయి నట్లుగా ఇప్పుడు పాక్ పరిస్థితి మారింది. అఫ్గాన్తోఓ కయ్యానికి దిగింది. ఇది దేశాన్ని అతలాకుతలం చేస్తుందన్న విషయం గుర్తించడం లేదు. ఇక ఇరాన్ కూడా ఛాందసవాద భావాలతో రగిలిపోతోంది. ఖమేనీ రాకతో ఇరాన్ మళ్లీ మతఛాందసవాదంలోకి నెట్టబడింది. అక్కడ ప్రజలు ఇటీవలే ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ప్రభుత్వ దాడుల్లో వేలాదిమంది హతం అయ్యారు. అంతర్గతంగా కూడా ఇరాన్ నాయకత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో అమెరికా కూడా పాచిక వేసి ఖమేనీని మట్టు పెట్టింది. గత ఏడాది ఇరాన్‌లోని అణు స్థావరాలపై దాడికి సన్నద్ధమవుతున్న తరుణంలోనే.. ఖమేనీ ఎక్కడ దాగున్నారో తమకు తెలుసని, కావాలనుకుంటే ఆయనను చంపగలిగి ఉండేవారమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. నాటి నుంచి ఈ పటిష్ట నిఘా నెట్‌వర్క్‌ను అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ కొనసాగించింది. గత ఏడాది 12 రోజుల యుద్ధం సమయంలోనే ఖమేనీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ దళం మధ్య కమ్యూనికేషన్ సాగుతున్న తీరు, అత్యవసర సమయాల్లో వారు చేపడుతున్న చర్యల గురించి మరింత ఎక్కువగా తెలుసుకుంది. ఆ సమాచారం ఆధారంగా తన నిఘా సామర్థ్యానికి సీఐఏ పదును పెట్టింది. తద్వారా.. ఖమేనీ కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించడం, తదుపరి అడుగుల గురించి మరింత కచ్చితత్వంతో అంచనాలు వేయగలిగే సత్తాను సాధించింది. ఖమేనీ కదలికలపై అత్యంత విశ్వసనీయ సమాచారాన్ని సీఐఏ.. ఇజ్రాయెల్‌తో పంచుకుంది. ఆ వెంటనే ఇంటెలిజెన్స్, సైనిక ప్రణాళికపై కసరత్తు మొదలైంది. ఖమేనీ భేటీ శనివారం సాయంత్రం ఉండొచ్చని తొలుత అమెరికా, ఇజ్రాయెల్ దళాలు భావించాయి. అయితే ఆ సమావేశం ఉదయమే జరుగుతున్నట్లు చివరి నిమిషంలో ఇజ్రాయెల్ నిఘా అధికారులకు సమాచారం అందింది. దీంతో శనివారం ఉదయమే టెహ్రాన్‌పై విరుచుకుపడాలని నిర్ణయించు కున్నారు. ఖమేనీపై దాడితో యుద్ధాన్ని ప్రారంభించాలని తీర్మానించుకున్నారు. పోరు మొదలయ్యాక ఆయన బంకర్‌లో తలదాచుకోవచ్చన్న భావనకు అమెరికా, ఇజ్రాయెల్‌లు వచ్చాయి. ఆ సమయంలో ఇరాన్ జాతీయ భద్రతా అధికారులు ఒక భవనంలో.. ఖమేనీ మరో భవనంలో ఉన్నారు. అయినా ఇరాన్ సుప్రీం నేత నిర్దిష్ట ప్రదేశాన్ని గుర్తించిన జెట్‌లు అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాయి. ఖమేనీ ప్రాంగణం ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాలు నిర్ధారించాయి. దానిపై 30 బాంబులను ప్రయోగించి నట్లు తెలుస్తోంది. ఖమేనీపై దాడికి శక్తిమంతమైన 'బంకర్ బస్టర్' బాంబులను కూడా వాడినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు భవిష్యత్ ఏంటన్నది ఇరాన్ ఆలోచించాలి. ఇరాక్ పతనమైనట్లే ఇరాన్ కూడా పతనమవుతుందా లేక లేచి నిలబడుతుందా అన్నది చూడాలి. ఆయుధ పోటీలో ఇప్పుడు ఈ యుద్ధం పరాకష్టగా చూడాలి. ఇరాన్ ప్రజలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోన తదుపరి నాయకత్వం చేయాలి. ప్రపంచ దేశాల్తో తనకుంటూ స్థానాన్ని పదిలం చేసుకోవాలి. ఎందుకంటే ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం ఇరాన్‌కు భారీ దెబ్బ! 37 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఆయన సేవలను కోల్పోవడంతో టెహ్రాన్ ప్రస్తుతం కొంత ఉక్కిరిబిక్కిరి అవుతుందనడంలో సందేహం లేదు. అయితే– ఖమేనీ కన్నుమూసినంత మాత్రాన.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశిస్తున్నట్లుగా ఇరాన్‌లో ఇప్పటికిప్పుడు అధికార మార్పిడి జరిగే అవకాశాలు మాత్రం లేవు! సుప్రీం లీడర్ లేకపోయినా పాలనా వ్యవహారాలు సజావుగా సాగేందుకు అవసరమైన వ్యవస్థ అందుబాటులో ఉండటం, కొత్త పాలకుడి నియామకానికి స్పష్టమైన మార్గనిర్దేశకాలు ఉండటమే అందుకు కారణం. ఖమేనీ మరణంతో ఇప్పటికే ఈ మండలి చేతుల్లోకి ఇరాన్ పాలనా బాధ్యతలు వెళ్లాయి. ఇందులో దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, న్యాయ వ్యవస్థ అధిపతి ఘొలామ్ హొసేన్ మొహ్సెనీ ఎజెహీలకు తోడు తృతీయ సభ్యుడిగా ఆయతుల్లా అలీ రెజా అరాఫీ ప్రస్తుతం ఎంపికయ్యారు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చింది. అప్పుడు సుప్రీం లీడర్‌గా ఆయతుల్లా రూహుల్లా ఖొమైనీ నియమితులయ్యారు.

1989లో ఆయన చనిపోయాక.. ఖమేనీకి ఆ పదవి దక్కింది. ఖమేనీ కుమారులలో ఒకరైన 56 ఏళ్ల ముజ్తబా ఖమేనీ ప్రస్తుతం దేశాధినేత అవుతారనే ప్రచారం జరుగుతోంది. గతంలో ప్రభుత్వ పదవిని నిర్వహించిన అనుభవమేదీ ముజ్తబాకు లేదు. ఆయన్ను సుప్రీం లీడర్‌గా నియమిస్తే మతపెద్దల కమిటీపై దేశ ప్రజల్లో ఆగ్రహం పెరగొచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించడం మత సిద్ధాంతాలకు విరుద్ధమని కూడా పలువురు చెబుతున్నారు. ఇకపోతే తిరుగుబాటు చేయాలన్న ట్రంప్ సూచనలను ఇరాన్ ప్రజలు అంగీకరించరు. కాబట్టి ప్రస్తుతం అమెరికాను విశ్వసించి ఇరాన్‌వాసులు తిరుగుబాటు చేసే అవకాశాలు లేనట్టే! కొత్త నాయకత్వం ఎవరికి దక్కినా ఇరాన్ పునర్నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగాలి.

# ఇరాన్ ప్రతీకార దాడులు ముమ్మరం

మొదటిపేజీ తరువాయి..

ఈ యుద్ధం కారణంగా వివిధ దేశాలకు ఇంధన కొరత ఏర్పడనుంది. ఇప్పటికే యుద్ధం కారణంగా చమురు ధరలు మండుతున్నాయి.

చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాను ఇరాన్ అడ్డుకోవడంతో ధరలు 10 శాతం మేర పెరిగాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 80 డాలర్లు దాటింది. ఇప్పుడు తాజా దాడులతో ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇంధన ధరలు పెరుగుదల అనేది సామాన్యులు వినియోగించే కిరాణా సామాగ్రి, ఇతర వస్తువుల ధరలపై ప్రభావం చూపనుంది. చాలా మంది వినియోగదారులు ఇప్పటికే పెరిగిన ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్నారు. మరోవైపు, పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు కొనసాగుతున్నాయి. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై డ్రోన్ దాడి జరగ్గా.. దుబాయ్, దోహా, అబుదాబి, జెరూసలెంలోనూ సోమవారం పేలుడు శబ్దాలు వినిపించాయి.

ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ సోమవారంనాడు సంచలన ప్రకటన చేసింది. టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయాన్ని తమ క్షిపణి విజయవంతంగా ఢీకొట్టిందని ప్రకటించింది. దాడి జరిగినట్టు చెబుతున్న సమయంలో నెతన్యాహు తమ కార్యాలయంలో ఉన్నారా లేదా అనేది ఇంకా తెలియలేదు. 'క్రిమినల్ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహు, ఎయిర్ ఫోర్స్




కమాండర్ కార్యాలయాన్ని ఖైబర్ షెకాన్ బాలిస్టిక్ క్షిపణి విజయవంతంగా ఢీకొట్టింది' అని ఆర్ఆర్‌జీసీ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే ఇరాన్ ప్రకటనను ఇజ్రాయెల్ ఇంకా ధ్రువీకరించలేదు. అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేని మరణించడంతో మధ్యప్రాచ్యంలో ఒక్కసారిగా ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరాన్ ప్రతిదాడులకు దిగింది. ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై విరుచుకుపడింది. ఇరాన్ ఆదివారం జరిపిన క్షిపణి దాడుల్లో జెరూసలేం సమీపంలోని బీట్ షెమేష్‌లో 10 మంది మృతి చెందారు.

పలువురు గాయపడ్డారు. ఇజ్రాయెల్‌పై దాడులు కొనసాగుతాయని ఇరాన్ ప్రకటించింది. దీనిపై ఇజ్రాయెల్ అంతే వేగంగా స్పందించింది. ఇరాన్ ప్రతిదాడులకు దిగితే మునుపెన్నడూ ఎరుగని రీతిలో భయంకరమైన దాడులు చేస్తామని హెచ్చరించింది.

# యుద్ధ జ్వాలలు

మొదటిపేజీ తరువాయి..

ఐడీఎఫ్ అధికారి రఫీ హెచ్చరించారు. మొదట హెజ్‌బొల్లా తమపై రాకెట్ దాడులకు పాల్పడడం వల్లే ప్రతి దాడులు చేశామని ఆయన తెలిపారు. మరోసారి వారు ఇటువంటి చర్యలకు దిగకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా.. లెబనాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, కీలక నేతల కార్యాలయాలపై దాడులు చేపట్టామన్నారు. హెజ్‌బొల్లా రాజకీయ, సైనిక విభాగాల్లో కీలక పాత్ర పోషించే రాడ్ మృతి ఆ సంస్థకు కోలుకోలేని దెబ్బని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. హెజ్‌బొల్లా ఆయుధాలను, కమాండ్ సెంటర్లను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఈ 'ఆపరేషన్ రోరింగ్ లయన్'ను వేగవంతం చేసింది. మరిన్ని దాడులు చేయడానికి ముందు దక్షిణ లెబనాన్‌లోని 50 గ్రామాలను ఖాళీ చేయాల్సిందిగా అక్కడి ప్రజలకు సూచించినట్లు ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. పశ్చిమాసియాలో మూడోరోజూ కూడా ఉద్రిక్తతలు కొనసాగుతున్నారు. అమెరికా మద్దతుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. క్షిపణి స్థావరాలను టార్గెట్ చేసుకుంటూ, యుద్ధనౌకలను ధ్వంసం చేస్తోంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేస్తోంది. కాగా, గత శనివారంనాడు యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇంతవరకూ తమదేశంలో ఇరాన్ సుప్రీం లీడర్, ఇతర సీనియర్ అధికారులతో సహా 550 మందికి పైగా మరణించినట్టు ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేన్ మృతికి ప్రతీకారం తీర్చుకుంటామని ఆదేశ మిలటరీ కమాండర్లు ప్రకటించారు. యూఏఈ సహా గల్ఫ్ దేశాలపై దాడులు తీవ్రతరం చేయడంతో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. తాజా పరిస్థితి యావత్ మధ్యప్రాచ్యాన్ని యుద్ధం వైపు నడిపే అవకాశాలున్నాయనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. దుబాయ్ ఎయిర్ పోర్ట్, బుర్జ్ ఖలీఫా, బహ్రేన్, కువైట్‌లోని అమెరికా స్థావరాలను ఇరాన్ టా÷–గ్గ÷ట్ చేస్తోంది. మరోపైపు, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రధాన కార్యాలయానికి ధ్వంసం చేసినట్టు అమెరికా మిలటరీ ప్రకటించింది. కాగా, యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షాకింగ్ ప్రకటన చేశారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో భాగంగా 'ఒకే షాట్'లో 48 మంది ఇరానియన్ టాప్ లీడర్లను మట్టుపెట్టామని తెలిపారు. 9 యుద్ధ నౌకలను ధ్వంసం చేశామని చెప్పారు. ఇరాన్ నావికాదళ ప్రధాన కార్యాలయాన్ని కూడా ధ్వంసం చేశామని, ఈ చర్యలో కనీసం ముగ్గురు అమెరికా సైనికులు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడినట్టు పేర్కొన్నారు. యుద్ధం మరో 4–5 వారాలు పట్టవచ్చంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. పర్యాటకులు, ధనవంతులు, వ్యాపారాలకు స్వర్గధామంగా గుర్తింపు పొందిన దుబాయి నగరం ఇరాన్ ప్రతీకార దాడులతో వణికిపోయింది. శనివారం నుంచి క్షిపణులు, డ్రోన్లతో వరుస దాడులు చేస్తున్న ఇరాన్.. ఆదివారం కూడా దాడి చేసింది. ఈ దాడులను సమర్థంగా తిప్పికొట్టామని దుబాయి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. నిత్యం ప్రశాంతంగా ఉండే నగరంలో భారీ పేలుళ్ల శబ్దాలు, మంటలు, ఆకాశంలోకి లేస్తున్న దట్టమైన పొగ.. స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. చాలామంది స్థానికులు, పర్యాటకులు దాడులకు సంబంధించిన వీడియోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉందని చెప్పారు. ముందుజాగ్రత్తగా ప్రజలను ఇళ్లలోనే ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఇరాన్ నుంచి వచ్చిన క్షిపణులు, డ్రోన్లన్నింటినీ కూల్చివేశామని ప్రకటించింది. అయితే, జెబెల్ అలీ పోర్టు సమీపంలో ఇరాన్ ప్రయోగించిన ఓ డ్రోన్ పడి భారీగా మంటలు చెలరేగాయి. దుబాయి గగన రక్షణ వ్యవస్థ కూల్చివేసిన ఇరాన్ డ్రోన్ శకలాలు పడటంతో పామ్ హోటల్‌లో స్వల్పంగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయని, వారు ఆస్పత్రిలో కోలుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇరాన్ దాడితో దుబాయిలోని ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన భవనాలుగా గుర్తింపు పొందిన బుర్జ్ ఖలీఫా, బుర్జ్ అల్ అరబ్‌లకు ముప్పు ఏర్పడింది. శనివారం రాత్రి ఇరాన్ డ్రోన్ శకలాలు బుర్జ్ అల్ అరబ్ భవనాన్ని తాకటంతో అది స్వల్పంగా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. ముందు జాగ్రత్తగా ఈ రెండు భవనాలను అధికారులు ఖాళీ చేయించారు. ఆదివారం తెల్లవారుజామున మూడు భారీ పేలుళ్లు వినిపించాయని స్థానికులు చెప్పారు. కృత్రిమంగా సృష్టించిన విలాసవంతమైన పామ్ జుమైరా దీవిలో కూడా డ్రోన్ పడటంతో మంటలు చెలరేగాయి. కాగా, నగరంలో పరిస్థితి అంతా మామూలుగానే ఉందని దుబాయి మీడియా కార్యాలయం ప్రకటించింది.

## స్టాక్ మార్కెట్లపై యుద్ధం ప్రభావం

మొదటిపేజీ తరువాయి..

మార్కెట్లు భారీగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, చమురు రేట్ల పెరుగుదలతో సూచీలు దారుణంగా పడిపోయాయి. సెన్సెక్స్ 1000 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ 300 పాయింట్ల మేర పడిపోయింది. సోమవారం ఉదయం 9.25 గంటల సమయంలో సెన్సెక్స్ 1,048.48 పాయింట్లు దిగజారింది. దీంతో 80,238.71 వద్ద, నిఫ్టీ 307.35 పాయింట్లు పతనమై 24,871.30 వద్ద కొనసాగుతున్నాయి. రూపాయి విలువ క్షీణించింది. నేటి సెషన్‌లో 24 పైసలు తగ్గింది. దీంతో 91.32గా ట్రేడ్ అవుతోంది. ప్రీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 2,700 పాయింట్లు, నిఫ్టీ 530 పాయింట్లు కుంగడంతో ఇన్వెస్టర్లు తీవ్ర ఆందోళన చెందారు. ప్రస్తుతం మార్కెట్లు కొద్దిగా కోలుకున్నప్పటికీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఇరాన్–అమెరికా యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు రేట్లు భగ్గుమన్నాయి. ముడి చమురు ధర 80 డాలర్లపైగా ట్రేడ్ అవుతోంది. దీని ప్రభావంతో దేశీయంగా చమురు రంగ షేర్లు బాగా పడిపోయాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ 5 శాతం మేర కుంగింది. మారుతి సుజుకీ, ఏషియన్ పెయింట్స్ వంటి షేర్లు తీవ్ర నష్టాల్లో కొనసాగుతున్నాయి. క్రితం సెషన్‌లో విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.7536 కోట్ల విలువైన ఈక్విటీలను అమ్మారు. ఇది కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది.

## దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

మొదటిపేజీ తరువాయి..

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. గత ఐదు రోజుల క్రితం ఆయన దుబాయ్ వెళ్లారు. మంత్రి కుటుంబ సభ్యులలో ఒకరికి అకస్మాత్తుగా అనారోగ్యం కలగడంతో, మెరుగైన చికిత్స అందించడం కోసం ఆయన దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి రావాలని భావిస్తున్న సమయంలో పశ్చిమ ఆసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఆయన దుబాయ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా



సంయుక్త దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇరాన్, ఆదివారం అర్ధరాత్రి దుబాయ్ ఎయిర్ పోర్ట్ లోని టెర్మినల్ – 3 సమీపంలో క్షిపణి దాడులు జరినట్లు సమాచారం. భద్రతా కారణాలతో అక్కడ ప్రభుత్వం విమానా రాకపోకలు నిలిపివేశాయి. దీంతో మంత్రి తుమ్మల అక్కడే చిక్కుకుపోయారు. దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌పై ఇరాన్ దాడుల నేపథ్యంలో అన్ని విమానాలను అక్కడ ప్రభుత్వం రద్దు చేయడంతో మంత్రి తుమ్మల దుబాయ్‌లోనే చిక్కుకుపోయారు. అయితే, తాను సురక్షితంగా ఉన్నానని, ఎయిర్ పోర్టు క్లియరెన్స్ ఇచ్చే వరకు ఇండియా తిరిగి రాలేని పరిస్థితి అని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని తుమ్మల తెలిపారు.

వేయికోట్లు వసూలుకు

# వచ్చారా!!

మొదటిపేజీ తరువాయి..

నేపథ్యంలో కేటీఆర్ పోస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. ఎక్స్‌లో కేటీఆర్ ఏమన్నారంటే.. 'హలో రాహుల్‌గాంధీ.. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఏటీఎం అయిన తెలంగాణకు స్వాగతం' అంటూ వెల్‌కమ్ చెప్పారు. 'మీరిప్పుడు సీఎం దగ్గర రూ.1000 కోట్లు వసూలు చేసుకోవడానికి వచ్చారా..?' అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. 'పనిలోపనిగా మీరు 100 రోజుల్లో అమలుచేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 ఇతర వాగ్దానాల పురోగతిని సమీక్షించడంపై కూడా కొంచెం శ్రద్ధ పెట్టండి' అని సూచించారు. మేడిగడ్డ బ్యారేజీపై కుట్రలు చేసింది చాలదన్నట్టు, అన్నారం బ్యారేజీని కూల్చేందుకు కుతంత్రాలకు తెరతీశారా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. నిబంధన లకు పాతరేసి ఏకంగా బ్యారేజీ కిందే భారీ ఎక్సవేటర్లతో ఇసుక తవ్వకాలు జరపడం దుర్మార్గమే కాదు.. అతిపెద్ద నేరమని అన్నారు. బ్యారేజీ సమీపంలో ఇసుక తవ్వకాలు చేపట్టకూడదన్న రూల్స్ ను బ్రేక్ చేసిన మాఫియాపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏకంగా బ్యారేజీని బలహీనపరిచి బీఆర్ఎస్ పై బురదజల్లే పన్నాగాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసేందుకు నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ చేస్తున్న అరాచకపర్వాన్ని అన్నదాతలు క్షమించే ప్రసక్తే లేదని అన్నారు. నిబంధనలు తుంగలో తొక్కి అన్నారం బ్యారేజి పిల్లర్ల వద్ద ఇసుక తవ్వకాలు చేసి బ్యారేజీని రేవంత్ సర్కార్ ప్రమాదంలోకి నెడుతుందని తెలిపారు. ఇది ఖచ్చితంగా కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసే కుట్రే అని ఆరోపించారు. పట్టపగలే, నిస్సిగ్గుగా అన్నారం బ్యారేజ్ నుండి కాంగ్రెస్ నాయకుల ఇసుక మాఫియా ఇసుకను తోడేస్తుందని మండిపడ్డారు. తెలంగాణ వనరులను కాంగ్రెస్ పార్టీ ఎలా కొల్లగొడుతుందో చెప్పడానికి ప్రత్యక్ష ఉదాహరణ ఇది అని చెప్పారు. కాళేశ్వరం బ్యారేజీలకు ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత కాంగ్రెస్ పార్టీదే అని కేటీఆర్ స్పష్టం చేశారు. అందినకాడికి దోచుకో.. దొరికినకాడికి అమ్ముకో.. ఇవే తెలంగాణలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా పాలన సూత్రాలు అని వ్యాఖ్యానించారు. తెలంగాణను నిలువు దోపిడి చేస్తున్న కాంగ్రెస్ నాయకులారా.. ప్రజలు మీ భరతం పట్టే రోజు అతి దగ్గరలోనే ఉంది.. ఖబడ్దార్ అని హెచ్చరించారు. కేటీఆర్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సూర్యాపేట జిల్లాలో మైనింగ్ ఈ–వేలంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని స్వతంత్ర విచారణ చేసి టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 1,100 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్‌పై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించారని ఆరోపించారు. కీలక సాంకేతిక వివరాల్లో లోపం, లాటిట్యూడ్, లాంగిట్యూడ్, డీజీపీఎస్ సర్వే వివరాలు వెల్లడించలేదని విమర్శించారు. జియోలాజికల్ నివేదికలు సైతం లేవని ఆరోపించారు. మినరల్ ఆక్షన్ రూల్స్–2015 ఉల్లంఘన జరిగిందని హైకోర్టు సూచనలు పట్టించుకోలేదన్నారు. పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్ల ప్రకటన,కంపెనీల ఎంపికపై అనుమానాలున్నాయని పేర్కొన్నారు. మైనింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కేసులు ఎదుర్కొంటున్న డెక్కన్ సిమెంట్స్, ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్‌కు బ్లాక్‌ల కేటాయింపుపై సందేహాలున్నాయని తెలిపారు. టెండర్ రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అన్ని అనుమతుల తర్వాతే పారదర్శకంగా కొత్త వేలం నిర్వహించాలని సూచించారు. గనుల శాఖ చేపట్టిన ఈ వేలం ప్రకియ పారదర్శకతకు విరుద్ధంగా సాగిందని ఆయన విమర్శించారు. టెండర్ నోటీసు జారీకి ముందే మినరల్ బ్లాక్‌లను ఖచ్చితంగా గుర్తించి పూర్తి వివరాలు వెల్లడించడం తప్పనిసరి అయినప్పటికీ, ఈ నిబంధనలు పాటించలేదని విమర్శించారు. ఈ అక్రమ టెండర్లపై మరింత ఆందోళన కలిగించే అంశాలను కూడా ఆయన లేఖలో ప్రస్తావించారు. న్యాయపరమైన విచారణలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వేలాన్ని ముందుకు తీసుకెళ్లడం, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సూచనలను పట్టించుకోకపోవడం, చట్టపరమైన, పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడంవంటి అంశాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. మైన్స్ అండ్ జియోలజీ శాఖ లీగల్ ఆఫీసర్ ఈ బ్లాక్‌ల సమాచారాన్ని గోప్యంగా పేర్కొంటూ ఫిర్యాదుదారునికి ఇవ్వడానికి నిరాకరించడం పారదర్శకతపై అనుమానాలు పెంచుతోందని అన్నారు. ప్రస్తుత వేలం పక్రియకు సంబంధించిన అన్ని చర్యలను తక్షణమే నిలిపివేయాలని, టెండర్ పక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# సాధు సమ్మేళనం.. వేదాంత విజ్ఞాన మహాసభలు

• అందరూ ఆహ్వానితులే - శ్రీ శివానంద భారతి




**నేరడిగొండ మార్చ్ 02( ప్రజాజ్యోతి) :** నేరడిగొండ మండలంలోని తేజాపూర్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో మార్చి 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు సాధు సమ్మేళన వేదాంత విజ్ఞాన మహాసభలు నిర్వహించబడతాయని స్వామీజీ శ్రీ శివానంద భారతి మరియు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పలు జిల్లాల నుండి ఇతర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున సాధువులు వస్తారని నిర్వాహకులు సాధు పుంగవులచే సత్సంగ సమ్మేళనాలు ప్రవచనాలు వేదాంత విషయాల ప్రబోధ కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చట్ట సబల ప్రజా ప్రతినిధులతో పాటు పలువురు సాధు మహారాజులు భక్తాదులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొంటారని ప్రతిరోజు కూడా అన్నదానం నిర్వహించబడునని ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులని ప్రతి గ్రామము నుండి ప్రతి మండలం నుండి పెద్ద ఎత్తున హాజరై ప్రతి ఒక్కరు వేదాంత విజ్ఞానం కార్యక్రమాలు విని తరించాలని నిర్వాహకులు శ్రీ శివానంద భారతి స్వాములవారు, సమస్త శ్రీ శబరి మాత భక్తులు తెలిపారు. ముఖ్య అతిథులుగా అదిలాబాద్ జిల్లా పార్లమెంటు సభ్యులు గెడెం నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బోథ్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆడే గజేందర్, అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి బలిరాం జాదవ్, నేరడిగొండ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి, తేజాపూర్ సర్పంచ్ సింగారి వసుంధర నవీన్, బుద్ధికొండ సర్పంచ్ ఏలేటి మహేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు.

## బాల్య వివాహ నిర్మూలన ప్రచార రథాన్ని ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్




**నిర్మల్ జిల్లా ప్రతినిధి మార్చ్ 2, (ప్రజా జ్యోతి) :** జిల్లాలో బాల్య వివాహాల నిర్మూ లన, 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని, సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటే శ్వర్లు, జెండా ఊపడం ద్వారా ప్రారంభి చారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో "బాల్య వివాహ రహిత భారత్" కార్యక్రమంలో భాగంగా ఈ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ప్రచార రథం ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు పిల్లల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నివారణకు ప్రజలందరూ బాధ్యతగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజన్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ శరత్ కుమార్, రాజు, బాలల పరిరక్షణ అధికారి మురళి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వహీద్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ గంగాధర్, మిషన్ శక్తి సిబ్బంది, విజన్ సంస్థ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లాలో బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రణాళికలు సిద్ధం

### గర్భాశయ క్యాన్సర్ నివారణ దిశగా ప్రభుత్వం కీలక అడుగులు





**మంచిర్యాల, 2,మార్చి (ప్రజా జ్యోతి) :** గర్భాశయ క్యాన్సర్‌ను పూర్తిగా నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుము బిగించింది. ఇందులో భాగంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అవగాహన కార్య క్రమాల కోసం పోస్టర్లు, ఫ్లెక్సీలను విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) చంద్రయ్య, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లాలో 14 సంవత్సరాలు నిండిన 15 సంవత్సరాలలోపు ఉన్న సుమారు 8 వేల 184 మంది బాలికలకు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ వ్యాక్సిన్ ఒక్క డోసుగా ఎడమ చేతికి ఇస్తామని, వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాత గుర్తింపుకోసం చూపుడు వేలికి ఇంకు పెట్టి, వివరాలను యూవిన్ పోర్టల్‌లో నమోదు చేస్తామని, ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం మూడు నెలల పాటు కొనసాగుతుందని, అనంతరం జాతీయ టీకాల కార్యక్రమంలో కలుపుతామని తెలిపారు. పాఠశాలల్లో తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశం (పేరెంట్స్ టీచర్ మీటింగ్) నిర్వహించిన తరువాత, తల్లిదండ్రులకు వ్యాక్సిన్ ఉపయోగాలపై పూర్తి అవగాహన కల్పించి బాలికలకు టీకా వేస్తామని, వ్యాక్సిన్ వేయించుకునే బాలికలు తప్పనిసరిగా టిఫిన్ లేదా భోజనం చేసి రావాలని, ఖాళీ కడుపుతో టీకా వేసుకోరాదని సూచించారు. టీకా వేసుకున్న అనంతరం అరగంట పాటు వ్యాక్సిన్ కేంద్రంలోనే ఉండాలని తెలిపారు. ఈ వ్యాక్సినేషన్ పూర్తిగా స్వచ్ఛందమని, ఎవరినీ బలవంతం చేయబోమని, తల్లిదండ్రుల సమ్మతితోనే బాలికలకు టీకా వేస్తామని స్పష్టం చేశారు. అనారోగ్యంతో ఉన్నవారు, అలర్జీలు ఉన్న బాలికలకు వ్యాక్సిన్ వేయబోమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మాతా, శిశు సంరక్షణ కేంద్రాలు, పిపి యూనిట్లు, ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు (చెన్నూరు, బెల్లంపల్లి, లక్షెట్టిపేట) మరియు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, వైద్యాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లాలోని అన్ని జిల్లా అధికారులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తూ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, ఇంటర్ విద్యాశాఖ, డీఆర్‌డీఏ సమన్వయంతో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను నివారించవచ్చని, అందరూ సమన్వ యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఏ. ప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, డీపీఓ ప్రశాంతి, సిహెచ్‌ఓలు లింగారెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మణస్వామి, పద్మ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా మాస్ మీడియా విభాగం ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

# విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకోవాలి






• లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో సైన్స్ దినోత్సవం
• తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం

**ఖానాపూర్ మార్చి 2 (ప్రజాజ్యోతి) :** విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని ఖానాపూర్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ లో సోమవారం జరిగిన సైన్స్ దినోత్సవం సందర్భంగా తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం అన్నారు విద్యార్థులు వివిధ రకాల పరికరాలను తయారు చేసి ప్రదర్శించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా 11వ వార్డు కౌన్సిలర్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యంతో పాటు సర్కిల్ ఇన్స్పెక్టర్ అజయ్ కుమార్ ఆర్యవైశ్యవాసవి క్లబ్ జోనల్ చైర్మన్ మహాజన్ జితేందర్ లు పాల్గొన్నారు ఈ సందర్భంగా విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతియేటా సివి రామన్ సైన్స్ శాస్త్రవేత్త పేర ఈ కార్యక్రమాలు నిర్వహించు కుంటున్నామని కరెస్పాండెంట్ పడాల ప్రభాకర్ తెలిపారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు





● కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 02, (ప్రజాజ్యోతి) :** ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాలు తనికి చేస్తూ ఉండాలని తెలిపారు. వేసవి కాలం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉండే ప్రాంతాలు గుర్తించి, నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు యూరియా యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఉండాలన్నారు. జిల్లాలో ఫిబ్రవరి 8వ తేదీ నుంచి ప్రారంభమైన యూరియా బుకింగ్ యాప్ ద్వారా, ఇప్పటివరకు రైతులు, 1 లక్షా 60 వేల యూరియా బస్తాలు బుక్ చేసుకొని, 1 లక్షా 40 వేల యూరియా బస్తాలు తీసుకున్నారని చెప్పారు. ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నందున, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత మండలాల్లో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. సీఎం కప్ పోటీలలో రాష్ట్రస్థాయిలో జిల్లాకు 4 బంగారు పతకాలు, 8 వెండి పతకాలు, 13 కాంస్య పతకాలు కలిపి మొత్తం, 25 పతకాలు రావడం గర్వకారణం అని తెలిపారు. ఇందుకుగాను, అధికారులకు, కోచ్ లకు, క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. అంతకుముందు, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన డిసిఓ నర్సయ్య ఆత్మకు శాంతి చేకూరాలని కలెక్టర్, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లా అధికారి మృతి చెందడం బాధాకరమైన విషయమని విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బండి ప్రకాష్‌కు డప్పు మోగించి స్వాగతం




## నల్లాల ఓదెలు ఆత్మీయ ఆహ్వానం

**మంచిర్యాల ప్రతినిధి మార్చి 02 ప్రజా జ్యోతి :**
మందమర్రిలో జరిగిన మాజీ మావోయిస్టు అగ్రనేత బండి ప్రకాష్ ఆత్మీయ సమ్మేళనం ఓ ప్రత్యేక దృశ్యానికి వేదికైంది. తన స్నేహితుడు వనం వీడి జనజీవన స్రవంతిలో కలిసిన ఆనందంలో మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు స్వయంగా డప్పు కొట్టి స్వాగతం పలకడం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంప్రదాయంగా శుభసందర్భాల్లో డప్పు మోగించడం ఆనందం, ఆహ్వానం, ఐక్యతకు సంకేతం. అదే భావంతో ఓదెలు డప్పు మోగించి బండి ప్రకాష్‌ను వేదికపైకి ఆహ్వానించారు. ఆ క్షణం సభలో ఉన్న వారిని కదిలించింది. రాజకీయ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు చప్పట్లతో ఆ స్వాగతాన్ని అభినందించారు.

**స్నేహానికి సంకేతం – సమాజానికి సందేశం :** నల్లాల ఓదెలు మాట్లాడుతూ, "బండి ప్రకాష్ లాంటి వ్యక్తి సమాజంలోకి రావడం మా అందరికీ ఆనందకరం. స్నేహితుడిగా అతడిని ఆహ్వానించడం నా బాధ్యతగా భావించాను," అన్నారు. వనం వీడి ప్రజాస్వామ్య మార్గంలో నడవాలని నిర్ణయించుకున్న బండి ప్రకాష్ ప్రయాణాన్ని ఆయన ప్రశంసించారు. సమాజంలో శాంతి, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా ముందుకు రావాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ఇచ్చిందన్నారు. భావోద్వేగ క్షణం బండి ప్రకాష్ కూడా స్పందిస్తూ, "ఇది నా జీవితంలో ఒక కొత్త అధ్యాయం. ఇంత ఆత్మీయంగా స్వాగతం పలికిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు," అని అన్నారు. డప్పు మోగిన ఆ క్షణం కేవలం ఒక స్వాగతం కాదు – అది ఒక మార్పుకు, ఒక కొత్త ప్రారంభానికి ప్రతీకగా నిలిచింది.రాజకీయ విభేదాలుభావజాల భేదాలు ఉన్నా, మానవీయ బంధాలు అన్నిటికంటే గొప్పవని ఈ సంఘటన చాటిచెప్పింది. డప్పు మోగించిన ఆ స్వాగతం ఒక వ్యక్తి మార్పునే కాదు – సమాజంలో ఐక్యత, సహజీవనానికి ఇచ్చిన ఆహ్వానం. మందమర్రి వేదికగా వెలిసిన ఈ ఆత్మీయ దృశ్యం భవిష్యత్తులో సానుకూల సామాజిక మార్పులకు నాంది కావాలని ప్రజలు ఆకాంక్షించారు.

# రాష్ట్ర రాజకీయాల్లో చిరస్మరణీయుడు.. అజాత శత్రువు శ్రీపాదరావు




రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**మంచిర్యాల, మార్చి 2 (ప్రజాజ్యోతి) :** రాష్ట్ర రాజకీయాల్లో చిరస్మరణీయుడిగా, అజాత శత్రువుగా పేరు పొందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు అని అంబర్ కిషోర్ ఝా కొనియాడారు. స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి సందర్భంగా సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మంథని నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన శ్రీపాదరావు, అనంతరం శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. కాటారం మండలంలోని ధన్వాడ గ్రామానికి చెందిన ఆయన సర్పంచ్‌గా, సమితి ఉపాధ్యక్షుడిగా, ఎల్ ఎంబీ బ్యాంకు చైర్మన్‌గా పలు పదవుల్లో ప్రజాసేవలందించారని పేర్కొన్నారు. 1983 సంవత్సరం నుంచి వరుసగా మూడుసార్లు మంథని ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజాసేవలో ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. 1999 ఏప్రిల్ 13న మహదేవపూర్ మండలం అన్నారం సమీపంలో అప్పటి పీపుల్స్ వార్ నక్సలైట్లు ఆయనను హత్య చేసిన ఘటనను గుర్తుచేశారు. సర్పంచ్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి శాసనసభ్యుడిగా, అనంతరం శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టి ఆ పదవికి వన్నె తెచ్చిన మహనీయుడిగా శ్రీపాదరావు చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. రాష్ట్రానికి ఎనలేని సేవలందించిన ఆయన పేరు రాష్ట్ర రాజకీయాల్లో అజాత శత్రువుగా చిరకాలం నిలిచిపోతుందన్నారు. ఈ కార్య క్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, సీసీ హరీష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువతరం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్ర వేణి తిరుపతికి ఘన సన్మానం



**మంచిర్యాల, 2,మార్చి (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల పట్టణంలోని జన్మభూమి నగర్‌లో యువతరం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్ర వేణి తిరుపతి 33వ సారి రక్తదానం చేసిన సందర్భంగా జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం చిరు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్ష కార్యదర్శులు గుమ్ముల శ్రీనివాస్, వేముల అశోక్‌లు మాట్లాడుతూ,ఇరవై సంవత్సరాల క్రితమే యువతరం స్వచ్ఛంద సంస్థను స్థాపించి, ఇప్పటివరకు సుమారు 6 వేల మందికి రక్తదానం సమకూర్చి అనేక ప్రాణాలను కాపాడిన మానవతావాది తిరుపతి అని ప్రశంసించారు. రక్తదానంపై అవగాహన లేని రోజుల్లోనే యువతను చైతన్యవంతులను చేసి, అపోహలను తొలగిస్తూ రక్తదానానికి ప్రోత్సహించిన ఆయన సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా, సేవా భావంతో ముందుకు రావాలని కోరుతూ, తిరుపతికి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భగవంతుని వేడుకున్నారు. రాబోయే రోజుల్లోనూ సమాజ సేవను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామగిరి రాజన్నచారి, రాసమల్ల రాజేశ్వరి, వేముల అశోక్, గుమ్ముల శ్రీనివాస్, వేల్పుల మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడిన గొప్ప వ్యక్తి దుద్దిళ్ల శ్రీపాదరావు

• జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 2, (ప్రజాజ్యోతి) :** ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడిన గొప్ప వ్యక్తి దుద్దిళ్ల శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం మంచి విషయమని అన్నారు. శ్రీపాదరావు చేసిన మంచి పనులే ఆయనను జనాల్లో చిరస్థాయిగా గుర్తుండిపోయేలా చేశాయని, నేటి తరానికి ఆయన ఆదర్శమని కొనియాడారు. ఆయన ఆశయాలు, లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, డీఈవో భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిటిడివో అంబాజీ, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహా రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ అట్రాసిటీ చట్ట సాధనకై హైదరాబాద్‌కు తరలిన టీఆర్‌పి నాయకులు

తీన్మార్ మల్లన్న నాయకత్వంలోనే సామాజిక తెలంగాణ సాధ్యం



**మంచిర్యాల, మార్చి 2 (ప్రజాజ్యోతి) :** బీసీ అట్రాసిటీ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఇచ్చిన మహా ధర్నా పిలుపులో భాగంగా మంచిర్యాల జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హైదరాబాద్ కు ధర్నాలో పాల్గొనడానికి తరలి వెళ్లారు. మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చౌక్ (ఇందిరా పార్క్) వద్ద నిర్వహించే ధర్నాలో పాల్గొనేందుకు బయలుదేరారు. బీసీల రాజ్యాధికార సాధనకై తీన్మార్ మల్లన్న నాయకత్వంలోనే పోరాటం సాగించాలని నాయకులు పిలుపునిచ్చారు. "మన అధికారం, ఆత్మగౌరవం, వాటా సాధించుకుందాం" అంటూ నినాదాలు చేస్తూ కార్యకర్తలు ఉత్సాహంగా ముందుకు సాగారు. తీన్మార్ మల్లన్న నాయకత్వంలోనే సామాజిక తెలంగాణ సాకారం అవుతుందని విశ్వసించాలని, ఎస్సీ--ఎస్టీ--బీసీ--మైనార్టీల ఐక్యతతోనే న్యాయసమాజం సాధ్యమని నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా "జై బీసీ... జైజై బీసీ... జైజై తీన్మార్ మల్లన్న", "ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యత వర్ధిల్లాలి" అంటూ నినాదాలు మార్మోగాయి.

# 45వ డివిజన్ కార్పొరేటర్‌గా దోమల సునీత

– లక్ష్మణ్‌కు ఘన సన్మానం



**మంచిర్యాల, 2,మార్చి (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 45వ డివిజన్ నుంచి డివిజన్ ప్రజల ఆదరాభిమానాలతో, ప్రజలు ఎదుర్కొనే మౌలిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కార్పొరేటర్‌గా గెలుపొందిన కేబుల్ డిష్ అధినేత, పద్మశాలీయుల ముద్దు బిడ్డ, సేవా నిరతులు శ్రీమతి అండ్ శ్రీ దోమల సునీత--లక్ష్మణ్ కు సోమవారం ఘన సన్మానం చేశారు. తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక, శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, కార్పొరేటర్‌గా గెలుపొందినందుకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా దోమల సునీత--లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రజల నమ్మకానికి తగినట్లుగా డివిజన్ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని, భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానాలకు అధిరోహించేలా భగవంతుడి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, రాష్ట్ర పద్మశాలి సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కేబుల్ డిష్ అధినేత దోమల రమేష్, సామాజిక ఉద్యమ కారుడు అడిచర్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# వనపర్తిలో ఘనంగా టైక్వాండో బెల్ట్ గ్రేడింగ్

- ఆడపిల్లలకు స్వీయరక్షణపై దృష్టి
- విజేతలకు సర్టిఫికెట్ల ప్రదానం

వనపర్తి ప్రతినిధి, మార్చి 2 (ప్రజాజ్యోతి): వనపర్తి జిల్లా కేంద్రంలోని సాయి నగర్ కాలనీలో మాస్టర్ మైండ్ హై స్కూల్లో ఆదివారం టైక్వాండో మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలను మాస్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు, విద్యార్థినీలు ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణులయ్యారు. ఈ కార్యక్రమం అనంతరం




విజేతలకు బెల్ట్ గ్రేడింగ్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, టైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ధైర్యాన్ని పెంచుతాయని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ముఖ్యంగా ఆడపిల్లలకు స్వీయరక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) అత్యంత అవసరమని పేర్కొన్నారు. అదే విధంగా పాఠశాల కరెస్పాండెంట్ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ, చదువుతో పాటు శారీరక వ్యాయామం, మెదడు చురుకుదనం కూడా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అవసరమని తెలిపారు. ఆరోగ్యవంతమైన విద్యార్థులే భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణించగలరని చెప్పారు. బాలికలకు స్వీయరక్షణలో ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పాఠశాల స్థాయిలోనే ఇలాంటి శిక్షణ అందించడం అభినందనీయమని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కోచ్ బుద్ధారం రవికుమార్, జూనియర్ కోచ్ శివలీల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, మార్చి 2 (ప్రజాజ్యోతి): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి దుద్దిళ్ల శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కొనియాడారు. సోమవారం కలెక్టరేట్‌లో మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ పాల్గొని శ్రద్ధాంజలి



ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ శాసనసభ్యుడిగా, శాసనసభ స్పీకర్‌గా దుద్దిళ్ల శ్రీపాదరావు అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ముఖ్యంగా 1964 నుంచి 1999 వరకు ప్రజల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, క్రీడలు & యువజన శాఖ అధికారి సుధీర్ రెడ్డి, ఏఓ భాను ప్రకాష్, డిపిఆర్ఓ సీతారాంతో పాటు కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాసనసభ గౌరవాన్ని నిలబెట్టిన మహానేత దుద్దిళ్ల శ్రీపాదరావుకు ఘన నివాళి

గద్వాల మార్చి 02(ప్రజా జ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ,జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఘనంగా నివాళులు అర్పించారు.సోమవారం ఐడీఓసీ ఆవరణలో శ్రీపాదరావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై,ఇతర అధికారులతో కలిసి శ్రీపాదరావు



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శ్రీపాదరావు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసి శాసనసభ స్పీకర్‌గా విశేష సేవలు అందించారని కొనియాడారు.సభ గౌరవం,మర్యాదలను కాపాడటంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.శ్రీపాదరావు ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవకు అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకర విషయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,ఆర్డీఓ శ్రీనివాసరావు,కలెక్టరేట్ ఏఓ భూపాల్ రెడ్డి,ఇతర జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను పరిష్కరించాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

గద్వాల మార్చి 02(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రతి అధికారి ప్రాధాన్యతనిస్తూ తమ శాఖల పరిధిలో వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 71 ఫిర్యాదులు వచ్చాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు,అదనపు కలెక్టర్ నర్సింగరావు,ఆర్డీవో శ్రీనివాసరావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులతో మాట్లాడుతూ,ప్రతి సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం1:00 గంటల వరకు ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్ లైన్ లో నమోదు చేసి వారంలోగా పరిష్కరించాలన్నారు.పరిష్కారం కాని దరఖాస్తులకు తగిన కారణాలు పేర్కొంటూ నిబంధనల ప్రకారం తిరస్కరించాలన్నారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.వికలాంగులు వయోవృద్ధులకు వీల్ చైర్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజావాణిలో తమ



అర్జీలను ఇచ్చేందుకు వచ్చే ప్రతి ఒక్కరికి వరుస క్రమంలో టోకెన్లు జారీ చేయనున్నట్లు చెప్పారు. ప్రజావాణిలో తమ ఫిర్యాదులను తెలియజేసే ఆయా మండలాల ప్రజలకు జవాబుదారీగా ఉండేందుకు సంబంధిత ఎమ్మార్వోలు,ఎంపీడీవోలను కూడా భాగస్వాములను చేస్తూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి అప్పటికప్పుడు ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పెన్షన్లు,ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నందున ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ప్రజావాణికి వచ్చే చాలామంది ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియక అయోమయంలో ఉంటున్నారని,వారికి సహకారం అందించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ఒక అధికారిని నియమించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రమనీయం.. కమనీయం దేవరకొండ విజయ రష్మిక రిసెప్షన్

- తులసి మాతకు ప్రత్యేక పూజలు
- స్వగ్రామం తుమ్మన్ పేటలో పండుగ వాతావరణం
- అభిమానులకు... జోష్ నింపిన నూతన దంపతులు
- రిసెప్షన్లో పాల్గొన్న ఎంపీ మాజీ మంత్రి

నాగర్ కర్నూల్ మార్చ్ 2 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) నాగర్ కర్నూలు జిల్లా బల్మూరు మండలం తుమ్మంపేట విజయ దేవరకొండ స్వగృహంలో నడుమ నిర్వహించారు. దేవరకొండ విజయ్ స్వగ్రామంలో అభిమానుల నడుమ వీఐపీలు మాజీ మంత్రి పోతుగంటి రాములు, ఎంపీ మల్లు రవి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బదవత్ సంతోష్ నాయక్ ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు వేడుకలను తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన స్టేజి వద్దకు వచ్చి వేలాది మంది అభిమానులకు నూతన దంపతులు అభివాదం తెలుపగా..? ఇండియన్ పాన్ స్టార్ ఐకాన్ దేవరకొండ విజయ రష్మిక మందాన తుమ్మన్ పెట్ గ్రామం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలం తుమ్మన్పేట గ్రామానికి చెందిన గోవర్ధన్ రావు మాధవి దంపతులకు పుట్టిన ఇద్దరి సంతానంలో విజయ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ ఇద్దరు కుమారులు ఉన్నారు. సినిమా హీరో పాన్ ఇండియా ఐకాన్ స్టార్ తుమ్మన్ పెట్ గ్రామంలో జన్మించడం జరిగింది. హీరో తన స్వగ్రామం లో రిసెప్షన్ వేడుకలు జరుపుకోవాలడం అభినందనీయమని పలు రాజకీయ నాయకులు గ్రామస్తులు





సోమవారం విజయ దేవరకొండ రష్మిక మందాన పెండ్లి రిసెప్షన్ వేడుకలు రమణీయం కమనీయంగా వేలాది మంది సమక్షంలో రిసెప్షన్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ముందుగా నూతన దంపతులు తెలంగాణ సాంప్రదాయ బద్ధంగా తులసి మాతకు పూజలు చేసి అనంతరం ఏర్పాటు చేసిన వేద పండితుల వేద మంత్రాల నడుమ లక్ష్మీనరసింహస్వామి వ్రతం వేడుకలు కోలాటాలు కూచిపూడి నృత్యాల దంపతులకు చూసి స్వగ్రామం అభిమానుల సంతోషం వ్యక్తపరిచారు. రిసెప్షన్ వేడుకలకు విఐపి లకు మీడియా ప్రతినిధులకు ప్రత్యేకంగా పాసులు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ పల్లె శ్రీనివాస్, సీఐ నాగార్జున బల్మూరు మండల ఎస్సై రాజేందర్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పాన్ ఇండియా స్టార్ దేవరకొండ విజయది హర్షం వ్యక్తం చేశారు. అచ్చంపేట నియోజకవర్గంలో 9వ తరగతి పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం సాధించిన మెరిట్ విద్యార్థులకు ప్రతి విద్యార్థికి పదివేల రూపాయలు ఇస్తామని హీరో దేవరకొండ ప్రకటించారు. రిసెప్షన్ వేడుకలు వచ్చిన ప్రముఖులకు మీడియా ప్రతినిధులకు 52 రకాల వంటకాలతో భోజనాలు ఏర్పాటు చేసి తాంబూలాలు అందించారు

# రాహుల్ గాంధీని కుటుంబ సమేతంగా కలిసిన శివసేన రెడ్డి

- బూత్ స్థాయి నుంచి పార్టీ పటిష్టతపై రాహుల్ గాంధీ దిశానిర్దేశం

వనపర్తి ప్రతినిధి, మార్చి 2 (ప్రజాజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల కోసం నిర్వహించిన “సంఘటన్ సృజన్ అభియాన్” శిక్షణ శిబిరం పది రోజులపాటు విజయవంతంగా కొనసాగింది. శిబిరం ముగింపు కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి పర్యాటక ప్రాంతంలో సోమవారం నిర్వహించిన ఈ శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి కుటుంబ సమేతంగా రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో క్రీడా సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న క్రీడా కార్యక్రమాలు, జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై రాహుల్ గాంధీ, శివసేన రెడ్డితో చర్చించారు. అనంతరం శిక్షణ శిబిరంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులకు సంస్థాగత బలోపేతం, సమర్థ నాయకత్వం, బూత్ స్థాయి నుండి పార్టీని




పటిష్టం చేసే వ్యూహాలపై మార్గనిర్దేశం చేశారు. ఇలాంటి శిక్షణ శిబిరాలు పార్టీ నిర్మాణానికి ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్య విలువలకు ప్రతీక-దుద్దిల్ల శ్రీపాదరావు:జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు




గద్వాల మార్చి 02(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగుళాంబ గద్వాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో దుద్దిల్ల శ్రీపాదరావు జయంతిని ఘనంగా నిర్వహించారు.జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు,ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వారి సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ సభాపతిగా శ్రీపాదరావు ప్రజాస్వామ్య పరిరక్షణలో విశేష కృషి చేశారని తెలిపారు.శాసనసభను నిష్పక్షపాతంగా,గౌరవప్రదంగా నడిపిస్తూ అధికార–విపక్షాలకు సమాన అవకాశాలు కల్పించిన నాయకుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు.శాసనసభ గౌరవం,నియమావళి పటిష్ఠతకు ఆయన చేసిన సేవలు ఆదర్శనీయమని కొనియాడారు.ప్రజల సమస్యలను శాసనసభలో బలంగా ప్రస్తావిస్తూ,సరళ జీవనం,ఉన్నత విలువల రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన మహనీయుడని ఎస్పీ గుర్తుచేశారు.ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి ప్రజాసేవలో ముందంజలో ఉండాలని పోలీసు సిబ్బందికి పిలుపునిచ్చారు.జిల్లా పోలీసు శాఖ శాంతి భద్రతల పరిరక్షణలో మరింత కట్టుదిట్టంగా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.శంకర్, పోలీస్ కార్యాలయ ఏవో సతీష్ కుమార్,గద్వాల డి.ఎస్పీ.వై.మొగిలయ్య,ఏ.ఆర్. డి.ఎస్పీ.టి నరేందర్ రావు,ఆర్.ఐ లు నరేష్(అడ్మిన్),వెంకటేష్ ఎమ్.టి.ఓ.,అల్లంపూర్ సర్కిల్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్,ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.

# హోలీ పండుగను సంప్రదాయ పద్ధతుల్లో సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలి

హోలీ పండుగ సందర్భంగా జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు.

నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చ్ 02( ప్రజా జ్యోతి) నారాయణపేట జిల్లా: హోలీ పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలంతా హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో, సాంప్రదాయ పద్ధతుల్లో, సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలని సూచించారు.
హోలీ పండుగతో పాటు రంజాన్ మాసం కూడా కొనసాగుతున్నందున మతసామరస్యాన్ని కాపాడుతూ పరస్పర గౌరవంతో పండుగలు నిర్వహించుకోవాలని తెలిపారు. మత పెద్దలతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అతివేగం, రష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి చర్యలను పూర్తిగా నివారించాలని సూచించారు. ప్రధాన చౌరస్తాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడంతో పాటు ముఖ్య ప్రదేశాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి నిరంతర పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.




ఇష్టం లేని వ్యక్తులపై, వాహనాలపై లేదా బహిరంగ ప్రదేశాల్లో బలవంతంగా రంగులు, రంగు నీళ్లు చల్లకూడదని స్పష్టం చేశారు. బైకులు, కార్లలో గుంపులుగా తిరిగి శాంతి భద్రతలకు భంగం కలిగించవద్దని హెచ్చరించారు. హోలీ అనంతరం చెరువులు, కుంటలు, లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు చేసే సమయంలో యువత తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే అక్కడ కూడా బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలను గమనిస్తూ వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలంతా శాంతియుతంగా, భద్రంగా హోలీ పండుగను జరుపుకుని పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.

# ప్రజావాణికి 21 ఫిర్యాదులు

నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చ్ 02( ప్రజా జ్యోతి) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణింధర్ రెడ్డి,అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో



సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 21 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కోసం కలెక్టర్ ను ఆశ్రయించిన బాధితుడు

మహబూబ్‌నగర్, మార్చి 02 (ప్రజా జ్యోతి బ్యూరో) డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయింపులో జరిగిన అన్యాయంపై బాధితుడు ఎం. రవీందర్ సోమవారం ప్రజా వాణి లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్త ను కలిసి ఫిర్యాదు చేశారు. గతంలో సీఎం ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుకు



సంబంధించిన వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి, తనకు ఇప్పటివరకు న్యాయం జరగలేదని వివరించారు. అర్హత ఉన్నప్పటికీ పైరవీల కారణంగా తన పేరును జాబితా నుంచి తొలగించారని రవీందర్ ఆరోపించారు. క్షేత్రస్థాయి విచారణలో కొన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చినప్పటికీ, తుది నిర్ణయం ఆలస్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.
తన కుటుంబం ప్రస్తుతం అద్దె ఇంటిలో ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తోందని, నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ పట్టాను తిరిగి మంజూరు చేసి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ అంశంపై తగిన పరిశీలన చేసి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

# సురక్షితంగా - సంప్రదాయబద్ధంగా హోలీ వేడుకలు జరుపుకుందాం

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

మహబూబ్‌నగర్, మార్చి 02 (ప్రజా జ్యోతి బ్యూరో) హోలీ పండుగను సంప్రదాయ పద్ధతుల్లో, సహజ సిద్ధమైన రంగులతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి సూచించారు. పండుగ సందర్భంగా ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ఇష్టం లేని వ్యక్తులపై బలవంతంగా రంగులు




లేదా రంగు నీళ్లు చల్లడం చేయరాదని, బైకులు, కార్లలో గుంపులుగా తిరుగుతూ పెద్ద శబ్దాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువత అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడవద్దని సూచించారు. సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్–100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659360 కు సమాచారం ఇవ్వాలని కోరారు. హోలీ అనంతరం చెరువులు, లోతట్టు ప్రాంతాలు, ప్రాజెక్టుల వద్ద స్నానాల సమయంలో జాగ్రత్తలు పాటించాలని, తల్లిదండ్రులు పిల్లలపై పర్యవేక్షణ వహించాలని సూచించారు. జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో గోమాతకు ఘనంగా అంత్యక్రియలు

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, మార్చ్ 02 (ప్రజా జ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినటువంటి గోమాతకు బజరంగ్ దళ్ మఖ్తల్ శాఖ వారు ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. నారాయణపేట జిల్లా





మఖ్తల్ పట్టణ కేంద్రంలో ఒక గోవు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండడంతో సోమవారం మధ్యాహ్నం గోవు తీవ్ర అస్వస్థతకు గురైందని తెలుసుకున్న బజరంగ్ దళ్ మఖ్తల్ శాఖ కార్యకర్తలు పశు వైద్య నిపుణులతో చికిత్స చేయించినప్పటికీ చికిత్స పొందుతూ గోమాత మృతి చెందడంతో బజరంగ్ దళ్ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బందితో కలిసి జెసిబి సహాయంతో గోమాతకు ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ప్రఖండ సాహ సంయోజక్ మూర్తి,ప్రఖండ గోరక్ష సంయోజక్ అనిల్, అక్షయ్,నాగరాజు,నవీన్,వెంకు,రాము, శివ,చెన్నకేశవులు బజరంగ్ దళ్ కార్యకర్తలు ఇతరతులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న బంగారాభరణాలు బాధితులకు అప్పగించిన పోలీసులు

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, మార్చ్ 02 (ప్రజా జ్యోతి): సోమవారం రెండు గంటల సమయంలో కృష్ణ మండలం కున్సి గ్రామానికి చెందిన బూదూరోళ్ల ఆర్తి సాగర్ నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణ కేంద్రంలోని ఓ జ్యువెలర్స్ షాప్ లో వివాహం నిమిత్తం ఒక జత బంగారు కమ్మలు, ఒక బంగారు ముక్కుపుడక మరియు ఒక జత వెండి మెట్టెలు కొనుగోలు చేసి స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు.



అదే క్రమంలో మఖ్తల్ పట్టణం నుండి నారాయణపేట క్రాస్ రోడ్ లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు సమీపంలో బంగారు వెండి ఆభరణాలు ఉన్నటువంటి బ్యాగ్ పోగొట్టుకున్నట్లు గుర్తించిన బాధితులు వెంటనే మఖ్తల్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న మఖ్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి తన సిబ్బందితో కలిసి బంగారు ఆభరణాలు మిస్ అయినటువంటి ప్రదేశాలతో పాటు సీసీ కెమెరాల ఫుటేజ్ ను పరిశీలించి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆభరణాలను గుర్తించి సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు. తదుపరి వాటిని బాధితులకు అప్పగించడంతో వారు మఖ్తల్ పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ ప్రజలు విలువైన వస్తువులు తీసుకువెళ్తున్నప్పుడు మరింత జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## హనుమకొండ కలెక్టరేట్‌లో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి

కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు





హనుమకొండ మార్చి 02 (ప్రజా జ్యోతి) : హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ శ్రీపాదరావు చిత్రపటానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ ఎన్. రవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ సత్యపాల్ రెడ్డి, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, జడ్పి సీఈవో శేషాద్రి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా దివంగత శాసనసభ స్పీకర్ శ్రీపాదరావు జయంతి కార్యక్రమం



జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 02 (ప్రజాజ్యోతి) : దివంగత శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్ లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు

## ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 02 (ప్రజాజ్యోతి) : ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్ షాలోమ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీదారుల సమస్యల గురించి తెలుసుకుంటూ 86 అర్జీలను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డీఆర్డీఓ వసంత, జిల్లా పౌరసరఫరాల అధికారిణి సరస్వతి, డీపీఓ అంబికా సోనీ, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పల్లెలకు సీసీ కెమెరాలే రక్ష..

**మామునూర్ ఏసీపీ వెంకటేష్**

- కాపులకనపర్తిలో రేడియం పెట్రోల్ కారు ప్రారంభం..
- ఒకొక్క సీసీ కెమెరా ఒక పోలీసుతో సమానం..
- కెమెరాల ఏర్పాటుతో నిత్యం పోలీస్ నిఘా ఉంటుంది
- పర్వతగిరి సిఐ రాజగోపాల్ సంగెం ఎస్సై వంశీకృష్ణ





సంగెం, మార్చి 02 (ప్రజాజ్యోతి) : పల్లెల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజల భద్రత మరింత పెరుగుతుందని మామునూర్ ఏసీపీ వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం రోజున మండలంలోని కాపులకనపర్తి గ్రామంలో సర్పంచ్ చంద్రమౌళి సహకారంతో 16 కొత్త కెమెరాలు ఏర్పాటు చేయగా మామునూర్ ఏసీపీ వెంకటేష్ పర్వతగిరి సిఐ రాజగోపాల్ సంగెం ఎస్సై వంశీకృష్ణ ప్రారంభించి అభినందించారు.అదేవిధంగా ఎస్సై వంశీకృష్ణ యాక్సిడెంట్లు జరగకుండా ఏర్పాటుచేసిన రేడియం పెట్రోలింగ్ కారును రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎసిపి వెంకటేష్ మాట్లాడుతూ.. యాక్సిడెంట్లు దొంగతనాలు జరగకుండా రేడియం ఇమేజ్ కలిగిన పోలీస్ కారు కాపాడుతుందని అన్నారు. పర్వతగిరి సిఐ రాజగోపాల్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలు తప్పనిసరిగా పెట్టించుకున్నట్లయితే యాక్సిడెంట్లు దొంగతనాలు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడ్డుకోవచ్చని తెలిపారు.ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ..గ్రామాల్లో ఏర్పాటుచేసిన ఒకొక్క సీసీ కెమెరా ఒక పోలీసుతో సమానమని,కెమెరాల ఏర్పాటుతో నిత్యం పోలీస్ నిఘా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు సిద్ధం...



సంగెం, మార్చి 02 (ప్రజాజ్యోతి): మండల కేంద్రానికి పదో తరగతి పరీక్షల ప్రశ్నపత్రాలు భద్రంగా చేరినట్లు సంగెం పర్వతగిరి మండలాల విద్యాధికారులు నరసింహచార్యులు బిక్షపతి తెలిపారు.మార్చి నెల పద్నాలుగు నుంచి పరీక్షలు ప్రారంభం కాగా జెడ్పిహెచ్ఎస్ సంగెంలో 124 మంది,గవిచర్ల మోడల్ స్కూల్ లో 240 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.భద్రత తాగునీరు విద్యుత్ వైద్య సదుపాయాలతో అన్ని ఏర్పాట్లు పూర్తియ్యాయని చిఫ్ సూపరింటెండెంట్ గుగులోత్ రాము వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రద్యుమ్న, సురేష్, భూపతి, రవి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## సప్తవర్ణ శోభితమైన వసంతోత్సవ కేళిగా హోలీ పండుగ





**కాలుష్యరహిత హోలీకి పిలుపు**

హసన్‌పర్తి, మార్చి 2 (ప్రజాజ్యోతి) : హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ మిత్ర విభాగం ఆధ్వర్యంలో కాలుష్యరహిత హోలీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుతోట శాంతారామ్ కర్ణ మాట్లాడుతూ, సప్తవర్ణ శోభితమైన వసంతోత్సవ కేళిగా హోలీ పండుగ ఆనందోత్సాహాలను రేకెత్తించే పండుగ అని తెలిపారు. ప్రకృతి రంగులతో మేళవించిన వసంత ఋతువును ఆహ్వానిస్తూ, వయసుతో సంబంధం లేకుండా అందరూ రంగులు పులుముకుంటూ కేరింతలతో ఉల్లాసంగా జరుపుకునే కనుల విందైన పండుగగా హోలీ నిలుస్తుందని వివరించారు. అయితే నేటి రోజుల్లో విషపూరిత రసాయనాలతో తయారైన రంగులను వినియోగించడం వల్ల చర్మవ్యాధులు, అలర్జీలు, ఉబ్బసం, కంటి చూపు దెబ్బతినడం, వెంట్రుకల రంగు మారిపోవడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని హెచ్చరించారు. అందుకే సహజంగా లభించే పసుపు, కుంకుమ, బుక్క, గులాలు, చెట్ల పూలతో తయారైన రంగులను వినియోగించాలని సూచించారు. ఇవి ఎటువంటి హాని కలిగించవని, శరీరానికి కాంతి సౌందర్యం మరింత పెరుగుతుందని చెప్పారు. విద్యార్థినీ విద్యార్థులు హోలీ పండుగను విషపూరితంగా మార్చకుండా కాలుష్యరహితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని రంగుల పండుగను ఆనందంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయులు గూడూరు లక్ష్మీనారాయణతో పాటు ఉపాధ్యాయులు జూపాక నాగరాజు, ఏ. వెంకట్, ఈ. ప్రవీణ్, పి. వెంకటేశ్వర్లు, వై. అరుణ, జి. సంధ్య, సిహెచ్. సంధ్య, సిహెచ్. సుచిత్ర, ఎల్. సరిత, పి. మౌనిక, జి. దేవిక, సబిహ బేగం, ప్రవళిక, దేవిక, భవాని, సుధారాణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నిత్యం పోరాటమే కమ్యూనిస్టుల ధ్యేయం



**గుడిసె వాసులకు ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలి**

హసన్‌పర్తి, మార్చి 2 (ప్రజాజ్యోతి) : దేశంలో పాలక వర్గాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి పేర్కొన్నారు. పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.సోమవారం పలివేల్పుల గ్రామంలో గుడిసెల కేంద్రం వద్ద సిపిఐ శాఖ సమితి సమావేశం జరిగింది. ఆ పార్టీ శాఖ కార్యదర్శి గొర్రె నందిని అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తోట బిక్షపతి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఆచరణలో మాత్రం అరకొరగా అమలు చేసి గొప్పలు చెప్పుకుంటున్నాయని విమర్శించారు. స్థానికంగా కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించని పరిస్థితి బాధాకరమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని స్థితి నెలకొందని పేర్కొన్నారు. పేదల కోసం నిత్యం పోరాటం చేసే శక్తి కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల్లో నిలువనీడ కోసం గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేదలకు వెంటనే ఇంటి పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు.

దశాబ్దాలుగా పోరాటాలు కొనసాగుతున్నప్పటికీ పాలక ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప పేద ప్రజలకు ఇళ్లు, స్థలాలు, పట్టాలు అందని ద్రాక్షగానే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి గుడిసెల వాసులకు ఇంటి పట్టాలు మంజూరు చేసి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఎన్.ఏ. స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి దామెర సుదర్శన్, నాయకులు గూగులోత్ సురేష్, పాకాల సంతోష్, పులి ముత్తయ్య, నతనీయల్, బొక్క ఈశ్వర, పులి యశోద, దేవరకొండ జయ, గూగులోతు పర్ణిక, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ జిల్లా కలెక్టరేట్ (ఐ.డి.ఓ.సి)లో ప్రజావాణి కార్యక్రమం





**ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

హనుమకొండ మార్చి 02 (ప్రజా జ్యోతి) : హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం (ఐ.డి.ఓ.సి)లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయ్ ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక మరియు భూసంబంధిత సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా రెవెన్యూ, పింఛన్లు, డబుల్ బెడ్‌రూమ్ గృహాలు, ఉపాధి, భూ వివాదాలు, రేషన్ కార్డులు, విద్యా మరియు ఆరోగ్య సంబంధిత అంశాలపై పలువురు అర్జీలు సమర్పించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగావిని, సంబంధిత శాఖాధి కారులకు తక్షణ విచారణ చేసి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేదికగా నిలుస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో ఆలస్యం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పరిపాలన అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను స్వీకరించారు. జిల్లా ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.జిల్లా ప్రజాసంబంధాల కార్యాలయం హనుమకొండ.

## ఆత్మకూరు గ్రామ పంచాయితీలో అభివృద్ధి పనులు వేగవంతం









ఆత్మకూరు, మార్చి 02 (ప్రజాజ్యోతి) : ఆత్మకూరు గ్రామ పంచాయితీలో అభివృద్ధి పనులు వేగవంతం అయ్యాయి. నూతన సర్పంచ్ గా ఎన్నికైన తరువాత పర్వతగిరి మహేశ్వరి రాజు గృహ లక్ష్మి లబ్దిదారులకు సోలార్ ఏర్పాటు చేయటంలో విద్యుత్ అధికారుల తో కలిసి గ్రామంలో వంద శాతం సోలార్ గ్రామంగా నిలిపారు. ఎమ్మెల్యే సహకారంతో 30 లక్షల సిసి రోడ్లు మంజూరు చేయించారు. 35 లక్షలతో ఎస్సీ, ఎస్టి సబ్ ప్లాన్ రోడ్లు, 60 లక్షలతో ప్లాస్టిక్ శుద్ధికరణ కేంద్రం నెలకొలిపారు. గ్రామపంచాయతీ నిధులతో డ్రైనేజీలు తదితర పనులు చేపడుతూ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా సర్పంచ్ మహేశ్వరి ముందుకు వెళుతున్నారు. సోమవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ 35 లక్షలతో ఎస్సీ, ఎస్టి సబ్ ప్లాన్ రోడ్లు, బీసీ కాలనీ, ముదిరాజ్ కాలనీలలో 30 లక్షలు జనరల్ ఫండ్ నుండి సిమెంట్ రోడ్లను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి ప్రభుత్వం నిధులతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారంతో గ్రామాన్ని రాష్ట్రానికే ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దామని సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సహకారంతో 54 కోట్లతో ప్రతి ఇంటికి ఆత్మకూర్ గ్రామంలో సోలార్ విద్యుత్ పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయించామన్నారు. గ్రామంలో డంపింగ్ యార్డ్ లేకపోవడంతో ఇబ్బంది లేకుండా 60 లక్షలతో ప్లాస్టిక్ చెత్త శుద్ధికరణ ప్లాంటును ఏర్పాటు చేయించామని అన్నారు. గ్రామపంచాయతీ నిధులతో పలు కాలనీలలో సైడ్ డ్రైనేజీలు ఏర్పాటు చేపిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి అండదండలతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఆత్మకూరు గ్రామాన్ని జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీగా అభివృద్ధి చేయడమే మా లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆత్మకూర్ ప్రజల సహకారంతో ఆత్మకూరును ఎంతో అభివృద్ధి చేసి చూపిస్తానని సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరీ రాజు అన్నారు.

### వెయ్యి స్తంభాల రుద్రేశ్వర దేవాలయంలో

## చంద్రగ్రహణం సందర్భంగా ద్వార బంధనం

**దేవాలయం ఈవో డి.అనిల్ కుమార్**



హనుమకొండ మార్చి 02 (ప్రజాజ్యోతి) : చంద్రగ్రహణం సందర్భంగా హనుమకొండలోని చారిత్రక వెయ్యి స్తంభాల దేవాలయంలో ప్రత్యేక ఆచారాలునిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో డి.అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారం (03-03-2026) ఉదయం 9.00 గంటలకు ఆలయ ద్వారాలు బంధించి, బుధవారం (04-03-2026) ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించబడుతుందని వెల్లడించారు. గ్రహణ కాల వివరాలు:పాక్షిక చంద్రగ్రహణం ప్రారంభం : మధ్యాహ్నం 3.20 గంటలకు మధ్యకాలం : సాయంత్రం 5.03 గంటలకుపాక్షిక అంత్యకాలం : సాయంత్రం 6.40 గంటలకుఈ చంద్రగ్రహణం అధిక శాతం పగటి సమయంలోనే సంభవిస్తుందని తెలిపారు. పగటి కాలంలో సంభవించే చంద్రగ్రహణాలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంటుందని, దోష నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.జ్యోతిష్య సూచనలు, పుబ్బ నక్షత్రం, సింహ రాశి వారు గ్రహణం వీక్షించరాదని సూచించారు.సింహ, వృషభ, మకర, కన్య రాశుల వారికి అశుభ ప్రభావం ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు.గ్రహణ సమయంలో భక్తులు భగవన్నామ స్మరణ చేయడం ఉత్తమమని సూచించారు. ప్రత్యేక సూచనలు.. గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, ఆరోగ్యం సహకరించని వారు మధ్యాహ్నం 12 గంటలలోపు భోజనం చేయాలని తెలిపారు. గ్రహణ దోష నివారణ కోసం భక్తులు దానధర్మాలు చేయాలని సూచించారు. దానం చేయవలసినవిబియ్యం, ఉలువలు, వెండిచంద్రబింబం, నాగపడిగ, రాగి, పాత్ర, నెయ్యి, అలాగే శివాభిషేకాలు నిర్వహించుకోవాలని సూచించారు. గ్రహణానంతరం సంప్రోక్షణ కార్యక్రమం పూర్తి చేసిన తరువాత సాధారణ దర్శనం ప్రారంభమవుతుందని దేవస్థానం డి.అనిల్‌కుమార్ కార్య నిర్వహణాధికారి తెలిపారు.

## నూతన ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభించిన చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్

**- వైస్ చైర్మన్ గంధం నరేందర్**



నర్సంపేట మార్చి 02 (ప్రజాజ్యోతి) : నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకపేట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభించిన నర్సంపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ పెండెం శ్రీ లక్ష్మీరామానంద్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మాదాసి రవి, శ్రీరామోజు రోజా రాణి, పొన్నాల మనిషా ప్రకాష్, ఏఈ నీలం విజయ్ భాస్కర్, లైన్ ఇన్స్పెక్టర్ మేడి రాధిక, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, లైన్ మెన్ బేరి రాజు, అసిస్టెంట్ లైన్ మెన్ కోట రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నూనె నర్సయ్య, కొర్ర రాహుల్, స్వామిశెట్టి శేఖర్, కాట అఖిల్, భూక్య గణేష్, చీకటి శివమణి, తదితరులు పాల్గొన్నారు..

## రామానుజాపూర్‌లో సిసి రోడ్లు డ్రైనేజీ పనులు ప్రారంభం





వెంకటాపూర్/ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజాపూర్ గ్రామంలో నూతన సిసి రోడ్లు, డ్రైనేజీ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పంచాయితీ రాజ్ రాష్ట్ర డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డిఆధ్వర్యంలో కొబ్బరి కాయలుకొట్టి పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రామానుజాపూర్ గ్రామ సర్పంచ్ పెండెల అశోక్,ఉప సర్పంచ్ రాగుల రవి,మాజీ సర్పంచ్ తుమ్మేటి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బుర్ర సమ్మయ్య,వార్డు మెంబర్లు,ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మండల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 02 (ప్రజాజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో భాగంగా జనగామ పట్టణంలోని ఏబివి ప్రయివేట్, ప్రభుత్వ జూనియర్ కాలేజీలని సోమవారం జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, హాజరు వివరాలు, సీసీ కెమెరాల పనితీరు, తాగునీరు, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించాలని సూచించారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కళాశాల నిర్వాహకులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు.

# అంగన్వాడి కేంద్రం-2లో ఆరోగ్యలక్ష్మి కమిటీ ఏర్పాటు

గుండాల, మార్చి 02 (ప్రజా జ్యోతి): గుండాల మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రం–2లో ఆరోగ్యలక్ష్మి కమిటీని ఏర్పాటు చేశారు.గ్రామ సర్పంచ్ దేవనబోయిన ఐలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.





కమిటీ చైర్మన్‌గా గ్రామ సర్పంచ్ దేవనబోయిన ఐలయ్యను,కన్వీనర్‌గా అంగన్వాడి టీచర్ వి. స్వర్ణలతను నియమించారు.సభ్యులుగా ఆశా వర్కర్ ఆవుల సుజాత,శిరీష,రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాంద్ర సిద్ధారెడ్డి,వీవో సూదగాని బాలకృష్ణ,అన్నెపర్తి అనిత,చాగంటి లత,స్వప్న,అన్నెపర్తి సంధ్య,అన్నెపర్తి శ్రీజలను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి నెల 5వ తేదీ లోపు కమిటీ సమావేశం నిర్వహించి,గ్రామంలోని గర్భిణీలు,బాలింతలు,చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ ప్రజలకు ఆరోగ్యం,పోషకాహారం,పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ అంగన్వాడి సేవలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

# దేవాదుల నీటిని అన్ని గ్రామాలకు అందించాలి

బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఆర్వోకు వినతి పత్రం

గుండాల, మార్చి 2 (ప్రజా జ్యోతి): గుండాల మండలంలోని ప్రతి గ్రామానికి దేవాదుల ప్రాజెక్ట్ నీటిని సమానంగా అందించాలంటూ బీజేపీ గుండాల మండల శాఖ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ అధికారి హరికృష్ణ కు వినతి పత్రం



సమర్పించారు. మండలంలోని అనేక గ్రామాలు తాగునీరు,సాగునీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని నాయకులు తెలిపారు.దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ,అన్ని గ్రామాలకు సమానంగా సరఫరా జరగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.మండలంలోని అన్ని గ్రామాల నీటి అవసరాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని,దేవాదుల నీటి పైప్‌లైన్లను విస్తరించి చేరని గ్రామాలకు కనెక్షన్లు కల్పించాలని,తాగునీరు మరియు సాగునీటి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పనులను వేగవంతం చేయాలని కోరారు.మండల ప్రజల సమస్యను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని ఎంఆర్వోను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పింగళి విజయ్ రెడ్డి,జిల్లా కౌన్సిల్ మెంబర్ చెడ నాగయ్య, మండల కార్యదర్శి కె. కృష్ణ, బీజేవైఎం నాయకులు సోమరాజు, ఎర్రగోల్ల నరసింహా, యమగాని బాలయ్య, ఎల్లయ్య, కాళి శ్రీను,గొల్లపల్లి సురేష్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# కారు ఢీకొని వ్యక్తి మృతి

మిర్యాలగూడ, మార్చి 02,( ప్రజాజ్యోతి ): మిర్యాలగూడ మండలం తుంగపహాడ్ లో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం లో కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన జరిగింది. రూరల్ ఎస్సై ఎం లక్ష్మయ్య తెలిపిన వివరాల మేరకు తుంగపాడు గ్రామానికి చెందిన పగడాల మధుసూదన్ (36) ఆదివారం రాత్రి ఇంటి సామాన్లు తీసుకు వచ్చేందుకు తన బైక్ పై బైటికి వెళ్తూ కోదాడ – జడ్చర్ల హైవే యుటర్న్ వద్ద మూలమలుపు తిరుగుతుండగా త్రిపురారం నుండి మిర్యాలగూడ వైపు వస్తున్న కారు బైక్ ను బలంగా ఢీకొట్టడంతో మధుసూదన్ తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా, సోమవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో మృతి చెందాడు. మృతిని భార్య పగడాల సంఖ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మయ్య తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



# ఉమ్మడి డిస్ట్రిక్ట్ చదరంగం పోటీల విజేతలకు బహుమతులు అందజేత

కోదాడ టౌన్,మార్చి 02 (ప్రజా జ్యోతి): కోదాడ ఎమ్మెస్ జూనియర్ డిగ్రీ క ళాశాల లో చదరంగం పోటీలు ఏర్పాటు చేసినారు. పోటీలో విజేతలకు బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్య అతిధులుగా కాలేజీ చైర్మన్ పందిరి నాగిరెడ్డి, పస్య నవీన్ రెడ్డి లు పాల్గొని బహుమతులను క్రీడాకారులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజర్ కొండా నరసింహారావు, రవికుమార్, నాగిరెడ్డి, అశోక్ రెడ్డి, రాము, రమేష్ పాల్గొనడం జరిగింది.



# సూర్యాపేట జెడ్పీ పీఠంపై ఉత్తమ్ గురి

**క్లీన్ స్వీప్ లక్ష్యంగా మంత్రి వ్యూహరచన!**

**జిల్లా రాజకీయాల్లో 'ఉత్తమ్' మార్క్**

**జెడ్పీ ఎన్నికల సమరానికి కాంగ్రెస్ సై!**

**గులాబీ కోటలో హస్తం హవా**

**సూర్యాపేట జిల్లా పరిషత్‌పై మంత్రి ఉత్తమ్ దండయాత్ర!**

**అభివృద్ధి మంత్రం, ఎన్నికల తంత్రం**

**మున్సిపల్ జోష్‌తో జెడ్పీ పీఠంపై కాంగ్రెస్ కన్ను.క్యాడర్‌లో పెరిగిన ఉత్సాహం**

**సూర్యాపేట జెడ్పీ పోరులో ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పీడ్!**

కోదాడ రూరల్, మార్చ్ 2 (ప్రజా జ్యోతి ): రాష్ట్రంలో మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో విజయభేరి మోగించిన ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు తన తదుపరి లక్ష్యంగా సూర్యాపేట జిల్లా పరిషత్ పీఠంపై గురిపెట్టింది. జిల్లా రాజకీయాల్లో తిరుగులేని నేతగా పేరున్న రాష్ట్ర సాగునీటి పారుదల మరియు పౌరస రఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లాలోని అన్ని జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకునేలా వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. గత ఎన్నికల మున్సిపల్ జోష్‌తో జెడ్పీ ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని,ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికల్లో సూర్యాపేట జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో నాలుగింటిని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల కాంగ్రెస్ కైవసం చేసుకోవడం మంత్రి ఉత్తమ్ రాజకీయ చాణక్యానికి నిదర్శనంగా నిలిచింది. ఇదే ఊపును గ్రామీణ ప్రాంతాల్లోనూ కొనసాగించి,



జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని కాంగ్రెస్ పరం చేయాలని ఆయన పట్టుదలతో ఉన్నారు. ఇందుకోసం ఇప్పటికే నియోజకవర్గాల వారీగా ముఖ్య నేతలతో అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూ, అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుంది.

**సంక్షేమం – అభివృద్ధి: రెండంచుల వ్యూహం :**

ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలను ప్రధాన అస్త్రాలుగా మలచుకోవాలని మంత్రి క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారని. రుణమాఫీ & రైతు భరోసా రైతులకు అందించిన రూ. 2 లక్షల రుణమాఫీ సన్న వడ్లకు కింటాకు 500 బోనస్ ప్రయోజనాలను గ్రామస్థాయిలో వివరిస్తున్నారు.రేషన్ కార్డుల పంపిణీ అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేయడం ద్వారా ప్రజలకు చేరువవుతున్నారు.ఎన్నికల లోపే మంజూరైన ప్రతి సివిల్ పనిని రోడ్లు, డ్రైనేజీలు ప్రారంభించాలని అధికారులకు, సంక్షేమ ఫలాలను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరించాలని పార్టీ కార్యకర్తలకు మంత్రి దిశానిర్దేశం చేస్తున్నారు. గ్రూపు తగాదాలకు తావులేకుండా, ఏకతాటిపై పని చేయాలని ఆయన హెచ్చరించినట్లు తెలుస్తుంది. జిల్లాలోని సాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ. 1,000 కోట్లతో దేవాదుల– ఎస్సారెస్పీ జలాలను తుంగతుర్తి నియోజకవర్గానికి మరియు జిల్లాలోని ఇతర మెట్ట ప్రాంతాలకు తరలించే పనులను వేగవంతం చేస్తున్నారు. జవహర్ జానపాడు లిఫ్ట్ ఇరిగేషన్ సుమారు 10,000 ఎకరాలకు నీరందించే ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఇప్పటికే ఆదేశించారు.

**ప్రతిపక్షాలకు చెక్ పెట్టేలా పక్కా ప్లాన్:**

జిల్లాలో ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ బలాబలాలను అంచనా వేస్తూ, ఆ పార్టీకి పట్టున్న ప్రాంతాలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. తిరుమల గిరి వంటి ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు చేరికలను ప్రోత్సహిస్తున్నారు. "అభివృద్ధిలో రాజీ పడబోం. రాజకీయంలో వెనకడుగు వేయబోం" అనే నినాదంతో గ్రామగ్రామాన పాదయాత్రలు, కార్నర్ మీటింగ్స్ నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లా ప్రజలకు వరాల జల్లు కురిపిస్తు న్నారు.సూర్యాపేట జిల్లాకు ఆరు లేన్ల జాతీయ రహదారి విస్తరణ, కొత్త రైల్వే లైన్ మంజూరు వంటి భారీ ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వ ఘనతగా మంత్రి చెప్పుకొస్తున్నారు. స్థానిక అవసరాలను గుర్తించి రోడ్లు, డ్రైనేజీలు, లైబ్రరీ భవనాల నిర్మాణానికి ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసినట్లు ఆయన ప్రకటించారు.సూర్యాపేట జిల్లా రాజకీయాల్లో తన ఆధిపత్యాన్ని చాటుకుంటూ, జిల్లా పరిషత్‌ను కైవసం చేసుకోవడం ద్వారా తన ఇలాకాలో తిరుగులేదని నిరూపించుకోవడానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

**నియోజకవర్గాల వారీగా 'స్పెషల్ ఫోకస్':**

హుజూర్ నగర్ & కోదాడ తన సొంత ఇలాకా కావడంతో ఇక్కడ ప్రతి ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాన్ని గెలవాలని పట్టుదలతో ఉన్నారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయడం ద్వారా ఇక్కడి రైతాంగాన్ని తనవైపు తిప్పుకున్నారు.సూర్యాపేట మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఇలాకాలో బీఆర్ఎస్‌ను బలహీనపరిచేందుకు భారీగా చేరికలను ప్రోత్సహిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని ఇక్కడ పునరావృతం చేయాలని భావిస్తున్నారు.తుంగతుర్తి ఇక్కడి ఎస్సీ రిజర్వ్డ్ నియోజకవర్గంలో పార్టీని క్షేత్రస్థాయి వరకు బలోపేతం చేసేందుకు ఇటీవల రూ. 1,000 కోట్ల భారీ సాగునీటి నిధులను మంజూరు చేయించారు.గత పాలనలో సూర్యాపేట జిల్లా అభివృద్ధికి దూరమైంది. కానీ ఇప్పుడు సాగునీటి పారుదల శాఖ మన వద్దే ఉంది. ప్రతి



ఎకరాకు నీరు, ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత నాది. జెడ్పీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం అంటే, జిల్లా అభివృద్ధిని మరో పదేళ్లు ముందుకు తీసుకెళ్లడమే. విపక్షాల అసత్య ప్రచారాలను నమ్మకండి, అభివృద్ధిని చూసి ఓటు వేయండి." అని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే పిలుపునిచ్చారు.సూర్యాపేట జిల్లాకు ఆరు లేన్ల జాతీయ రహదారి విస్తరణ, కొత్త రైల్వే లైన్ మంజూరు వంటి భారీ ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వ ఘనతగా మంత్రి చెప్పుకొస్తున్నారు. స్థానిక అవసరాలను గుర్తించి రోడ్లు, డ్రైనేజీలు, లైబ్రరీ భవనాల నిర్మాణానికి ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసినట్లు ఆయన ప్రకటించారు.

# గరిడేపల్లి మత్స్య సంఘానికి కొత్త నాయకత్వం – చైర్మన్‌గా చామకూరి దశరథ్ ఏకగ్రీవ ఎన్నిక

జిల్లా మత్స్యశాఖ అధికారి బానోతు నాగులు నూతన చైర్మన్ కు నియామక పత్రం అందజేత

గరిడేపల్లి,మార్చి 03(ప్రజా జ్యోతి): మూడు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న



గరిడేపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి ఎట్టకేలకు పూర్తి స్థాయి నాయకత్వం లభించింది.డైరెక్టర్ల ఏకగ్రీవ నిర్ణయంతో చామకూరి దశరథ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.గతంలో రాజకీయ విభేదాల కారణంగా చైర్మన్ ఎన్నిక వాయిదా పడగా,సంఘం చైర్మన్,వైస్ చైర్మన్,ప్రధాన కార్యదర్శి లేకుండానే కొనసాగింది.

అయితే సోమవారం జరిగిన సమావేశంలో ఎనిమిది మంది డైరెక్టర్లు ఒకే తాటిపైకి వచ్చి కొత్త కమిటీని ఎన్నుకోవడం విశేషం.జిల్లా కేంద్రం సూర్యాపేటలోని మత్స్యశాఖ కార్యాలయంలో జిల్లా మత్స్యశాఖ అధికారి బానోతు నాగులు నూతన చైర్మన్ చామకూరి దశరథ్‌కు నియామక పత్రం అందజేశారు.సంఘ బైలాలను కూడా అధికారికంగా అప్పగించారు.వైస్ చైర్మన్‌గా ప్రధాని వెంకన్న,ప్రధాన కార్యదర్శిగా కీసర పుల్లయ్య ఎన్నికయ్యారు.కొత్త నాయ కత్వంతో గరిడేపల్లి మత్స్యకారుల అభివృద్ధి దిశగా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ ప్రధాని సైదులు,డైరెక్టర్లు జిట్టబోయిన సంతు, ప్రధాని అమరయ్య,మేడారపు సైదులు, ప్రధాని వీరస్వామి తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

# కోతి పుట్టింది ఎందుకో.. కొమ్మాలెక్కింది ఎందుకో..

**కోలల ఆటలో చిన్ననాటి మధుర జ్ఞాపకాలు మోదుగు పూల దండలు మెడలో వేసుకుని పాటలతో చిన్నారుల సందడి!**

తుంగతుర్తి, మార్చి 2,(ప్రజా జ్యోతి): హోలీ పండుగకు ముందు గ్రామంలో చిన్నారుల సందడి మరోసారి చిన్ననాటి జ్ఞాపకాలను తడిమింది. కోలలతో వలయంగా తిరుగుతూ చిన్నారులు ఆడిన ఆట అందరినీ



ఆకట్టుకుంది. "కోతి పుట్టింది ఎందుకో... కొమ్మాలెక్కింది ఎందుకో..." అంటూ పాటలు పాడుతూ చేసిన వినోదం అక్కడి వాతావరణాన్ని ఆనందంతో నింపింది. పాతకాలపు ఆటలను గుర్తు చేస్తూ, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోలలతో రిథమ్‌కు తగ్గట్టు కాళ్లు కదిపి, చేతులు కలిపి ఆడిన ఆటను చూసి పెద్దలు కూడా తమ చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సంప్రదాయ ఆటల ప్రాధాన్యతను గుర్తుచేస్తూ, పిల్లల్లో ఐక్యత, సమన్వయం, ఆనందభావం పెంపొందించాల్సిన వారికి అవసరాన్ని గ్రామ పెద్దలు సూచించారు.

# సకాలంలో రైతులకు రైతుభరోసా నిధులు ఇచ్చి ఆదుకోవాలి

మిర్యాలగూడ,మార్చి 02, ( ప్రజాజ్యోతి ): తెలంగాణ లోప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులు నేటికి అందకపోవడంతో రైతాంగం తీవ్ర ఆవేదనతో ఉన్నారని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు . సోమవారం మిర్యాలగూడ లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో అశోక్ మాట్లాడుతూ పంట పెట్టుబడికి ముందుగా అందించాల్సినటువంటి రైతు భరోసా నిధులు పంట కోత దశకువచ్చినా ప్రభుత్వం నేటికీ రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలో వేయకపోవడం బాధాకరం అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ రైతులతో చెలగాటం ఆడుతుందని విమర్శించారు.



పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించే సాయం అందకపోవడంతో రైతులు అప్పులు చేస్తున్న సందర్భం తెలంగాణ రాష్ట్రంలో కనిపిస్తోందన్నారు. రైతులను చిన్నచూపు చూస్తున్నటువంటి ఈ ప్రభుత్వంకి రైతులు త్వరలోనే మంచి గుణపాఠం చెప్తారన్నారు. రైతుభరోసా నిధులు తక్షణమే విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, రాజేందర్, అనంతయ్య, సతీష్, రవీందర్, సావిత్రి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# సంవత్సర క్రితం తప్పిపోయిన వ్యక్తి నేటికీ సమాచారం లేదు

కుటుంబ సభ్యుల్లో ఆందోళన – ఎస్సై తేజం రెడ్డి వివరణ

గుండాల, మార్చి 2 (ప్రజా జ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం రామారం గ్రామానికి చెందిన మెంట మదర్ సంవత్సరం క్రితం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై గుండాల పోలీస్ స్టేషన్ ఎస్సై ఎం. తేజం రెడ్డి వివరాలు వెల్లడించారు. రామారం గ్రామానికి చెందిన మెంటా సునీత భర్త మెంటా మదర్ గత సంవత్సరం ఎక్సెల్ మోపెడ్ వాహనంతో ఇంటి నుండి బయలుదేరి తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఘటనకు సంవత్సరం పూర్తవుతున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లతో పాటు వివిధ ప్రాంతాల్లో వెతికినా ఎలాంటి ఫలితం లేకపోయిందని తెలిపారు.ఇంటి వద్ద ఎక్సెల్ మోపెడ్ వాహనం కూడా లేకపోవడంతో మరింత అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడ వెతికినా జాడలభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.



# మాతృదేవోభవ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

కోదాడ టౌన్,మార్చి 02 (ప్రజా జ్యోతి): మాతృదేవోభవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్.ఎస్.వి





ఫంక్షన్ హాల్‌లో యశోద హాస్పిటల్ వారి సౌజన్యంతో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు మాతృదేవోభవ ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. శిబిరంలో సుమారు 300 మందికి పైగా రోగులకు గుండె మరియు ఎముకల వ్యాధులకు నిపుణులైన వైద్యులతో ఉచితంగా పరీక్షలు నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వాడపల్లి రంగమ్మ, గుండపునేని నాగేశ్వర రావు, పందిరి నాగిరెడ్డి, సొసైటీ కోదాడ అధ్యక్షురాలు పబ్బా గీతా దేవి, కార్యదర్శి ఓరుగంటి రమాదేవి, కోశాధికారి ఇమ్మడి సతీష్ బాబు, గౌరవ అధ్యక్షులు రాచర్ల కమలాకర్,ఉపాధ్యక్షులు బొగ్గారపు రేఖా రాణి, మంజుల, స్వాతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హిందీ ప్రతిభ పరీక్షకు విద్యార్థిని ఎంపిక



**కమ్మర్‌పల్లి మార్చి 2: ప్రజా జ్యోతి.** కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఫాతిమా పిర్దోస్ రాష్ట్రస్థాయి హిందీ ప్రతిభ పరీక్షకు ఎంపికై పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చింది. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి హిందీ పోటీలలో ఫాతిమా అద్భుతమైన ప్రతిభను కనబరిచి, ఉన్నత మార్కులతో ఈ ఘనత సాధించింది. త్వరలో హైదరాబాదులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో ఆమె పాల్గొననుంది. విద్యార్థిని సాధించిన ఈ విజయంలో పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు రత్నమాల కృషి ఎంతో ఉందని పాఠశాల వర్గాలు తెలిపాయి. రత్నమాల విద్యార్థినికి ప్రత్యేక శిక్షణనిస్తూ, హిందీ భాషపై పట్టు సాధించేలా ప్రోత్సహించడంతోనే ఈ ఫలితం దక్కిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయన్న,సర్పంచ్ హారిక, ఉపసర్పంచ్ అశోక్,వీడీసీ అధ్యక్షుడు రామస్వామి,మరియు ఉపాధ్యాయ బృందం ఫాతిమా పిర్దోస్‌ను, ఆమెకు మార్గదర్శనం చేసిన ఉపాధ్యాయురాలు రత్నమాల ని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ఫాతిమా ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు.

## సర్కార్ హామీ నెరవేరే..పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లు



**నిజామాబాద్ జిల్లా** జక్రాన్ పల్లి మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లలో భాగంగా బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే శ్రీ డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి సారథ్యంలో ఈరోజు జక్రాన్ పల్లి గ్రామంలో 36 ఇందిరమ్మ ఇల్లు పూర్తిస్థాయి కి దగ్గరలో ఉన్నాయి అలాగే ఈరోజు ఇందిరమ్మ ఇల్లు పూర్తవగా మండల ఎంపీడీవో సతీష్ గ్రామ సర్పంచ్ బండి పద్మ సత్యం సందర్శించి లాస్ట్ బిల్డింగ్ చేయించడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి నిజామాబాద్ యూత్ వైస్ ప్రెసిడెంట్ సోప్పరి వినోద్ గ్రామ పంచాయతీ సెక్రెటరీ గంగాధర్ ఇందిరమ్మ ఇండ్ల ఏ ఈ సతీష్ ఇందిరమ్మ కమిటీ మెంబర్ నట్ట తిరుపతి తిట్ల అనిల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో తల్లికి చంపడం
# వెనుక గ్రామాల్లో ఉన్న వైన్స్ కార్యాలయం

- గ్రామాలలో ఉన్న బెల్ట్ షాపులు ప్రధాన కారణం కావా
- గ్రామానికి ఊరి బయట ఉండాల్సిన వైన్స్ కార్యాలయం ప్రధాన రహదారి పక్కనే ఉండడం గతంలో అనేక ఆందోళనలు జరిగిన ఫిర్యాదులు ఇచ్చిన చర్యలు ఎందుకు తీసుకోలే దాని వెనుక అంతర్యం ఏమిటి
- కోటగిరిలో ఉన్న కొంతమంది స్వార్థ రాజకీయ నాయకుల మాయమాటల్లో ఆ పెద్ద సారు ఉన్నారా
- ఓ బడా సారు మద్దతుగా ఉండడమే
- చర్యలు తీసుకోవడంలో విఫలమా ఏది కారణం







**ప్రజాజ్యోతి బోధన్ ఆర్‌సి** మద్యానికి బానిస అయ్యిండు మద్యానికి డబ్బులు లేవు డబ్బుల కోసం పెన్షన్ డబ్బులు వచ్చే ఓ వృద్ధురాలు నవ మాసాలు కనీ పెంచిన మాతృమూర్తినే చంపడానికి వెనుకంజ వేయలేదు కసాయి కొడుకు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో మద్యానికి బానిసై డబ్బులు లేకపోవడంతో తల్లిని హతమార్చి అతి క్రూరంగా మూడుసార్లు కిరోసిన్ పోసి తగలబెట్టిన వైనం నెలకొనడం యావత్ రాష్ట్రానికి దేశానికే కలం వింపుగా తెచ్చింది. దీనికి ప్రధాన కారణం మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న వైన్స్ కార్యాలయం అదేవిధంగా ఊరికి దగ్గర ఉన్న వైన్స్ కార్యాలయం అదేవిధంగా గ్రామాల్లో విచ్చలవిడిగా పుట్టగొడుగుల వెలసిన బెల్ట్ షాపులే ప్రధాన కారణమా అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు ఏది నిజం అనేది ఈ ఉదాహరణ బట్టి తెలుస్తుందని ప్రజలు అంటున్నారు. వైన్స్ నిర్వాక్కులే ప్రత్యక్షంగా పరోక్షంగా బెల్టు షాపులకు నిర్వహణలో కారకులై ఈ విధంగా సంఘటనలు జరగడంలో కారకుల అవుతున్నారని అనుమానాలు, విమర్శలు మాత్రం సర్వత్వం వినిపిస్తున్నాయి. ఊరికి దగ్గరగా ప్రధాన రహదారి పక్కనే జనవాసల మధ్య వైన్స్ కార్యాలయం అనేక సంవత్సరాల నుంచి ఉందని దీని తొలగించాలని దీనివల్ల మహిళలు విద్యార్థులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామ ప్రజలు ఆందోళన చేసిన వైనం నెలకొన్నప్పటికీ ఎక్సైజ్ శాఖ మామూలు తీసుకుంటూ అటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని ఓ బడా సారు కింది స్థాయిలో ఉన్న కొందరి స్వార్థం కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చి వైన్స్ కార్యాలయం తీయనియకుండా అడ్డుపడుతున్నారని ఈ విషయంపై బడా సారుపై గుస్సాగా ప్రజలు కాలనీ ప్రజలు ఉన్నట్టు తెలుస్తుంది. ప్రజలకు ఆటంకం కలిగించే వైన్స్ కార్యాలయం విషయంలో ఓ బడా సారు ఇన్వాల్వ్మెంట్ కావడం సిగ్గుచేటని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటన జరగడానికి కారణం ఇక్కడున్న కొంతమంది స్వార్థ రాజకీయ నాయకులు అయితే బడా సారు కూడా ప్రధాన కారకులు కారా ఒకవేళ భవిష్యత్తులో అనుకొని పెద్ద సంఘటనలు జరిగితే చూయిస్తాం అనే కోణంలో ప్రజలు ఎదురుచూస్తున్నట్టు ప్రచారం భారీగా జరుగుతుంది.

## శాసనసభ సభాపతి పదవికి
# వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు

- శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్





**కామారెడ్డి ప్రతినిధి మార్చి 02. (ప్రజాజ్యోతి)** దివంగత శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా జిల్లా యువజన డ క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ, శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని అభివర్ణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గా పనిచేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమని పేర్కొన్నారు. దుద్దిళ్ల శ్రీపాద రావు02 మార్చి 1935న జయశంకర్ భూపాలపల్లి జిల్లా,ధన్వాడ గ్రామంలో జన్మించారు. స్వగ్రామంలో ప్రాథమిక విద్యను పూర్తిచేసి, మంథనిలో ఉన్నత విద్యను అభ్యసించారు. అనంతరం హైదరాబాద్ లో ఇంటర్మీడియట్, బి.ఎస్సి., ఆర్ట్స్ , లా విద్యలను అభ్యసించారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడైన ఆయన, ధన్వాడ గ్రామ సర్పంచ్‌గా పలు మార్లు సేవలందించారు. 1980లు మరియు 1990ల ప్రారంభంలో మంథని నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని పొందారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించి విశిష్ట సేవలందించారు. స్పీకర్ గా ఆయన నిష్పాక్షికత, క్రమశిక్షణ, ప్రజాస్వామ్య విలువల పట్ల అంకితభావంతో సభా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా గౌరవం పొందిన నాయకుడిగా గుర్తింపు పొందారు. సభ గౌరవాన్ని కాపాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు. గ్రామాభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమం, ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన కృషి విశేషమైనదని సరళత, సమగ్రత, నిబద్ధత ఆయన వ్యక్తిత్వ లక్షణాలుగా నిలిచాయన్నారు. 1999 ఏప్రిల్ 13 న కరీంనగర్ జిల్లా అన్నారం గ్రామ సమీపంలో దుర్మరణం చెందారని, ఆయన సేవలు, ప్రజాస్వామ్య పరిరక్షణలో చూపిన అంకితభావం, ప్రజా సేవ పట్ల నిబద్ధత భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, ఆర్డీఓ వీణ, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈఓ చందర్, జిల్లా అధికారులు, టీజీవో,టీఎన్జీఓల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కల్లు తాగిన అది సరిగా లేకపోవడంతో వాంతులు వస్తున్నాయి



**బోధన్ ఆర్‌సి ప్రజాజ్యోతి** నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో బస్టాండ్ పక్కనే కల్లు గుడిసెలలో కల్లు త్రాగి వాంతులు చేసుకున్నా అంటూ ఓ కల్లు ప్రియుడు తన గోడును మీడియాకు విన్నవించాడు, కల్లు సరిగాలేదని దుర్వాసన వస్తుందని కల్తీకల్లు ఉండడం వల్ల తాను వాంతులు చేసుకున్నానని తెలిపారు. ఈ సందర్భంగా కల్లు గుడిసె వద్ద వివరణ కోరగా కావాలని అలా చేస్తున్నారని ఇంతమందిలో ఈ ఒక్కరికి ఎలా అలా జరుగుతుందని సమాధానం ఇవ్వడం జరిగింది.

## బషీరాబాద్ అంగన్వాడీలో సీమాంతలు, అక్షర అబ్యాసం





**కమ్మర్ పల్లి మర్చి 2,ప్రజా జ్యోతి.** కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలోని 20,21 వ అంగన్వాడి కేంద్రల్లో ఈసీసీఈ డే కార్యక్రమంను నిర్వహించారు.. గర్భిణీ స్త్రీలకు సర్పంచ్ గంగా జమున మహేష్ చేతులమీదుగా సీమంతలు, 3సంవత్సరాల పిల్లలకు అక్షరబ్యాసం నిర్వహించరు, అలాగే పిల్లలతో హోలీ ఆడించడం జరిగింది. కార్యక్రమం లో అంగన్వాడీ టీచర్స్ మంజుల, అరుణమాల, మహేష్, ఉప సర్పంచ్ చిలివేరి భూమేశ్వర్, గర్భిణీ స్త్రీలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు..

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పారిశ్రామిక దారులు బంధువులా

- భారదేశంలో వ్యవసాయరాంగాన్ని ప్రాధమికరంగం అంటారు
- రైతులు రుణాలు చెల్లించకపోతే గ్రామీణ రైతుల ఇంటికి నోటీసులు అంటించి అప్రతిష్టపలుచేస్తున్నారు
- రైతే రాజు అన్న ప్రభుత్వం. ప్రజాస్వామ్యంలో రైతుకు విలువ ఉందా
- రైతుకు రైతు భరోసా ప్రభుత్వానికి భారమా
- సకాలంలో రుణాలు అంధకా రైతులు ఆత్మహత్యలకు గురవుతున్నారు
- రైతుల పట్ల వివక్ష ఎందుకు -పారిశ్రామిక దారులకు లక్షలకొట్ల రుణాలు
- వీరు సకాలంలో చెల్లించకపోయినా పట్టించుకోని వైనం
- వీరు ఇతర దేశాలకు పారిపోయిన పట్టించుకోరు
- అంటే ప్రజాస్వామ్యంలో పారిశ్రామిక దారులకు ఉన్న విలువ రైతులకు లేదు







**కామారెడ్డి (ఆర్ సి ) ఫిబ్రవరీ 2 (ప్రజాజ్యోతి )** ప్రస్తుతం ప్రజా స్వామ్యం లో రైతులకు ప్రజలకు ప్రభుత్వం రుణాలు ఇచ్చి ఆదుకోవాలి కానీ దీని వ్యతిరేకంగా గ్రామీణ రైతులను అప్రతిష్టపాలు చేస్తున్నారు. మరి దేశానికి రైతే రాజు అన్న నినాదాన్ని తుంగలో తొక్కరు. పరిశ్రమిక దారులకు లక్షలకొట్ల మంజురు చేస్తారు. వీరు రుణాలు కట్టకపోయినా, విలసాలు, ఇతర దేశాలకు పారిపోయిన ఈ ప్రభుత్వాలు పట్టించుకోరు ఈ సంఘటనలు కామారెడ్డి జిల్లాలో అనేకంగా జరుగుతున్నాయి. ఈ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడానికి ఇప్పుడు అప్పుడు అని చెప్పుతూ కాలయాపన చేస్తుంది. రైతులకు పెట్టుబడికి రుణాలు అందకా ఆత్మ హత్యలు చేసుకుంటునారు. ఇంత జరుగుతున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడాలేదు. వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతూ ప్రభుత్వ రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగి అలసి పోతున్నారు. ప్రజాస్వామ్యం లో పారిశ్రామిక దారులకు, ఉన్న విలువ రైతులకు లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతు భరోసా, రైతు భీమా మొదలైన సంక్షేమ పథకాలను అందిచ్చి రైతును రాజు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం దే అని గ్రామీణ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలాగే ప్రజాజ్యోతి పత్రిక తో తెలంగాణ రైతుల హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు గోత్రల శివశంకర్ తక్షణమే ప్రభుత్వం యుద్దా ప్రతిపాధిక నిధులు మంజూరు చేయాలనీ డిమాండ్ చేశాడు.

## మేము చదువుకున్న పాఠశాలకు
# మా వంతు ఉడుత సహాయం
### పూర్వ విద్యార్థులు



**ధర్పల్లి :మార్చ్/02 ( ప్రజా జ్యోతి)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం హన్నాజిపేట్ గ్రామానికి చెందిన రామ్ చందర్ నాయక్ ఆధ్వర్యంలో 2013- 2014 ఎస్ఎస్సి బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు 4 గ్రీన్ బోర్డులను పాఠశాలకు అందజేశారు వారికి కృతజ్ఞతలు తెలుపుతున్న రాంచందర్ నాయక్ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు.

# ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

## సర్పంచ్ రాచమల్ల ఎల్లేష్



**గజ్వేల్ మార్చి 02 (ప్రజా జ్యోతి) :** ప్రజల సహకారం,అధికారుల సమన్వయంతో అలి రాజపేట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ రాచమల్ల ఎల్లేష్ అన్నారు.జగదేవపూర్ మండల పరిధిలోని అలిరాజపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాచమల్ల ఎల్లయ్య అధ్యక్షతన గ్రామసభ సమావేశం నిర్వహించారు.గ్రామ అభివృద్ధిని విడతల వారీగా ప్రణాళికాబద్ధంగా చేపట్టి అన్ని రంగాల్లో పురోగతి సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని సర్పంచ్ పేర్కొన్నారు. సభలో గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను గ్రామస్తులు దృష్టికి తీసుకురాగా, వాటిని ప్రాధాన్య క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజల సహకారం, అధికారుల సమన్వయంతో అల్లిరాజపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు. గ్రామసభలో గ్రామ కార్యదర్శి బాలరాజు, మాజీ సర్పంచ్ లక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రమ్య రవి, మధుసూదన్ రెడ్డి, ఉపసర్పంచ్ గోవింద్ పాల్, వార్డు సభ్యులు మల్లేష్, శ్రీనివాస్, కృష్ణవేణి, శిరీష, నర్సింలు, వెంకటయ్య, జ్యోతి, అంగన్వాడీ టీచర్లు సరిత, రేణుక, ఆశా వర్కర్ కవిత, నాయకులు బాపురెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్నేహం సంతోషం సమైక్యతకు ప్రతిక హోలీ




**గజ్వేల్ మార్చి 02 (ప్రజా జ్యోతి):** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హైస్కూల్ లో ప్రీ ప్రైమరీ విద్యార్థులు రంగులతో హోలీ పండుగను ప్రేమ అనురాగాలతో జరుపుకోవడం జరిగింది. పాఠశాల ప్రిన్సిపల్ కాట రాయప్ప మాట్లాడుతూ హోలీ అనేది ప్రేమ స్నేహం ఆనందానికి ప్రతిక అన్నారు. ఈ పండుగ వలన మంచి చెడు పైన సత్యం ఎప్పుడు మాట్లాడాలని హోలీ రోజున సహజ రంగుల తో హోలీ పండుగను జరుపుకోవాలని అందరితో ప్రేమగా ఆనందంగా ఒకరికొకరి సహాయం చేసుకుంటూ ఉండాలని తెలిపారు.

# ఘనంగా స్వయం పరిపాలనా దినోత్సవం

## – మండల విద్యాధికారి గజ్జల కనకరాజు



**దౌల్తాబాద్, మార్చి 02 : ( ప్రజా జ్యోతి )** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అహ్మద్‌నగర్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వాతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉ పాధ్యాయుల బాధ్యతలు స్వీకరించి పాఠశాల నిర్వహణలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి గజ్జల కనకరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఉపాధ్యాయుల పాత్రను అనుభవపూర్వకంగా తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. ఈ స్వయం పరిపాలన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులుగా అఖిఫా,మండల విద్యాధికారిగా షాకీబ్ బాధ్యతలు నిర్వర్తించారు. ఉపాధ్యాయులుగా ఇర్ఫాన్ తన్వీర్, అస్ర, థమన్, పర్శరాములు విద్యార్థులకు పాఠాలు బోధించారు.

# అర్జీలను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలి

## – జిల్లా కలెక్టర్ హైమావతి





**సిద్దిపేట, మార్చి 02, (ప్రజాజ్యోతి) :** ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సంబంధిత అధికారులకు ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలు నమ్మకంతో సమర్పించే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా మొత్తం 165 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అంతకుముందు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని గురుకులాలు, హాస్టళ్లలో భోజనం, వసతి తదితర అంశాల పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయి అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులై




**కొండపాక మార్చి2( ప్రజా జ్యోతి ):** –జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బంధారంలో విద్యార్థులే ఉ పాధ్యాయులు అయి తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారుకొండపాక మండల పరిధిలోని బందారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం "విద్యార్థులే ఉ పాధ్యాయులు" అనే భావనతో కొంతసేపు విద్యార్థులే బోధకులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పదో తరగతి, తొమ్మిదో తరగతి విద్యార్థులు గణితం, విజ్ఞానం, సామాజిక శాస్త్రం వంటి విషయాల్లో బోధన నిర్వహించారు. బోర్డుపై సూత్రాలు, సమీకరణాలు రాస్తూ ఉ దాహరణలతో వివరిస్తూ పాఠాన్ని సులభంగా అర్థమయ్యేలా చెప్పారు. తోటి విద్యార్థులు కూడా ఆసక్తిగా వినిపిస్తూ సందేహాలు అడిగి నివృత్తి చేసుకున్నారు. డీఈవోగా ఎం శివ. ఎంఈఓగా సిహెచ్ ప్రశాంత్, ప్రధానోపాధ్యాయులుగా ఎన్ అజయ్‌లు వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే కాకుండా, బోధనపై అవగాహన పెరగడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు నిమ్మ వెంకట్ రెడ్డి. బి శ్రీనివాస్ రెడ్డి .మల్లారెడ్డి .భాగ్యలక్ష్మి. నర్సిరెడ్డి. రమేష్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు వేదికపై మాట్లాడే ధైర్యం కూడా పెరిగిందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

# క్రీడాలకు తిగుల్ గ్రామం పుట్టినిల్లు

## గ్రామ సర్పంచ్ రజిత పరశురామ్




**గజ్వేల్ మార్చి 02 (ప్రజా జ్యోతి):** యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉంటూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, తిగుల్ పేరును జాతీయస్థాయిలో మారు మోగేలా యువత క్రీడల్లో రాణించాలని గజ్వేల్ న్యూరో వైద్యుడు శ్రీకాంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రజిత పరుశురాం అన్నారు. తిగుల్ స్పోర్ట్స్ క్లబ్, గజ్వేల్ న్యూరో సంయుక్త ఆధ్వర్యంలో జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించారు. ముందుగా సర్పంచ్ రజిత పరుశురాం, గజ్వేల్ న్యూరో డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ఎం. డి భానుచందర్ క్రీడాజ్యోతి వెలిగించారు. క్రీడా పోటీలకు జిల్లాలోని వివిధ గ్రామాల నుండి మొత్తం 46 టీమ్ లు హాజరయ్యాయి. వాలీబాల్ క్రీడా పోటీల్లో ప్రథమ స్థానంలో గజ్వేల్ న్యూరో తీగుల్ వాలీబాల్ జట్టు నిలువగా,ద్వితీయ స్థానంలో అహ్మదిపూర్ వాలీబాల్ జట్టు నిలిచింది. క్రీడా పోటీలో గెలిచిన వారి గెలిచిన జట్లకు ప్రథమ బహుమతిగా రూ.15000 నగదు,ద్వితీయ బహుమతిగా రూ. 10,000 నగదు తోపాటు షీల్డ్ అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాలకు తిగుల్ గ్రామం పుట్టినిల్లు అని, ఎంతో మందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఘనత గ్రామానికి ఉ ందన్నారు. నేటి యువత స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు చేసి మళ్లీ క్రిడలో గ్రామానికి పూర్వ వైభవం తీసుకరావడం గొప్ప విషయమన్నారు. యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉంటూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఆటలు ఆడడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. అలాగే క్రీడాల వల్ల యువత మధ్య స్వేహ భావం ఏర్పడుతుందన్నారు. క్రీడాలకు ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పి ఏ సి ఎస్ మాజీ డైరెక్టర్ భూమయ్య, పి ఈ టి రాజిరెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, ఎల్లయ్య, భానుప్రకాష్ రావు, బిక్షపతి, రామచంద్రారెడ్డి, వివిధ పార్టీల నాయకులు కృష్ణ మూర్తి, దయానంద్ రెడ్డి, అశోక్, ఎల్లారెడ్డి, మల్లేశం, మహేష్, కర్ణాకర్ రెడ్డి, ప్రవీణ్, ఐలయ్య, ఉపాధ్యాయులు శంకర్, నరేష్, జర్నలిస్ట్ లు రాంప్రసాద్ రావు, చిన్ని కృష్ణ, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు వంశీధర్ రెడ్డి, కార్యదర్శి కర్ణాకర్, తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెలోకి విద్యుత్ మీటర్ రీడర్ కార్మికులు..!



**సంగారెడ్డి మార్చి 02 (ప్రజా జ్యోతి):** రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1600 వందల మంది కార్మికులు విద్యుత్ మీటర్ల రీడింగ్ విభాగంలో కార్మికులకు పని చేస్తున్నారని, కార్మికులు ప్రతి ఇంటికి ప్రతి నెల రెండవ తేదీ నుండి వెళ్లి విద్యుత్ మీటర్ బిల్లులు వినియోగదారుడికి అందిస్తారని, ఇందుకు సంబంధించి ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా విధులు నిర్వహిస్తుంటారని ఆ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వడ్ల బ్రహ్మం అన్నారు. సోమవారం సమ్మెలో భాగంగా హైదరాబాద్ లోని మింట్ కాంపౌండ్ కార్యాలయం వద్ద ధర్నాకు బయలుదేరిన సదాశివపేట్ సబ్ డివిజన్ విద్యుత్ మీటర్ రీడర్ కార్మికులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో ప్రతినెల 7వ తేదీ నుండి 16వ తేదీ వరకు విద్యుత్ మీటర్ బిల్లింగ్ చేసేందుకు అవకాశం ఉండేదని కానీ కొత్త నిబంధన ప్రకారం ప్రతి నెల ఒకటో తేదీ నుండి ఆరవ తేదీ వరకు మీటర్ రీడింగ్ పూర్తి చేయాలని కొత్తగా నిబంధనలు ప్రవేశపెట్టిన విద్యుత్ శాఖ అన్నారు. దీంతో పని ఒత్తిడి పెరుగుతోందని సదరు కార్మికుల ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు యాజమాన్య ద్వారా 30 రోజుల పనిదినాలు కల్పించాలని, విద్యుత్ సబ్ స్టేషన్ లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కార్మికులు డిమాండ్ చేస్తూ సంబంధిత అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దోబమకొండ సునీల్ కుమార్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వడ్ల బ్రహ్మం, ప్రధాన కార్యదర్శి గడ్డం చిరంజీవి, సంయుక్త ప్రకటనలో తెలిపారు.

# తాసీల్దార్ అశోక్ జన్మదిన వేడుకలు

## – తాసీల్దార్ సేవలకు ప్రశంసలు శాలువాలతో సత్కారం



**కొండాపూర్ ప్రజా జ్యోతి** కొండాపూర్ మండలం తహసిల్దార్ అశోక్ జన్మదిన వేడుకలను కార్యాలయంలో మండల ప్రజా జ్యోతి రిపోర్టర్ శేఖర్ నిర్వహించారు.పుట్టినరోజు సర్‌దర్భంగా బహుమతి అందజేసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా జర్నలిస్ట్ శేఖర్ మాట్లాడుతూతహసిల్దార్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి భూ సమస్యలను సత్వర పరిష్కారం చేస్తూ, పెండింగ్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నారని కొనియాడారు. రైతులతో, ప్రజలతో స్నేహపూర్వకంగా మమేకమై రెవెన్యూ సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గొల్లపల్లిలో మహిళా సమాఖ్య భవనాల శంకుస్థాపన



**కొండాపూర్ ప్రజాజ్యోతి** గొల్లపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య భవనాల శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించరూ. గ్రామ అభివృద్ధికి మరో ముందడుగుగా ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు, యువకుల సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఉ ప సర్పంచ్ ప్రియాంక నర్సింలు, వార్డు సభ్యులు బంటు సత్యనారాయణ, గొల్ల శ్రీకాంత్, గోసుల శ్రీకాంత్, మన్నే ఎల్లయ్య, వన్నె రామయ్య, కొత్తగడి నవనీత వీరారెడ్డి, కుమ్మెర శ్రీకాంత్ గౌడ్, అన్వర్ పాషా తదితరులు హాజరయ్యారు.ముఖ్య అతిథులుగా ఆత్మ కమిటీ చైర్మన్ వై ప్రభు మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి పాల్గొని శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు, సంఘాల బలోపేతానికి ఈ భవనాలు దోహదపడతాయని తెలిపారు.గ్రామ పెద్దలు పాతూరు వెంకట్ రెడ్డి, లోక రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామా గౌడ్, వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళా సంఘం సభ్యులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. మహిళా సమాఖ్య భవనాల నిర్మాణంతో గ్రామంలో మహిళల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం లభించనుంది.

# ఆయిల్ పామ్ సాగుతో 'అధిక లాభాలు'

## – ఉంద్యానవన శాఖ అధికారులు





**నర్సాపూర్ (ప్రజజ్యోతి)** సాంప్రదాయ పంటలకు భిన్నంగా ఆయిల్ పామ్ సాగు చేపడితే రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు. సోమవారం నర్సాపూర్ మండలానికి చెందిన రైతులకు సిద్దిపేట జిల్లా నంగనూరు మండలం నర్మేట్ట గ్రామంలో క్షేత్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని రైతు భాగ్యలక్ష్మికి చెందిన ఐదేళ్ల వయసున్న ఆయిల్ పామ్ తోటను రైతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటిన నాలుగో ఏడాది నుంచే పంట కోతకు వస్తుందని, ప్రస్తుతం ప్రతి నెలా 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తోందని వివరించారు. ఖర్చులు పోను నెలకు 20 నుండి 25 వేల వరకు ఆదాయం లభిస్తోందని తోటి రైతులకు వివరించారు.

**నూనె తయారీపై అవగాహన**

అనంతరం అదే గ్రామంలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సందర్శించిన రైతులు, గెలల నుంచి నూనెను వేరు చేసే ప్రాసెసింగ్ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉ ద్యానవన శాఖ అధికారి సంతోష్, ఏఈఓ మోహన్, టెక్నికల్ పర్సన్ అజయ్, రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిరియాల చంద్రశేఖర్, నర్సాపూర్ మండల రైతులు పాల్గొన్నారు.

## గాయపడ్డ జింక

# చికిత్స పొందుతూ మృతి

– జీడిపల్లి గ్రామ శివారులో కుక్కల దాడిలో గాయపడ్డ జింక

– మానవత్వంతో గ్రామ ప్రజలు ప్రథమ చికిత్స చేసి ఫారెస్ట్ అధికారులకు అప్పగింత



**మనోహరాబాద్, మార్చ్ 02 ( ప్రజా జ్యోతి)** కుక్కల దాడిలో గాయపడ్డ జింకను గుర్తించిన జీడిపల్లి,గ్రామస్థులు ప్రథమ చికిత్స అందించి మానవత్వం చాటుకున్నారు. మనోహరాబాద్ మండలం జీడిపల్లి పొలాల్లో కుక్కల దాడిలో గాయపడ్డ జింకను ను చూసిన కొందరు గ్రామస్తులు నీరు తాపి ప్రథమ చికిత్స చేసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం తూప్రాన్ పశు వైద్యశాలకు తీసుకెళ్లిన అనంతరం చికిత్స పొందుతూ జింక మృతి చెందినట్లు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. జింకకు అంత్యక్రియలు జరిపి సమాధి చేసినట్లు సూచించారు.

# కాళేశ్వరం సాక్షిగా కాసుల వేట!

– మహమ్మదాబాద్, చిప్పల్దుర్తి వద్ద ఇసుక దందా

– ప్యాకేజీ 18, 19 ప్రాంతాల్లో మాఫియా రాజ్యం



**నర్సాపూర్ (ప్రజాజ్యోతి)** కాళేశ్వరం ప్రాజెక్టు పనుల ముసుగులో అక్రమార్కులు ఇసుక మాఫియాకు తెరలేపారు. నర్సాపూర్ మండలంలోని మహమ్మదాబాద్, చెప్పల్దుర్తి గ్రామ సరిహద్దుల్లోని కాళేశ్వరం ప్యాకేజీ 18, 19 పరిసర ప్రాంతాల్లో ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. అధికారులు అటువైపు రారనే ధీమా అక్రమార్కులకు వరంగా మారింది.


**కృత్రిమంగా ఫిల్టర్లు.. జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు**

నిబంధనలకు విరుద్ధంగా రోజుకు రెండు నుంచి మూడు ట్రిప్పుల వరకు ఇసుకను కృత్రిమంగా ఫిల్టర్ చేస్తూ యథేచ్ఛగా తరలిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు అందాల్సిన ఆదాయానికి గండి కొడుతూ, అక్రమార్కులు తమ జేబులు నింపుకుంటున్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ ఈ దందా మరింత మితిమీరిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఈ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

## మనోహరాబాద్ ఎంపీడీవోగా

# బాధ్యతలు చేపట్టిన ప్రీతి రెడ్డి

– కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సంతోష్



**మనోహరాబాద్, మార్చ్ 02 ( ప్రజాజ్యోతి)** మనోహరాబాద్ మండల ఎంపీడీవో గా బాధ్యతలు సోమవారం, మండల పరిషత్ కార్యాలయంలో ప్రీతి రెడ్డి బాధ్యతలు చేపట్టారు. జిల్లా కార్యదర్శుల ఫోరం అధ్యక్షులు సంతోష్, సంఘం కార్యదర్శులతో కలిపి నూతన ఎంపీడీవో ప్రీతి రెడ్డికి స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. మెదక్ జిల్లా నార్సింగ్ నుంచి బదిలీపై వచ్చిన మనోహరాబాద్ ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టారని జిల్లా కార్యదర్శిల ఫోరం అధ్యక్షులు సంతోష్,లిపారు.

# ఉద్యమకారులను అన్ని విధాలుగా ఆదుకోవాలి

**- ఎమ్మెల్యేకు వినతి పత్రం అందేసిన ఉద్యమకారుల ప్రతినిధులు**



**తాండూరు మార్చ్ 2 ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులను ప్రభుత్వం ద్వారా అన్ని విధాలుగా ఆదుకోవాలని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనో రెడ్డికి ఉద్యమకారుల సంఘం తరఫున వినతి పత్రం అందజేశారు. సోమవారం రోజు తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాండూరు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం సమర్పించామని ఉద్యమకారుల ప్రతినిధులు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక భూమిక పోషించి జైలు జీవితం కూడా గడిపిన ఉద్యమకారులకు తగిన న్యాయం చేయడంతో పాటు ప్రభుత్వపరంగా వచ్చే సంక్షేమ పథకాలు అందించాలని గత వారం క్రితం హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు పెన్షన్ ఉద్యమకారులుగా గుర్తించేల గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశామని చెప్పారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం తాండూరు ఉద్యమకారులకు ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలను అందజేయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే విధానాలను పరిశీలిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బంటారం భద్రేశ్వర్, ఫెరోజ్ ఖాన్, జిలాని,తదితరులు ఉన్నారు.

# రాహుల్ గాంధీకి స్వాగతం పలికిన ప్రభుత్వ చీఫ్ విప్

**- పట్నం మహేందర్ రెడ్డి**





**వికారాబాద్ ప్రతినిధి, మార్చి2(ప్రజా జ్యోతి):** వికారాబాద్ లోని హరిత రిసార్ట్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల 10 రోజుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి రాహుల్ గాంధీతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మాజీ మంత్రి గీతారెడ్డిలతో కలిసి మహేందర్ రెడ్డి రాహుల్ గాంధీకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం. నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సృజన అభియాన్ ముగింపు వేడుకలకు రాహుల్ గాంధీ హాజరు

**- ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి**



**పరిగి, మార్చి 02 (ప్రజా జ్యోతి):** వికారాబాద్ అనంతగిరిలోని హరిత రిసార్ట్ లో నిర్వహించిన 'సృజన అభియాన్' కార్యక్రమం ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ డీసీసీ అధ్యక్షుల కోసం 10 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వికారాబాద్ ఎస్ఏపీ కాలేజీ హెలిప్యాడ్ వద్ద సృజన అభియాన్ కార్యక్రమా చైర్మన్, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి రాహుల్ గాంధీకి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు. శిక్షణ శిబిరం ద్వారా పార్టీ బలోపేతం, సంఘటిత కృషి, ప్రజా సమస్యలపై చైతన్యం వంటి అంశాలపై చర్చలు జరిపినట్లు నాయకులు తెలిపారు.

# ప్రాథమిక పాఠశాలల హెడ్మాస్టర్‌లను సూపర్వైజర్లుగా నియమించాలి



**పరిగి, మార్చి 02 (ప్రజాజ్యోతి) :** రాష్ట్ర ప్రభుత్వం మే నెల 11 తేదీ నుండి జూన్ నెల పదవ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జనగణన హౌస్ లిస్టింగ్ సర్వేలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులను సూపర్వైజర్లుగా విధులు కేటాయించాలని పరిగి తహసిల్దార్ ఎమ్ వెంకటేశ్వరి కి ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల రాష్ట్ర అసోసియేషన్ సంఘం జిల్లా అధ్యక్షులు సి రామాంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి ఉస్మాన్ అలీ ఆధ్వర్యంలో మెమో రాందం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా పి ఆర్ టి యు మండల అధ్యక్షులు డి బుగ్గయ్య, ప్రధాన కార్యదర్శి వి రాకేష్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యారంగంలో 25 సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్నారని . సీనియర్లుగా పని చేస్తున్న వీరికి సూపర్వైజర్లుగా తప్పక విధులు కేటాయించాలని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సి మొగులయ్య, బసవరాజ్, అంజలయ్య,, వై వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం రాజకీయా లొద్దు

- అవకాశం ఇస్తే కరోనా అడ్డొచ్చిందా
- రాజకీయాలకు అతీతంగా తాండూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తాం
- 35 రోజుల్లోనే నన్ను తాండూరుకు ఎమ్మెల్యే ని చేశారు
- ఐదేళ్లలో బిఆర్ఎస్‌ను అడ్రస్ లేకుండా చేస్తా
- నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్ని నిధులైన తీసుకొస్తా
- ఎమ్మెల్యే సమక్షంలో బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్ పర్సన్
- 36 వార్డులను కూడా ఒకే విధంగా అభివృద్ధి చేస్తాం
- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి
- మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్ రెడ్డి






**తాండూరు మార్చ్ 2ప్రజా జ్యోతి :** తాండూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజకీయాల్లోద్దని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చెప్పారు. సోమవారం రోజు తాండూరు పురపాలక సంఘం చైర్ పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్ రెడ్డి పురపాలక సంఘంలోని ఆమె చాంబర్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన తదుపరి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సమక్షంలో పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధి కోసం ఇక రాజకీయాలు పక్కన పెట్టి పార్టీలకు అతీతంగా తాండూర్ పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. తాండూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన పదవి బాధ్యతల స్వీకరణలో చైర్ పర్సన్ నీరజారెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కౌన్సిలర్ లకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ నమ్మి అత్యంత విశ్వాసంతో తాండూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ స్థానాలు ఇచ్చారని గుర్తు చేశారు. గత రెండేళ్లుగా తాండూరు ఎమ్మెల్యేగా చేసిన పనితీరును చూసిన ప్రజలే మాకు మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేసిన కుట్రలు తిప్పి కొట్టడం కోసం కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు కృషి చేస్తారనే పూర్తి విశ్వాసం ఉందన్నారు.ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఎవ్వరికి వారు చేయాలని గుర్తు చేశారు. అభివృద్ధి కోసం అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

**తాండూర్ అభివృద్ధిపై కీలక ప్రకటన :** ఎన్నికల సమయంలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. తాండూరు పట్టణ ప్రజల కోసం త్రాగునీటి సమస్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో కాగ్న వాటర్ సరఫరా కోసం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థపై పరిగిలో జరిగిన బహిరంగ సభలోనే మాటిచ్చారని చెప్పారు.

తాండూరు మాజీ ఎమ్మెల్యే వెనుకబడిన బషీరాబాద్ మండలాన్ని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

తాండూరు అభివృద్ధి కోసం కరోనా అడ్డొచ్చింది. సొంత లాభర్జన కోసం అవేవీ లేవంటూ తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే ను విమర్శించారు.మాజీ ఎమ్మెల్యే కరోనా వైరస్ ఉండటం కారణంగా అభివృద్ధి జరగలేదని మరి మరి చెప్పడం ఆశ్చర్యం వేస్తుందని విమర్శించారు. రెండేళ్ల కాలంలో అభివృద్ధి చేయలేకపోయాము అనే దానికి స్పందించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మీ సొంత అభివృద్ధి ఎలా జరిగిందో ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే కు సవాల్ విసిరారు. ప్రజలు ఇచ్చిన ఈ ఐదేళ్ల అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో మాజీ ఎమ్మెల్యే టీజర్, సినిమాతో పాటు ఆయన సినిమా టాకీస్ కూడ బంద్ అయ్యిందని విమర్శించారు. అనంతరం మున్సిపల్ కార్మికులతో కలిసి సహా పంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసుదన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథ్ గౌడ్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు అబ్దుల్ రాహుఫ్, పట్లోళ్ళ నర్సింలు (బొట్టు), నయీం అప్పు,సత్యమూర్తి, మహిళ నాయకురాలు మమత,గాజుల మాధవి, ప్రభావతి తో పాటు తాజామాజీ కౌన్సిలర్ లు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అపరిష్కృత సమస్యల పరిష్కారంపై అధికారులకు అదనపు కలెక్టర్ సుధీర్ ఆదేశం





**వికారాబాద్ ప్రతినిధి, మార్చి2 (ప్రజాజ్యోతి) :** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను అధికారులు ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్ సుధీర్‌తో పాటు డిఆర్ఓ మంగీలాల్, డిఆర్డిఓ శ్రీనివాస్‌లు మొత్తం 85 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, భూమి సర్వే, రేషన్ కార్డులు, పెన్షన్లకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయి. గ్రామాల్లో డంపింగ్ యార్డ్, మంచినీటి సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై వచ్చిన అర్జీలను పరిశీలించి పాసుపుస్తకాలలో భూమి వివరాల్లో మార్పులు ఉంటే సరిచేయాలని డిఆర్ఓ మంగీలాల్ సూచించారు. రేషన్ కార్డుల సమస్యలను కూడా త్వరగా పరిష్కరించాలని అన్నారు. పెన్షన్లకు సంబంధించిన అర్జీలను అర్హత మేరకు మంజూరు చేస్తామని డిఆర్డిఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ఫర్హీన్ ఖాతూన్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య స్కూల్ ఖల్సా క్యాంపస్‌లో అట్టహాసంగా సైన్స్ ఎక్స్‌పో

**- ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించిన ఏజీఎం ఎం. వెంకట్ రెడ్డి**

**- విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపు**





**అబ్దుల్లాపూర్ మెట్టు మార్చి 02 (ప్రజాజ్యోతి) :** హయత్ నగర్ ఖల్సా క్యాంపస్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన 'సైన్స్ ఎక్స్‌పో - 2026' విద్యార్థుల మేధస్సుకు ప్రతిరూపంగా నిలిచింది. ఈ ప్రదర్శనను శ్రీ చైతన్య స్కూల్ ఏజిఎమ్( దిల్సుఖ్నగర్ జోన్) శ్రీ ఎం.వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కత్తిరించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల కోఆర్డినేటర్ రవికుమార్, ప్రైమరీ కోఆర్డినేటర్ రుబీనా, ప్రిన్సిపాల్ శశికళ,వైస్ ప్రిన్సిపాల్ సంతోష్,డీన్ ఉమాకాంత్ జ్యోతి ప్రజ్వలన చేసి శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ ఎనర్జీ, రోబోటిక్స్, అంతరిక్ష పరిశోధనలపై వినూత్నమైన వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శించారు.ముఖ్యంగా చిన్న తరగతుల విద్యార్థులు కూడా ఎంతో ఆత్మవిశ్వాసంతో తమ ప్రాజెక్టుల గురించి వివరించడం విశేషం. కార్యక్రమ నిర్వహణలో ఏవో శేఖర్,ఇంచార్జ్ లు రాజశేఖర్, అరుణ బోధనా సిబ్బంది ( టీచింగ్ స్టాఫ్) అందరూ సమన్వయంతో వ్యవహరించి ప్రదర్శనను విజయవంతం చేశారు.ముఖ్య అతిథి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఒక శాస్త్రవేత్త దాగి ఉంటాడని, ఇలాంటి వేదికలు వారిలోని సృజనాత్మకతను వెలికితీస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ప్రయోగాల గురించి ఎంతో స్పష్టంగా వివరించడాన్ని యాజమాన్యం మరియు తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాపాలనకు నిదర్శనం కాంగ్రెస్ పాలన - వి జగదీశ్వర్ గౌడ్





**శేరిలింగంపల్లి, మార్చ్ 02 (ప్రజాజ్యోతి) :** ప్రజల కష్టాల్లో ప్రభుత్వం తోడుంటుంది అనే భావనకు ప్రతీకగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని అని అన్నారు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ వి జగదీశ్వర్ గౌడ్.శేరిలింగంపల్లి నియోజకవర్గం అనేక డివిజన్ ప్రజలు అనారోగ్యం కారణంగా చికిత్స పొందిన అనంతరం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ కార్యాలయాన్ని సంప్రదించగా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించి,ఈరోజు వారికి మంజూరైన రూ 19,58,000/- చెక్కులను నియోజకవర్గ నాయకులతో కలిసి బాధితురాలికి అందచేశారు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు,ప్రభుత్వం బాధితుల పట్ల చూపించే మానవత్వం,బాధ్యతకు నిదర్శనం అని ప్రకృతి విపత్తులు,అగ్ని ప్రమాదాలు,రోడ్డు ప్రమాదాలు లేదా తీవ్రమైన అనారోగ్య పరిస్థితులు ఏదైనా క్లిష్ట సమయంలో పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా పెద్ద దెబ్బ తగులుతుందని అన్నారు.అటువంటి వేళల్లో ప్రభుత్వం మానవత్వంతో ముందుకు వచ్చి సహాయ హస్తం అందించడం ఈ సహాయనిధి ప్రధాన లక్ష్యం అని,ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎన్నో కుటుంబాలు మళ్లీ నిలబడగలిగాయని,అత్యవసర వైద్య చికిత్సలు పొందలేక ఇబ్బందులు పడుతున్న వారికి ఇది జీవనాధారంగా మారిందని,ఇది కేవలం ఆర్థిక సహాయం కాదు ఇది నమ్మకం,ఇది భరోసా,ఇది ప్రభుత్వం ప్రజల పట్ల చూపించే కట్టుబాటు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేందర్ గౌడ్,మహిపాల్ యాదవ్,కావూరి ప్రసాద్, సురేష్ గౌడ్, మన్నేపల్లి సాంబశివరావు, మల్లికార్జున్ యాదవ్,దొంతి సత్యం, జనార్దన్ గౌడ్, ,విజయభాస్కర్ రెడ్డి, తిరుపతి, రవీందర్ రెడ్డి, జహంగీర్, తిరుపతి,గిరి బాబు,సౌందర్య రాజన్,శ్రీహరి,సుధాకర్,లక్ష్మణ్,రాంచందర్, రవి కుమార్, శివ కుమార్, కార్తీక్ గౌడ్, మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు భాగ్యలక్ష్మి,అనిత,జయ,సారా ఖాన్,పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# బోయిన్ పల్లి మార్కెట్ అభివృద్ధికి చర్యలు

**- ఎమ్మెల్యే శ్రీగణేష్ సమీక్ష**

**- మౌలిక వసతుల మెరుగుదలపై దృష్టి**





**బోయిన్ పల్లి, మార్చి 02 (ప్రజా జ్యోతి) :** కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సోమవారం బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ కార్యాలయంలో పాలకవర్గం మరియు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్కెట్ అభివృద్ధి, రైతులు మరియు హమాలీలకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆదాయ వనరుల పెంపు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. మార్కెట్‌లో పరిశుభ్రత, మౌలిక వసతుల అభివృద్ధి, భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టాల్సిన చర్యలపై అధికారులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్యంగా వే బ్రిడ్జి నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న షాపుల పూర్తి నిర్మాణం, టాయిలెట్లు, తాగునీటి సదుపాయం వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బోయిన్ పల్లి మార్కెట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంతో పాటు, మార్కెట్ ఆదాయాన్ని పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు, సెక్రటరీ వెంకటేష్, డైరెక్టర్లు శరత్, ప్రభాకర్, సంతోష్, అస్లాం, రామ్, జూలియస్ తదితరులు పాల్గొన్నారు.

# వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే..

- విహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య
- వికలాంగులను అవమానించిన మారం జగదీశ్వర్
- వికలాంగుల అవమానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం
- తొంటోడు అనడం వికలాంగుల సమాజానికి అవమానం



**యాచారం, మార్చి 02 (ప్రజాజ్యోతి):** వికలాంగులను వైకల్యం పేరుతో అవమానించిన టీఎన్జీవో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందేనని కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. విహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య మాట్లాడుతూ.. టీఎన్జీవో సమావేశంలో టీఎన్జీవో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ బహిరంగంగా వేదిక నుండి మాట్లాడుతూ వికలాంగులను వైకల్యం పేరుతో తోంటోడు అని మాట్లాడడం యావత్ వికలాంగుల సమాజానికి అవమానం అని విషయాన్ని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ఎన్నో చట్టాలను తీసుకొచ్చిన ఏదో ఒకచోట అవమానాలకు గురవుతున్నారని గుర్తు చేశారు. వికలాంగులపై రోజు రోజుకు దాడులు, అవమానాలు, అత్యాచారాలు ఎక్కువ అవుతున్నాయని గుర్తు చేశారు. ఓ ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుని హోదాలో ఉన్న మారం జగదీశ్వర్ వంటి వ్యక్తులే వికలాంగులను అవమానిస్తుంటే ఈ సమాజం ఎటువైపు ప్రయాణిస్తుందో తెలియని పరిస్థితిలో ఉందన్నారు. తక్షణమే టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆక్ట్ కమిషన్ సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్. జగదీశ్వర్ ను వెంటనే ప్రభుత్వ ఉద్యోగం నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసనలు ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

# చంద్రగ్రహణం మంగళవారం రోజు చిలుకూరు బాలాజీ దేవాలయం మూసివేత



**మొయినాబాద్, మార్చ్ 02 (ప్రజా జ్యోతి):** చంద్రగ్రహణం రోజు చిలుకూరు బాలాజీ దేవాలయం తాత్కాలికంగా మూసివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మంగళవారం 3వ తేదీ ఉదయం 7:30 గంటలకు నిత్యసేవలు ముగిసిన అనంతరం దేవాలయ ద్వారాలు మూసివేయబడతాయి. గ్రహణ సమయమంతా ఆలయంలో ఎలాంటి దర్శనాలు నిర్వహించబడవు. సాయంత్రం 7 గంటలకు సంప్రదాయ పద్ధతిలో శుద్ధి కార్యక్రమాలు జరుగుతాయి. అయితే ఆ సమయంలో కూడా భక్తులకు దర్శనం అనుమతించబడదని స్పష్టం చేశారు. తదుపరి రోజు బుధవారం ఉదయం 6 గంటలకు సాధారణ దర్శనం పునఃప్రారంభమవుతుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ దర్శన కార్యక్రమాలను అనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని ఆలయ నిర్వహణ విజ్ఞప్తి చేసింది.

# పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, మార్చి 2 (ప్రజాజ్యోతి )
ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వెను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి



కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు వారి స్థాయిలో ప్రతి దరఖాస్తును పరిష్కరించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి దరఖాస్తు పై విచారించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం, పెండింగ్ వంటి అంశాలను సమీక్షిస్తానని తెలిపారు. దరఖాస్తులను తమ వద్ద పెండింగ్లో ఉంచవద్దని అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం 345 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, ఆర్డీఓ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ బ్యూరో, మార్చి 2( ప్రజాజ్యోతి )
బేటి బచావో బేటి పడావో పథకంలో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాల పోస్టర్లను జిల్లా



కలెక్టర్ చిత్రా మిశ్రా చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. కలెక్టర్ ఛాంబర్ లో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, చైల్డ్ హెల్ప్ లైన్ పోస్టర్లను ఆవిష్కరించారు. అదేవిధంగా పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన పెంపొందించేందుకు సిద్ధం చేసిన ప్రదర్శన బోర్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, సఖి కేంద్రం అడ్మిన్ లక్ష్మి , మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ దరఖాస్తుల గడువు పెంపు

ఇల్లంతకుంట మార్చ్ 2(ప్రజా జ్యోతి)
రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం రహీమ్ ఖాన్ పెట్ మోడల్ స్కూల్ లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల దరఖాస్తు గడువును ఈనెల 10 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి అడ్మిషన్లతో పాటు ఏడు నుండి పదవ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి కూడా దరఖాస్తు గడువు పొడిగించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 19న ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపల్ గంగాధర్ తెలిపారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

## ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి ప్రతినిధి, (ప్రజాజ్యోతి), మార్చి 02:
అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.
సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన పి.





ఓదెలు తనకు ఖానాపూర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 48/38 లో వారసత్వంగా ఒక ఎకరం భూమి ఉందని, ఆ భూమి మరణించిన తన తండ్రి గారి పేరు మీద ఉందని, అట్టి భూమి తన పేరు మీద మార్చి పట్టా పాస్ పుస్తకం జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ మంథని కు రాస్తూ క్షేత్రస్థాయిలో విచారణ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పెద్దపల్లి పట్టణం తిలక్ నగర్ కు చెందిన బి. శ్యామల తనకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీ.డీ. హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి పట్టణం రంగంపల్లి కు చెందిన కే.కవిత తమ దివ్యంగులమని ఆ కోటాలో తమకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీ.డీ. హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి జిల్లాకు చెందిన బానోతు రాజేష్ నాయక్ సీఎం కప్పు క్రీడా పోటీలలో తన కుమారుడు బానోతు రెడ్యా నాయక్ కు గాయాలయిందని, అతని చికిత్స కోసం అవసరమైన ఆర్థిక సహాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా డివైఎస్ఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పటిదాకా ఒక లెక్క..ఇకపై మరో లెక్క

- అక్రమ నిర్మాణాల పై కఠిన చర్యలు తీసుకోవాలి
- రెవెన్యూ, శానిటేషన్ శాఖలతో అవగాహన సదస్సు నిర్వహించాలి
- కార్పొరేషన్‌లో ప్రక్షాళనకుబండి సంజయ్ శ్రీకారం

కరీంనగర్ బ్యూరో, మార్చి 2( ప్రజాజ్యోతి )
ఇప్పటిదాకా ఒక లెక్క.ఇకపై మరో లెక్క" అంటూ టౌన్ ప్లానింగ్ అధికారులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కఠిన హెచ్చరిక జారీ చేశారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్,డిప్యూటీ మేయర్ సునీల్ రావుతో కలిసి ఎంపీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.అవినీతికి కఠిన హెచ్చరిక ఇళ్ల నిర్మాణ అనుమతుల కోసం డబ్బులు అడగొద్దని, దరఖాస్తుదారులను ఇబ్బంది పెట్టొద్దని స్పష్టం చేశారు. బ్రోకర్లు, ఏజెన్సీల ద్వారా లంచాలు తీసుకుంటే ఉపేక్షించబోమని, అలాంటి వారు బదిలీపై వెళ్లొచ్చని హెచ్చరించారు. "మీరు నిజాయితీగా పనిచేస్తే కంటికి రెప్పలా కాపాడుకుంటా. తప్పు చేస్తే భగవంతుడు కూడా కాపాడలేరు" అని అన్నారు.నిబంధనల ప్రకారం పనిచేసే అధికారులపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉండవని, బీజేపీ కార్పొరేటర్లు అవినీతికి చోటివ్వరని తెలిపారు. ఇతరులతో అంటకాగి తప్పు చేస్తే నష్టపోయేది అధికారులేనని





హెచ్చరించారు. కరీంనగర్‌లో ఇంటి నిర్మాణానికి సులువుగా అనుమతులు వస్తాయనే నమ్మకం కలిగించేలా వ్యవస్థ ఉండాలని సూచించారు. ప్రజలను చిరునవ్వుతో పలకరించి, నిబంధనలు వివరించి సహకరించాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో "హెల్ప్ డెస్క్" ఏర్పాటు చేసి పారదర్శకత పెంచాలని సూచించారు. అనుమతి లేకుండా జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే గుర్తించి నోటీసులు జారీ చేయాలని, స్పందించకపోతే కూల్చివేతల వరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడాలని స్పష్టం చేశారు. మూడు రోజుల్లోగా కార్పొరేటర్లు, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ శాఖలతో అవగాహన సదస్సు నిర్వహించాలని ఆదేశించారు. నెలరోజుల్లో కార్పొరేషన్ కార్యాలయంలో మార్పు కనిపించాలని పేర్కొన్నారు.కరీంనగర్‌కు ఐకానిక్‌గా నిలిచే ప్రాజెక్టులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, సీఎస్ఆర్ నిధులు సమీకరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో "అటల్ క్యాంటీన్"లను ఏర్పాటు చేసి పేదలకు పౌష్టికాహార భోజనం అందించే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్జీవోల సంఘం నాయకులు

కరీంనగర్ టౌన్, మార్చి 2( ప్రజాజ్యోతి )
కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం



శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సంఘం నాయకులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు పుష్పగుచ్ఛం అందజేసి జిల్లా ఉద్యోగుల తరపున హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెలంగాణ ఎన్జీవోల సంఘం 2026 సంవత్సర డైరీని అందజేశారు. మార్చి 7న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంకమ్మతోటలోని టీఎన్జీవోల సంఘ భవనంలో నిర్వహించనున్న మహిళా దినోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ గారిని సాదరంగా ఆహ్వానించారు. అదే రోజు మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఉద్యోగుల సమస్యలపై కూడా చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చిత్ర మిశ్రా గారు మహిళా దినోత్సవ కార్యక్రమానికి హాజరవుతానని సానుకూలంగా స్పందిస్తూ, "తప్పకుండా వస్తాను" అని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ సహకరిస్తుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీచరణ్, అసోసియేట్ అధ్యక్షుడు ఒంటెల రవీందర్ రెడ్డి, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, రాష్ట్ర నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్ సింగ్, మహిళా నాయకులు శారద, సునీత, సబిత, పట్టణ సంఘం అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంతరావు, రూరల్ అధ్యక్షుడు కోడూరి వాస్తవిక్ గౌడ్, కార్యదర్శి కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల జీవితాలు వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శకం

## దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి ప్రతినిధి, మార్చి 2 (ప్రజాజ్యోతి):
మహనీయుల జీవితాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని, వారి జీవన ప్రయాణం నుంచి



అనేక వ్యక్తిత్వ వికాస పాఠాలు నేర్చుకోవచ్చని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పేర్కొన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, డీసీపీ రాంరెడ్డి కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన ధన్వాడలో జన్మించి శాసనసభ స్పీకర్ స్థాయికి ఎదిగిన మహనీయ నాయకుడు దుద్దిల్ల శ్రీపాదరావు అని తెలిపారు. న్యాయవాదిగా సేవలు అందిస్తూ ప్రజల ఆకాంక్షల మేరకు రాజకీయాల్లోకి ప్రవేశించి సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ పదవివరకు ప్రజల ఆశీస్సులతో ఎదిగారని కొనియాడారు. నమ్ముకున్న సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాసేవలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడిగా ఆయన నిలిచారని అన్నారు. మహనీయుల జయంతి వేడుకలను నిర్వహించడం ద్వారా వారి జీవిత విశేషాలను కొత్త తరాలకు పరిచయం చేయడంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రేరణ లభిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం స్థానిక ప్రముఖుల జయంతులను అధికారికంగా నిర్వహించడం సంతోషకర విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి,సంసాద్,క్రీడామహోత్సవం ప్రారంభించిన,ప్రతాప. రామక్రిష్ణ.

వేములవాడ, మార్చి, 2:ప్రజా జ్యోతి
కరీంనగర్ పార్లమెంట్ మహా క్రీడోత్సవం ప్రధానమంత్రి సంసద్ క్రీడ మహోత్సవం లో భాగంగా వేములవాడ నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు కేంద్రమంత్రి బండి సంజయ్, ఆదేశాలతో ఈరోజు వేములవాడ పరిధిలోని ఒకటో వార్డు సాతరాజపల్లి హైస్కూల్లో గ్రౌండ్లో ఆటల పోటీలు ప్రారంభించడం జరిగింది ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రతాప రామకృష్ణ, చేతుల మీదుగా వాలీబాల్ మరియు కోకో కబడ్డీ లాంటి ఆటలను ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ యువతకి దేశీయ క్రీడలు ఆత్మస్థైర్యానికి ఆరోగ్యానికి తొలిమెట్టుగా భావించి 2018 లో ప్రధాని నరేంద్ర మోడీ, దేశం మొత్తం కూడా క్రీడా మహోత్సవం కార్యక్రమాలను ప్రారంభించుకొని ప్రతి సంవత్సరం కూడా ఈ ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను ఒకే రకంగా స్వీకరించి ముందుకు వెళ్లాలని సూచించారు తల్లితండ్రులు పిల్లల చదివే కాకుండా క్రీడలకు కూడా ప్రోత్సహించాలని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ జిల్లా ఉపాధ్యక్షులు



శ్రీనివాస్ కౌన్సిలర్లు వంగల శ్రీనివాస్ మైలారం శ్రీనివాస్ అన్ని మండలాల అధ్యక్షులు మరియు అన్ని మండలాల క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది

# బీసీ రక్షణ చట్టం అమలు చేయాలి

## పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్

పెద్దపల్లి ప్రతినిధి, మార్చి 2 (ప్రజాజ్యోతి):
రాష్ట్రంలో వెనుకబడిన తరగతులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేకంగా బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావాలని పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ ఉపాధ్యక్షుడు కొండి సతీష్ డిమాండ్ చేశారు.
ఈ మేరకు సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకు బీసీలపై సామాజిక దాడులు, బహిష్కరణలు, వేధింపులు, హత్యలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నల్గొండ జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలు, ఎన్నికల సమయంలో కిడ్నాప్‌లు, బెదిరింపులు, ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిపై జరిగిన ఘటనలు, అలాగే కుమ్మర మల్లన్న జాతరలో జరిగిన పసికందు హత్య వంటి సంఘటనలు బీసీల భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.
ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలో బీసీలకు రక్షణ కల్పించే ప్రత్యేక చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అవసరమైతే బీసీ రక్షణ చట్టం సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో బీసీ రక్షణ చట్టం



అమలుకు చర్యలు జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణలో కూడా అదే విధంగా చట్టం తీసుకువచ్చి బీసీ వర్గాలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు.

# జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

తంగళ్ళపల్లి మార్చి 2 (ప్రజా జ్యోతి)
మండేపల్లి గ్రామంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (ఎన్ఎంఎన్ఎఫ్) లో భాగంగా అయి -సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమ కో ఆర్డినేటర్,ప్రకృతి వ్యవసాయ నిపుణులు



గారంపల్లి శ్రీకాంత్,గ్రామ సర్పంచ్ గాధగోని సాగర్ గారి అధ్యక్షతన మండేపల్లి గ్రామంలోరైతులకి ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా సదస్సు నిర్వహించడంజరిగింది.ఇందులో భాగంగా ఘన,ద్రవ జీవామృతం,కాషాయల తయారీ విధానం తద్వారా పంటల సంరక్షణ వంటి అంశాల పై అవగాహనా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ ప్రభుదాస్, ప్రతాపరెడ్డి,శశి ఏఇ ఓ కరుణాకర్,సీఆర్ పీ జమున,జ్యోతి గార్లు రైతులు దుర్గరెడ్డి, శ్రీనివాస్, ఆనంద్,సి ఏ శ్రీనివాస్,కార్యదర్శి ప్రశాంత్,కారోబార్ లచ్చి రెడ్డి పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ లో దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలు

సుల్తానాబాద్ మార్చి 2 (ప్రజా జ్యోతి)
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతిని పురస్కరించుకొని సోమవారం సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని నెహ్రూ విగ్రహం సమీపంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దుద్దిళ్ల శ్రీపాదరావు ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేసిన విశిష్ట నాయకుడని కొనియాడారు. శాసనసభ స్పీకర్‌గా ఆయన నిష్పక్షపాత ధోరణి, క్రమశిక్షణతో సభను నడిపిన తీరు నేటి తరానికి ఆదర్శమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. యువత ఆయన సేవాస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.
పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ మాట్లాడుతూ శ్రీపాదరావు రాజకీయ ప్రస్థానం నిరాడంబరతకు నిదర్శనమన్నారు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న నాయకుడిగా ఆయన చిరస్మరణీయుడని తెలిపారు.
కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ, మార్కెట్ చైర్మన్ మినిపల్ ప్రకాష్ రావు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీష్, పన్నాల రాములు భూషణవ్ సురేష్ గౌడ్ , సాయిరీ మహేందర్ కౌన్సిలర్లు చింతల రాజు తొరికొండ ప్రభాకర్ కల్లేపెల్లి జానీ అమ్మిరిసెట్టి రాజలింగం తిరుపతి రవి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ

## మొదటి సంవత్సరం పరీక్షలకు 97 శాతం హాజరు

పెద్దపల్లి ప్రతినిధి, మార్చి 2 (ప్రజాజ్యోతి):
జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు ఐదవ రోజు సోమవారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆమె వివరించిన ప్రకారం, ఐదవ రోజు నిర్వహించిన మొదటి సంవత్సరం గణితం, వృక్షశాస్త్రం, రాజకీయ శాస్త్రం పరీక్షలకు మొత్తం 5,780 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 5,613 మంది పరీక్షలకు హాజరయ్యారు. 167 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. దీనితో ఐదవ రోజు పరీక్షలకు జిల్లాలో మొత్తం 97 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా కొనసాగినట్లు ఇంటర్మీడియట్ జిల్లా అధికారి వెల్లడించారు.
పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు పర్యవేక్షణ చర్యలు సమర్థవంతంగా అమలు చేసినట్లు అధికారులు తెలిపారు.

# గంగాధర మండల రైతులకు వ్యవసాయ అధికారి ఆర్. శ్రీనివాస్ సూచనలు.

గంగాధర మార్చ్ 02 (ప్రజా జ్యోతి)
గంగాధర మండల కేంద్రంలో వరి పంట పొలాలను సోమవారం మండల వ్యవసాయ అధికారి ఆర్. శ్రీనివాస్ పరిశీలించారు. వరి పంట ప్రస్తుత వాతావరణ పరిస్థితుల రీత్యా అగ్గి తెగులు ప్రాథమిక



దశలో ఉంటుందన్నారు. కావున రైతులందరూ అప్రమంతంగా ముందు జాగ్రత్తతో ఉండాలని సూచించారు. దీనికి ఐసోప్రోత్రయోలిన్1.5ml /లీటర్ నీటికి లేదా కాసుగా మైసిన్ 2ml/లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఒడ్ల పైన గడ్డి లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

## చైర్‌పర్సన్ వైస్ చైర్మన్‌లను
# సన్మానించిన తెలంగాణ ఉద్యమకారులు




**ఖమ్మం వైరా: మార్చి 2 ప్రజా జ్యోతి** వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్ర కళని, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ని సోమవారం తెలంగాణ ఉద్యమకారులు విడివిడిగా సత్కరించారు. ఇరువురిని మర్యాదపూర్వకంగా కలుసుకొని, తొలి పురపాలక చైర్ పర్సన్ గా ఎన్నికైనందుకు చంద్రకళకు అభినందనలు తెలియజేశారు. అనంతరం ఉద్యమకారుల కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. వైస్ చైర్మన్ సంతోషని పురపాలక కార్యాలయంలో కలుసుకొని సన్మానించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అమలు చేసి, న్యాయం చేయాలని వివరించారు. 250 గజాల ఇంటి జాగా తో పాటు ఇల్లు నిర్మాణానికి 10 లక్షల ఆర్థిక సాయం, ప్రతినెల పెన్షన్ తో పాటు హెల్త్ కార్డులు, ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. స్పందించిన చైర్పర్సన్, వైస్ చైర్మన్ సమస్యను స్థానిక ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ కి వివరించి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు పూర్ణ కంటి రామారావు, ఎస్ కే పాషా, గౌరవరపు జగదీష్, వాసిరెడ్డి రవి, మిట్టపల్లి రాఘవరావు, యలదండి బాబు, ఓర్సు శీను, దొంతు నరసింహరావు , సూర్యదేవర సంగమేశ్వర ప్రసాద్, బొచ్చు రమణ, ఆదూరి ప్రేమ్ కుమార్, సతీష్ గౌడ్, కుదురుపాక దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైరా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**ఖమ్మం వైరా: మార్చి 2 ప్రజా జ్యోతి** వైరా వాసవి క్లబ్, వాసవి డైమండ్ క్లబ్, ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సోమవారం వైరా బస్టాండ్ లో ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ ఎస్, మంచినీటి ప్యాకెట్లు అందించారు. నెమలి వేణుగోపాలస్వామి కళ్యాణం మహోత్సవం ఉండటంతో, భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రయాణికుల వేసవి తాపాన్ని తీర్చడం కోసం నిర్వాహకులు శీతల పానీయాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కట్ట కృష్ణా కృష్ణార్జునరావ్,ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్ , వాసవి డైమండ్ క్లబ్బు అధ్యక్షులు నంబూరు శ్రీనివాసరావు, డాక్టర్ పెరుమళ్ళ కృష్ణమూర్తి, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాణా వెంకటేశ్వర్లు, వనమా మల్లికార్జునరావు, వనమా వెంకటేష్, నూకల వాసు, ఒజినెపల్లి చక్రవర్తి, మిట్టపల్లి కృష్ణవేణి, మిట్టపల్లి నరసింహారావు నూకల ప్రసాద్ రాయల లలిత కుమారి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి




**నేలకొండపల్లి, మార్చి 2 ప్రజా జ్యోతి :** ప్రకృతి వ్యవసాయం పై రైతులకు అవగాహన కల్పించాలని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ సూచించారు. మండలం లోని చెన్నారంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం పై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో ప్రత్యేక సమావేశం ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు..... ప్రకృతి వ్యవసాయం ను ప్రోత్సాహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వలన భూమికి జీవ శక్తి పెరుగుతుందని అన్నారు. నీటి నిలువలు, మట్టి నాణ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన ఆహారం లభిస్తుందని అన్నారు. పంటలకు మంచి గిరాకి వస్తుందని అన్నారు. సేంద్రియ వ్యవసాయానికి జీవ ఎరువులు, వర్మి కంపోస్టు, గోమూత్రం, ద్రవ జీవామృతం వివిధ రకాలు వాడాలని "సూచించారు. ప్రతీ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బట్టపోతుల నాగమణి, వ్యవసాయా విస్తీరణాధికారి దుర్గాభవాని, మాజీ చైర్మన్ మానుకొండ శ్రీనివాసరావు, ఆదర్శ రైతులు మంకెన వెంకటేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఏరియాలో దుదిళ్ళ
# శ్రీపాదరావు జయంతి వేడుకలు




**కొత్తగూడెం సింగరేణి, మార్చి 2 - ప్రజాజ్యోతి:** సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయము లో స్వర్గీయ దుద్ధిళ్ల శ్రీపాదరావు జయంతి వేడకను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ... ఉన్నత విలువలకు, నీతి నిజాయితీలకు ప్రతిరూపంగా మాజీ స్పీకర్ కీర్తిశేషులు దుద్ధిళ్ల శ్రీపాదరావు నిలుస్తారని, ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తెలంగాణ రాష్టం ఏర్పాటు కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభకు స్పీకర్ గా వ్యవహరించి అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులతో మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తి అని కొనియాడారు. దుద్ధిళ్ల శ్రీపాదరావు ఇప్పుడు ఉన్న మంథని శాసనసభ్యులు ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్ధిళ్ల శ్రీధర్ బాబు తండ్రి అని, రాజకీయాల్లో ఉన్నత విలువలకు పట్టం కట్టిన తెలంగాణ ప్రాంత నేతగా ఆయన ప్రజల మనసుల్లో చిరకాలం గుర్తుండిపోతారని, తన రాజకీయ జీవితం మొత్తం ప్రజలకు అంకితం చేసి, ప్రజాసేవకే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారని, ప్రతిపక్షాలు కూడా ఆమోదించి ప్రశంసించిన స్పీకర్ గా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంతో పాటు కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జే. గట్టయ్య, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, అధికారుల సంఘం అధ్యక్షుడు ఎం.వి నరసింహారావు, ఏజిఎం ( ఫైనాన్స్) ఈ.భీభాత్స, ఎజిఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు, జిఎం కార్యాలయంలోని వివిధ విభాగాధిపతులు, ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

# యుద్ధాలు వద్దు శాంతి కావాలి






**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** అఖిలభారత పీఠాధిపతుల సమాఖ్య అధ్యక్షులు ,కార్డినల్ పూల అంతోని.కరుణగిరి మహోత్సవాల సందర్భముగా ఖమ్మం కరుణగిరి యందు బిషప్ సగిలి ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని ప్రసంగించిన పూల.అంతోని కార్డినలు,ఇప్పుడు ప్రపంచానికి యుద్ధాలు వద్దని శాంతి కావాలని ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో ఏసుప్రభు బోధించిన శాంతి మార్గంలో ప్రయాణించాలని ,మనకోసం ప్రాణాలు అర్పించిన ఏసుప్రభు యొక్క సహనం సంతోషము సఖ్యత అలవర్చుకొని ప్రజలు విభేదాలు మరిచి జీవించాలని తెలియజేసే వారి కోసము ప్రార్థించినారు. అంతకుముందుగా విద్యార్థుల కోసం వసతి గృహం శంకుస్థాపన చేసినారు.అనంతరము నాయుడుపేట నుండి కరుణిగిరి వరకు వాహన ర్యాలీ కోలాటం ,డప్పు లు తో ఊరేగింపుగా పవిత్ర కరుణగిరి పుణ్యక్షేత్రానికి తోడుకొని వచ్చరు.వీరి వెంట వికారి జనరల్ శౌరి , ఫైనాన్స్ అడ్మినిస్ట్రేటర్ ఐజాక్, కరుణగిరి డైరెక్టర్ ఫాదర్ జార్నేసు ఫాదర్ జయరాజ్ వివిధ సంస్థల ఫాదర్ లు ,సిస్టర్లు ,సుపీరియర్లు బ్రదర్లు సంఘస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఖమ్మం పీఠము తరఫున సన్మానము చేసినారు.అనంతరము కోలాటం పోటీలు జరిగినయి. తదుపరి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎం .పి . రఘు రామ్ రెడ్డి. రామ సహాయము పాల్గొని ప్రసంగించిన క్రిస్టమస్ ల కు అబ్బుద్ధి కోసం ప్రయత్నిస్తాను అని చెప్పారు.ఇదు లాపురం మున్సిపల్ చైర్మన్ అనిత పాల్గొన్నారు.కూడా ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రైవేటు అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

– జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి – ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.కొణిజెర్ల మండలం దిద్దుపూడి గ్రామానికి చెందిన అమర్లపూడి భాస్కర రావు సర్వే నెంబర్ 82, 83 లో తమ భూమి ఉందని, సర్వే నెంబర్ 81లో ఉన్న తమ భూమిని సబ్ స్టేషన్ కోసం కేటాయించగా హైకోర్టు కేసు పెండింగ్ ఉండటంతో ఆ స్థలం నుంచి మార్చడం జరిగిందని, ప్రస్తుతం మున్సిపాలిటీ వారు అదే స్థలంలో ఎటు వంటి సర్వేలు చేపట్టకూడదని హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ డంపింగ్ యార్డ్ కు కేటాయించారని, దీనిని సరిచేసి తమ పేరు మీద పట్టా పాస్ పుస్తకాల జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.నేలకొండపల్లి మండలం ముఠాపురం గ్రామం పెద్దతండకు చెందిన గిరిజనులు గత ప్రభుత్వం సర్వే నెంబర్ 663 నందు తమకు ఆరు ఎకరాల స్థలం కేటాయించిందని, అందులో నుంచి మా గ్రామస్తులకు బంజారా భవన్, సేవాలాల్ మందిరం కొరకు స్థలం కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, నేలకొండపల్లి తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.చింతకాని మండలం పందిళ్ళపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీ ప్రియ అనంతసాగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 181 లో వ్యవసాయ భూమి ఉందని, సర్వే నెంబర్ 182 లో ఉన్న మరో ఎకరం భూమి కూడా తాము వారసత్వంగా సాగు చేసుకుంటున్నా మని, తమ పట్టా పాస్ పుస్తకంలో ఆ భూమి వివరాలు కూడా నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, చింతకాని తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీతో జిల్లా కాంగ్రెస్
# కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** కుటుంబం శిక్షణ తరగతుల చివరిరోజున తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏ ఐ సి సి కార్యదర్శి సచిన్ రావు, సి డబ్ల్యూ సి మెంబర్ వంశీ చంద్ రెడ్డి, పరిగి శాసనసభ సభ్యులు రామ్ మోహనరెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్,చర్ఖా ను అందుకొన్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో 21-02-2026 నుండి 02-03-2026 వరకు జరిగిన శిక్షణ తరగతుల గురించి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు పార్టీని ఎలా నడపాలి ప్రభుత్వ పథకాలను అట్టడుగున ఉన్న ప్రజానీకానికి చేరవేయవలసిన బాధ్యత జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులదేనని, అదే విధంగా అధ్యక్షులు బాధ్యతతో పని చేయాలని రానున్న పార్లమెంట్ ఎన్నికలలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాల నే బలమైన సంకల్పంతో పనిచేయాలనికోరారని, ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ప్రముఖ నాయకులు పాల్గొని మాట్లాడుతూ దేశంలోని సామాజిక, ఆర్థిక రుగ్మతలకు పరిష్కారం కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఉందని,రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ప్రజల్లో నిరంతరం పనిచేస్తూ అత్యధిక పార్లమెంట్ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కుల వివక్ష నిర్మూలన, సామాజిక న్యాయం సాధనలో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక పాత్ర పోషించిందని పేర్కొన్న ఆయన, అంటరానితనం నిర్మూలన నుంచి భూ సంస్కరణలు, ఎస్సీ-ఎస్టీ హక్కుల పరిరక్షణ వరకు అనేక విప్లవాత్మక నిర్ణయాలు కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమయ్యాయని తెలిపారు.దేశానికి స్వాతంత్ర్యం సాధించడంతో పాటు సామాజిక న్యాయం కోసం పోరాడిన కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ,రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారని అని తెలియజేశారు.అదే విధంగా ఈ శిక్షణా తరగతులు సరికొత్త అనుభవ పాఠాలు నేర్చుకొన్నామని,జీవితంలో మరువలేనివి అని అన్నారు.

# సింగరేణిలో దుదిళ్ళ శ్రీపాదరావు జయంతి వేడుకలు

– నివాళులర్పించిన డైరెక్టర్ సూర్యనారాయణ





**కొత్తగూడెం సింగరేణి, మార్చి 2 - ప్రజాజ్యోతి:** సింగరేణి ప్రధాన కార్యాలయం లోని హెచ్ఆర్డి కాన్ఫరెన్స్ హాల్ వద్ద సోమవారము నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. జిఎం(పర్సనల్) వెల్ఫేర్ ఢ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ హాజరయ్యారు. ముందుగా దుద్దిళ్ళ శ్రీపాదరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సంధర్భముగా డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ కీర్తిశేషులు దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి ఉత్సవాలను ఇక్కడ ఇంత ఘనముగా జరుపుకోవటం చాలా సంతోషముగా ఉందని, కార్పొరేట్ లో మాత్రమే కాకుండా సింగరేణి వ్యాప్తముగా కూడా ఈ జన్మదిన వేడుకలను జరుపుకుంటున్నామని తెలిపారు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అంచెలంచలుగా ఎదిగి మూడుసార్లు మంథని నియోజక వర్గం నుండి గెలిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ గా పనిచేశారని ప్రజల మధ్య ఉంటూ వారి కష్టనష్టాలు తెలుసుకొని వారిని అభివృద్ధి పథంలో నడిపిన మహోన్నత వ్యక్తి అని, నిబద్ధత గల నాయకుడిగా, విలువలైన రాజకీయాలకు నిదర్శనంగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు. జనరల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సహజసిద్ధమైన రంగులతో హోళీ సంబరాలు జరుపుకోవాలి

– హోళీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఇతరులకు ఇబ్బందులను కలిగించకుండా జరుపుకోవాలి

– బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు

– ప్రత్యేక బృందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు:: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ,మార్చి 2,ప్రజాజ్యోతి :** హోళీ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుభాకాంక్షలు తెలుపుతూ హోళీ పండుగను సాంప్రదాయబద్ధంగా,పరస్పర గౌరవంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ప్రజలను కోరారు.హోళీ వేడుకల సందర్భంగా సహజసిద్ధమైన రంగులను మాత్రమే ఉపయోగించాలని,హానికరమైన రసాయనిక రంగులను వాడకూడదని సూచించారు.ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా బలవంతంగా రంగులు చల్లడం,నీటి బెలూన్లు విసరడం వంటి చర్యలు చేయరాదని హెచ్చరించారు.ప్రార్థనా మందిరాలు,ప్రజా ప్రదేశాలు,రహదారులపై వాహనదారులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించవద్దని తెలిపారు.ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇందుకోసం షీ టీమ్ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ప్రధాన కూడళ్లలో మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘా బృందాలను ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు.పండుగ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని,జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత వాహనాలను అతివేగంగా నడపకుండా జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈత రాని వారు చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లకూడదని,చిన్నపిల్లలను అటువంటి ప్రదేశాలకు తీసుకెళ్లరాదని విజ్ఞప్తి చేశారు. లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. జిల్లా ప్రజలందరూ పరస్పర గౌరవంతో,సురక్షితంగా హోళీ పండుగను జరుపుకొని పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

## అనంతసాగర్ లో ఎంఐఎం జెండా ఆవిష్కరణ

కొండాపూర్ ప్రజా జ్యోతి: ముస్లింల ప్రస్తావన వస్తే బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఒకటేనని ఎంఐఎం పార్టీ ఏరియా కన్వీనర్ గౌస్పషా అన్నారు. సోమవారం కొండాపూర్ మండల పరిధిలోని అనంతసాగర్లో ముస్లిం మైనార్టీ యువకులను ఎంఐఎం కండువాలు వేసి పార్టీలోకి




ఆహ్వానించి అనంతరం పార్టీ జెండాను ఏరియా కన్వీనర్ గౌస్పెషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌస్పోషా మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు ముస్లింలకు చేసిందేమి లేదన్నారు. ప్రజా సమస్యలపై ఎంఐఎం పార్టీ ఉద్యమిస్తుందన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వాల మెడలు వంచేది ఎంఐఎం పార్టీ అని పేర్కొన్నారు. ఇరాన్పై దాడులను తీవ్రంగా ఎంఐఎం పార్టీ ఖండిస్తుందన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయెదుల్లా అలీ ఖమేనీ మృతి చెందడం బాధకరమన్నారు. కొండాపూర్ మండలంలో ఎంఐఎంపార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా తాబ్రేష్, ప్రధాన కార్యదర్శి హర్షద్, అనంతసాగర్ గ్రామ అధ్యక్షుడు అజీమోద్దీన్, వైస్ ప్రసిడెంట్ మహమూద్, గ్రామ నాయకులు అఫ్రోజ్ సిరాజ్ షోయబ్ అక్తర్, మహబూబ్లీ, సమీరుద్దీన్, అమేర్, ముజీబ్, మహమ్మద్, అజ్మత్లున్నారు.

## కుమ్మెరల ఘటనపై కలెక్టర్ నివేదిక


మొదటిపేజీ తరువాయి..

సందర్శించి వివరాలు తెలుసుకోవడం జరిగింది. నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ బధ్వావత్ సంతోష్ పంపిన తమ నివేదిక బీసీ కమిషన్కు చేరింది. అందులో పాప తండ్రి గణెళిష్కు డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేటివ్ ఫండ్ నుండి ఒక లక్ష రూపాయలు ఇవ్వడం జరిగింది. పాప తండ్రి గణెళిష్కు నాగర్కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజిలో అవుట్సోర్సింగ్ జాబ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. పాప తండ్రి గణెళిష్కు 2 పడకల గదిని ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ పాప కుటుంబంతో మాట్లాడి, అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ రిపోర్టులో 18వ తారిఖునాడు కుమ్మెర మల్లన్న జాతర నుండి 21వ తారీఖు వరకు జరిగిన అన్ని సంఘటనలను కూలంకుషంగా వివరించడం జరిగింది. 17 ఫిబ్రవరి నుండి 20 ఫిబ్రవరి వరకు ఆ జాతరలో సుమారు 20 వేల భక్తులు పాల్గొన్నారని తెలపడం జరిగింది. పాప తల్లి శ్రీమతి మౌనిక కులాన్ని నిర్ధారించడానికి ఆధారంగా ఆమె ఎటువంటి సర్టిఫికేట్లు ఇప్పటివరకు అందజేయలేదని తెలిపారు. శ్రీమతి మౌనిక కులాన్ని నిర్ధారించడానికి మహమ్మదాబాద్ తహశీల్దార్కు ఆదేశించగా మౌనిక తల్లి బాలక్రిష్ణమ్మ పిచ్చగుంట్ల (వంశరాజ్) కులానికి చెందినదని తెలపడం జరిగింది.

## ఈ యుద్ధం మరో నాలుగైదు వారాలు జరగొచ్చు

మొదటిపేజీ తరువాయి..

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మరికొద్ది రోజుల పాటు పూర్తి స్థాయిలో కొనసాగుతుందన్నారు. అలాగే అమెరికా సైనికుల గురించి కీలక



వ్యాఖ్యలు చేశారు. 'ఈ ఆపరేషన్లో ఇప్పటివరకు ముగ్గురు అమెరికా సైనికులు మృతి చెందారు. మా సైనికుల మృతికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటాం. యుద్ధం ముగిసేలోపు మరింత మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయే అవకాశముంది. అయినా ముందుకే వెళ్తాం. ఈ దాడుల వల్ల ఇరాన్లో 200 మంది మరణించినట్టు తెలిసింది. ఇరాన్ ఐఆర్జీసీ, మిలిటరీ దళాలు ఆయుధాలు వీడితే వారికి రక్షణ కల్పించేందుకు సిద్ధం. లేదంటే వారికి చావు తప్పదు. అలాగే చర్చల కోసం మా దౌత్య మార్గాలు ఇప్పటికీ తెరిచే ఉన్నాయి' అని ట్రంప్ పేర్కొన్నారు . అలాగే తనపై జరిగిన హత్యాయత్నాల గురించి కూడా ట్రంప్ స్పందించారు. 'ఖమేనీ ప్రోద్బలంతో నాపై ఇప్పటికి రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయి. అయితే, నేను మొదటి ప్రయత్నంలోనే అతడి కథను ముగించా. నన్ను పట్టుకోకముందే, నేను అతడిని పట్టుకున్నా. ఇరాన్పై విస్తృత స్థాయిలో దాడులు జరుపుతున్నాం. ఆ ఆపరేషన్ 4-5 వారాలు కొనసాగొచ్చు. యుద్ధ తీవ్రతను ఇదే విధంగా కొనసాగించడం అమెరికా, ఇజ్రాయెల్కు పెద్ద కష్టం కాదు' అని ట్రంప్ పేర్కొన్నారు.


## పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు

మొదటిపేజీ తరువాయి..

నిలిపివేయబడ్డాయి. శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన సుమారు 22 విమానాలు రద్దు కాగా, వివిధ దేశాల నుంచి రావాల్సిన మరో 22 విమానాలు కూడా రద్దయ్యాయి. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం దృష్ట్యా ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎమిరేట్స్, కతార్ ఎయిర్వేస్ వంటి విమానయాన సంస్థలు విమానాలను రద్దు చేశాయి. విమానాల రద్దుతో శంషాబాద్ విమానాశ్రయం పరిసరాలు ప్రయాణికుల లేక వెలవెలబోతున్నాయి. ప్రయాణికులకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక సూచన జారీ చేసింది. మిడిల్ ఈస్ట్ దేశాలకు ప్రయాణాలను రద్దు చేసుకోవాలని...,÷÷-లట్ స్టేటస్ను ఎయిర్లైన్ వెబ్సైట్లు, ఎయిర్పోర్ట్ అధికారుల ద్వారా తెలుసుకోవాలని డీజీసీఏ సూచించింది.

# భూమి అంటే మట్టి కాదు మానవ మనుగడ

మార్చి 2, ఖమ్మం (ప్రజా జ్యోతి): భూమి అంటే మట్టి కాదు మానవ మనుగడ, అది చరాచర జీవరాసుల జీవనాధారం. ముఖ్యంగా మానవాళి ఆత్మగౌరవం దేశ స్వాతంత్రానికి ముందు రాజరిక పాలనలో, బ్రిటిష్ పాలనలో వెట్టిచాకిరీకి, నెట్టి వేయబడ్డ కులాలకు వృత్తి కులాల ప్రజలకు భూముండేడి కాదు. రాజుల చేతుల్లో, అగ్రకుల పెత్తందారులు, జమీందారుల చేతుల్లో ఉండేది. తెలంగాణ ప్రాంతంలో జాగీర్దార్లు, పట్వారీలు, పటేళ్లు గడీ దొరల చేతుల్లో భూములు ఉండేవి. అణగారిన పేదలు కూలీలుగా మాత్రమే ఉండేవారు. ఈ క్రమంలో తెలంగాణలో కమ్యూనిస్టుల నాయకత్వంలో భూ పోరాటాలు జరిగాయి ఏడవ నవాబు నూరు మహమ్మద్ మీర్చు ఖాన్ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు నాయకత్వంలో సాయుధ పోరాటాలు జరిగాయి పేదలకు పది లక్షల ఎకరాల భూములు పంచి పెట్టారు. 1947లో భారత ప్రభుత్వం సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో 1948 లో తెలంగాణ నవాబ్ ఆస్థానాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత దేశానికి 1952 లో సార్వత్ర ఎన్నికలు జరిగాయి. స్వతంత్ర ప్రజాస్వామ్య పాలనలో కేంద్ర ప్రభుత్వం భూముల లెక్క సేకరించింది. కొద్ది మంది చేతుల్లో వేలాది ఎకరాల భూములు ఉన్నాయని, ప్రభుత్వం గుర్తించింది. హరిజనులు, గిరిజనులు బడుగు బలహీన వర్గాల చేతుల్లో భూములు లేని విషయాన్ని ప్రభుత్వం



తెలుసుకొని ఆబాది భూములను, అసైన్డ్ భూములను, పంచరాయ భూములను, పేదలకు పంచాలని నిర్ణయించింది. అంటరాని కులాలుగా ఊరికి దూరంగా నెట్టవేయబడ్డ, మాల, మాదిగ కులాలకు పంచరాయి, గ్రామ కంఠం భూములు 5 కుంటలు, 10 కుంటలు, 20 కుంటలు చొప్పున కొన్ని గ్రామాలలో పంచారు. ఈ క్రమంలో 1951లో భూదాన్ వినోబా నాయకత్వంలో పేదలకు సమగ్రంగా భూమి పంచాలి అనే నినాదం తెరపైకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రంలోని దాచేపల్లి గ్రామంలో రామచంద్ర రెడ్డి గురుస్వామి 100 ఎకరాలు భూమిని దానం చేశారు. దాంతో దేశవ్యాప్తంగా భూస్వాములు, చాలామంది భూములు దానం చేశారు. ఈ క్రమంలోనే నవాబు దగ్గరున్న 14 వేల ఎకరాల భూమిని భూదాన్ ఇనోబాకి దానం చేశారు. దాంతో దేశవ్యాప్తంగా భూములు దానం చేయడం అనేది 1964 వరకు కొనసాగింది. ఆ తర్వాత భూదాన భూములపైన ఒక చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. భూదాన భూములు పేదలకు మాత్రమే చెందాలని, ఒక నిర్దిష్టమైన చట్టాన్ని తీసుకురావడంతో అవి అన్యాక్రాంతం కాకుండా కొంతకాలం కాపాడబడ్డాయి. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణి సైట్ తీసుకురావడంతో దాగి ఉన్న భూములు అన్ని బయటకు వచ్చాయి. దాంతో భూబాకాసురుల కన్ను భూదాన భూముల పై పడ్డది. కాలక్రమేనా ప్రభుత్వ భూములతో పాటు, భూదాన భూములు కూడా కన్యాక్రాంతమవుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఖమ్మంలో జరుగుతున్న భూదాన భూముల అక్రమాలపై ప్రభుత్వం తొలగిస్తున్న ఇళ్లను పరిశీలించినప్పుడు, భూదాన భూములు పేదలకు మాత్రమే ఇవ్వాలి. అనే చట్టం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయలేదు. ఖమ్మం నగరం శరవేగంగా పెరుగుతుండటంతో, అమాంతంగా రియల్ భూమ్ పెరిగింది. పేదల నివాసాలు ఏర్పరచుకున్న సర్వే నెంబరు 147 148 149, 21 ఎకరాలు ఏడు కుంటలు, భూమికి కూడా రేటు పెరిగింది. 7, 8 ఏళ్లుగా అక్కడ నివాసదారులు రోడ్లు లేకపోయినా కరెంటు లేకపోయినా, నీళ్ళు లేకపోయినా, విషపురుగులతో సహవాసం చేస్తూ జీవించారు. ఇప్పుడు రేటు పెరిగిందని, ఖాళీ చేయించడం అన్యాయం. ఆ సర్వే నెంబర్ లోనే గురుకుల స్కూల్ కి 10 ఎకరాలు ఇచ్చారు, మొత్తం ప్రభుత్వం 31 ఎకరాల ఏడు కుంటలు మాత్రమే చూపిస్తుంది. ఆసర్వే నెంబర్లో 62 ఎకరాలు ఉన్నట్టుగా తెలిసింది.! మిగతా 31 ఎకరాలు భూమి అన్యాక్రాంతం అయిందా, చూడాల్సి ఉంది. 31 ఎకరాల వివరాలు ప్రభుత్వం చెప్పట్లేదు. ఖమ్మం చుట్టుపక్కల 32వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్టుగా తెలిసింది. ఆ భూమంతా ప్రభుత్వ ఆధీనంలో ఉన్నదా, లేదా అనేది తేలాల్సి ఉంది. ఇండ్లు కూల్చేసిన బాధితులకు ఇందిరమ్మ. ఇల్లు కట్టిస్తామని మంత్రులు చెబుతున్నారు. అసలు ఉన్న భూమి పేదలకు ఇవ్వాల్సిన భూమి, బిపిఎల్ ప్రకారంగా పేదలకు ఉన్నచోటే ఇల్లు కట్టించి ఇవ్వాలి. పేదలు కట్టుకున్న గూడు చెరిపేసి ఎక్కడో ఇల్లు కట్టిస్తామని చెప్పటం విడ్డూరంగా ఉంది. అక్కడ భూమి రేటు పగటం వల్లే, గుడిసెలు పీకేసినట్టుగా కనపడుతుంది. పేదవాడి నివాసానికి 100 గజాలు స్థలం ఇవ్వలేని ప్రభుత్వ తీరు చూసి జాలేస్తుంది. ప్రభుత్వ అండతో రాజకీయ నాయకులు ఖమ్మం చుట్టుపక్కల వందల ఎకరాల గుట్టల్ని రెగ్యులరేషన్ పేరుతో ఆక్రమించుకున్న సంగతి ప్రజలు గమనిస్తున్నారు. ఇందిరమ్మ పాలన, ప్రజా పాలన పేరుతో పేదల గుడిసెలు కుల్చటం ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చింది. రైతులకు సంకెళ్లు వేసి ఖమ్మం వీధుల్లో తిప్పిన, బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపిన విషయం, కాంగ్రెస్ ప్రభుత్వం మరిస్తే మూల్యం తప్పదు.

గౌరవరపు జగదీష్
అధ్యక్షులు 8328199905
తెలంగాణ ఉద్యమకారుల సమాఖ్య

# రాహుల్ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం

మొదటిపేజీ తరువాయి..

రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వివరించారు. ఐదేళ్ల చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారని వివరించారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ



పోరాటం చేశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఇచ్చిన నేతగా సోనియా పేరు చిరస్థాయిగా ఉంటుందని అన్నారు. త్యాగాలు చేసిన కుటుంబం వారిదని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దుర్మార్గాలన్నీ బయటపడుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, రాహుల్ గాంధీ తెలిపారు. మోదీ తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ సూచించారు. అందుకు కార్యకర్తలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. వికారాబాద్లో పీఏసీ సభ్యులతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భేటీ అయ్యారు.ఈ సమావేశంలో రాహుల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇరాన్ లాంటి పరిస్థితులు దేశానికి రాకుండా ఉండాలన్నారు. మోదీ ప్రభుత్వ చర్యల వల్ల ఇండియాలో యుద్ధం వచ్చే పరిస్థితులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండో-అమెరికన్ ట్రేడ్ డీల్తో ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పార్టీ.. ప్రభుత్వం కలిసి మంచిగా పనిచేస్తున్నాయని రాహుల్ పేర్కొన్నారు. సామాజిక అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పార్లమెంట్లో ప్రైవేటు బిల్లు పెట్టాలని పార్టీ సీనియర్ నేత వీహెచ్ కోరగా.. అందుకు రాహుల్ సమ్మతి తెలిపారు. సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాల పీఏసీ సభ్యులు పాల్గొన్నారు. రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్, మహేష్ గౌడ్, వైఎస్ షర్మిల తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్.. ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి అనంతగిరి హరితా రిసార్ట్స్కు బయలుదేరారు. అక్కడ జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొనన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్లో కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ఛార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ, ఏపీ పీసీసీ చీఫ్లు మహేశ్కుమార్ గౌడ్, షర్మిలతో పాటు ముఖ్యనేతలు హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై నేతలతో రాహుల్ చర్చించారు. గత 9 రోజులుగా ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల శిక్షణ శిబిరం అక్కడ కొనసాగుతోంది. అంతుకుముందు ఉదయం ఏఐసీసీ అగ్రనేత, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హైదరాబాద్కు చేరుకున్నారు. ఉదయం శంషాబాద్ ఎయిర్పోర్టుకు చేరుకున్న రాహుల్కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురూ వికారాబాద్ జిల్లాకు బయలుదేరారు. వికారాబాద్ ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రాంగణంలో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశానికి రాహుల్ గాంధీ హాజరు అయ్యారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రస్తుత రాజకీయ అంశాలు, పార్టీ బలోపేతం తదితర కీలక విషయాలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులను ఖరారు చేసే అవకాశం ఉంది. రాజ్యసభ రేసులో అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి, చిన్నారెడ్డి, వీహెచ్, దొమ్మటి సాంబయ్య, బెల్లయ్య నాయక్, హజ్మతుల్లా హుస్సేన్ ఉన్నారు. వికారాబాద్ చేరుకున్న కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మంత్రి వివేక్ వెంకటస్వామి స్వాగతం పలికారు. హెలిప్యాడ్ దగ్గర బొకేతో స్వాగతం పలికిన మంత్రి వివేక్ రాహుల్ గాంధీని శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో సంపత్ కుమార్, షబ్బీర్ అలీ, సునీతారావులు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. సమావేశంలో సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై రాహుల్ గాంధీ చర్చించినట్లు సమాచారం. రాహుల్ గాంధీతో పాటు కేసీ వేణుగోపాల్ సమావేశంలో పాల్గొన్నారు.

## బాన్సువాడ ఘటన దురదృష్టకరం

మొదటిపేజీ తరువాయి..

దురదృష్టకరమని చెప్పారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. పెద్దలతో బేరసారాలు కుదుర్చుకుని వారి జోలికి వెళ్లడం లేదన్నారు. మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలోని భూదాన్ భూముల్లో పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్లో ఎన్ని ఇళ్లున్నాయి? ఎన్ని కూల్చారు? అనే దానిపై చర్చకు సిద్ధమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఏఐసీసీ అగ్రనేత, లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన పర్యటన పాకెట్ మనీ కోసమేనా అని ప్రశ్నించారు. గాంధీ కుటుంబానికి కాంగ్రెస్ రూ.10 వేలకోట్లు ఇవ్వ గలదని సీఎం రేవంత్ రెడ్డే చెప్పారన్నారు. ఒక్క తెలంగాణ నుంచే వెయ్యి కోట్లు గాంధీ కుంబానికి వెళ్తాయని ఆరోపించారు. కామారెడ్డి బాన్సువాడలో జరిగిన కలహాలలో జైలుకి పోయిన బాధితుల కుటుంబ సభ్యులను బండి సంజయ్ పరామర్శించారు. ముఖ్యమంత్రి బలిసినోడిని వదిలి పెట్టి నిరుపేదల జోలికి పోతున్నారు. రాహుల్ గాంధీ చేస్తున్నది రాజకీయ పర్యటనా? లేక కలెక్షన్ల సమీక్షనా? అని రాష్ట్రం చూస్తుందని అన్నారు. హైదరాబాద్ లో ఫాతిమా కళాశాలను వదిలి పెట్టి ఖమ్మంలో కళాశాలలను కూల్చిన గొప్పతనం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది. రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల జోలికి వస్తె అదే బోల్డోజర్లు తీసుకుని నీపైకి వస్తాం. గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయక పోయినా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మనం తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్లనే మనం ఈ గోస పడుతున్నాం. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మనం ఆలోచించి ఓటు వేయాలి. కామారెడ్డిలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డిపై దాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ దాడులు చేస్తే మేము సహించి ఊరుకోవడానికి బిఆర్ఎస్ నాయకులం కాదు. దేశంలో 20 రాష్ట్రాల్లో మేము అధికారంలో ఉన్నాం. అరాచకాలు, కూల్చివేతలు వెంటనే మానండి, ఇలాంటివి పునరావృతం అయితే మా ప్రణాళిక మేము సిద్ధం చేసుకుంటాం. గత 9 రోజులుగా వికారాబాద్ జిల్లా అనంతగిరి గుట్టల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం కొనసాగు వేశంలో పాల్గొని డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నేతలకు దిశా నిర్దేశర చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్గాంధీ ఇక్కడికి వచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళిక బద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై వారితో చర్చించారు.

## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్పై వాదనలు

మొదటిపేజీ తరువాయి..

దాఖలయ్యాయి. కేసీఆర్, హరీశ్ రావు, ఎస్కే జోషి, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన ఈ పిటిషన్లపై ఇవాళ ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వి, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తరపున నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేసీఆర్ తరుపున లాయర్లు వాదనలు వినిపించారు. సాక్షులు ఎవరైనా పిటిషనర్ కు వ్యతిరేకంగా స్టేట్మెంట్ ఇస్తే అప్పడు నోటీస్ జారీ చేసి వారి వాదన వినాలని చట్టం చెబుతుందని కేసీఆర్ తరపు న్యాయవాది వెల్లడించారు. నివేదికలో తీవ్ర ఆరోపణలు చేయడం , పిటిషనర్ పరువు, కీర్తికి నష్టం కలిగేలా చేయడం సరైంది కాదని హైకోర్టుకు తెలిపారు. దే సమయంలో ప్రభుత్వ తరపు న్యాయవాదులు కూడా పలు అంశాలను ప్రస్తావించారు. 'కాళేశ్వరం ప్రాజెక్టులో ఏం జరిగిందో తెలుసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంది. కేసీఆర్, హరీశ్ రావుకు విచారణ కమిషన్ తగిన అవకాశం ఇచ్చింది. తన విధులు నిర్వహించడం లో స్మిత సబర్వాల్ విఫలం అయ్యారని నివేదిక లో ఉంది' అని ప్రభుత్వం తరపు లాయర్లు హైకోర్టు ధర్మాసనంకు తెలియజేశారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను మంగళవారం మధ్యాహ్నం 2.15 కి వాయిదా వేసింది.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967